
లావు బాలగంగాధరరావు

# అనుభవాలు జ్ఞాపకాలు



ప్రజాశక్తి బుక్‌హౌస్

# లావు బాలగంగాధరరావు

## అనుభవాలు - జ్ఞాపకాలు

కలం చిత్రణ

వాసిరెడ్డి సత్యనారాయణ

Best
BOOK CENTRE
Tilak Road, Abids, Hyd

-: ప్రచురణ :-

ప్రజాశక్తి బుక్‌హౌస్

హైదరాబాద్-20

324.254075

C12910

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A.C.No 94864
బాగ్లింగంపల్లి, హైదరాబాద్-500032

ప్రచురణ సంఖ్య : 715
ప్రచురణ కాలం : జూన్, 2002
ప్రతులు : 2000

వెల : రు. 30-00

టైటిల్ : అక్షర్

ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

ప్రతులకు

# ప్రజాశక్తి బుక్‌హౌస్

| | | |
|---|---|---|
| 27-19-14, వి.ఎస్.ఆర్. కాంప్లెక్స్, దుర్గయ్య వీధి, **విజయవాడ-2.** ఫోన్ :577533 | 1-8-52/2, శ్రీరామా కాంప్లెక్స్, చిక్కడపల్లి, **హైదరాబాద్-20.** ఫోన్ : 76[illegible]8107 | షాప్ నెం.47, ఆర్.టి.సి. కాంప్లెక్స్, ద్వారకానగర్, **విశాఖపట్నం** |

| | | | |
|---|---|---|---|
| సుందరయ్యభవన్, బాలాజీనగర్ **ఖమ్మం-507001** | 140, ప్రకాశం రోడ్, **తిరుపతి-517502** ఫోన్ : 23017 | 6-2 250, [illegible] **హన్మకొండ-506001** | సుందరయ్యభవన్ సుభాష్ విగ్రహం (ఎదుట), **నల్గొండ** |



జీవితంలోనూ, రాజకీయపథంలోనూ

నాకు

మార్గదర్శి

**కామ్రేడ్ సుందరయ్యకు...**

# ముందుమాట

నా మిత్రుడు లావు బాలగంగాధరరావు చెప్పిన తన అనుభవాలు, జ్ఞాపకాలు, వాసిరెడ్డి సత్యనారాయణగారు ఎంతో ఓపికతో రాశారు. తన ఆరోగ్యం బాగులేకపోయినా, వయస్సుపైబడ్డా, చిన్న నాటి నుండి తన అనుభవాలు, జ్ఞాపకాలు గుర్తు పెట్టుకొని చెప్పడం గొప్పవిషయం. శ్రమ అనుకోకుండా వీలైనంత వరకూ రోజూ ఒక గంటసేపు విని వ్రాసిందానికి సత్యనారాయణగారిని అభినందిస్తున్నాను.

నాకు లావు బాలగంగాధరరావు 1940 నుండి పరిచయం. విద్యార్థి ఉద్యమంలో కలిసి పని చేశాం. తర్వాత అప్పుడప్పుడు కలుసుకోవడం జరిగింది.

నేను చివరదాకా యీ పుస్తకం చదివాను. బాలగంగాధరరావు ఒక మహోన్నత శక్తి. అందరికి ఆదర్శప్రాయుడు, మన రాష్ట్ర కమ్యూనిస్టు నాయకుల్లో ఒక ముఖ్యుడు. ఒక విధంగా చెప్పాలంటే మన రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా ఎదిగాడు. కమ్యూనిస్టు పార్టీని బలపరచడానికి, ముఖ్యంగా విద్యార్థి, యువజన, వ్యవసాయ కూలీ సంఘాలు బలపడడానికి ఎంతో కృషి చేశాడు. వాటికి నాయకత్వం వహించాడు. ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజల సమస్యలు తీర్చడానికి ప్రయత్నం చేశాడు. తన జీవితాన్నంతా కమ్యూనిస్టు పార్టీకి, ప్రజా ఉద్యమాలకు అంకితం చేశాడు. ఎన్నో త్యాగాలు చేశాడు. తన వాటా ఆస్తి అమ్మి పార్టీకి యిచ్చాడు. జైలుకు పోయినాడు. అజ్ఞాత వాసంలో, ముఖ్యంగా నల్లమల అడవుల్లో వున్నప్పుడు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాడు. తెలంగాణా పోరాటంలో పాల్గొన్నాడు. నీతి, నిజాయితీకి ఎప్పుడూ కట్టుబడి వుండినాడు. నిస్వార్థంగా ప్రజాసేవ చేశాడు. ఈ రోజుల్లో అటువంటి వ్యక్తులు రాజకీయాల్లో చాలా తక్కువ. ఒక మామూలు వ్యక్తిగాని, రాజకీయ వ్యక్తిగాని ఏ పార్టీకి చెందినా సరే ఆయన జీవితాన్ని తెలుసుకొని, నేర్చుకోవలసిన గుణపాఠాలు చాలా వున్నాయి. అధికారానికి ఎప్పుడూ ప్రాకులాడలేదు. ప్రజాసేవ, పార్టీసేవ పరమావధిగా పెట్టుకున్నాడు.

ప్రతి వారూ చదవవలసిన పుస్తకం యిది. వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను.

ముందుమాట వ్రాయమని కోరినందుకు నా మిత్రుడు బాల గంగాధరరావుకు నా కృతజ్ఞతలు.

జస్టిస్ ఆమంచర్ల గంగాధరరావు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి

# ఈ రచన గురించి ఒక్కమాట

రాజకీయ వర్గాలలో, ప్రత్యేకించి వామపక్ష శ్రేణులలో ఎల్.బి.జి.గా సుపరిచితులైన కామ్రేడ్ లావు బాల గంగాధరరావు సుదీర్ఘ రాజకీయ జీవిత అనుభవాలు నేటి యువతరానికి భావితరాలకూ ఉత్తేజాన్ని, ప్రేరణను కలుగజేస్తాయనడానికి ఎలాంటి సందేహం లేదు. దానితోపాటే ఆయా దశలలో నెలకొని ఉన్న సామాజిక, రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకోవటానికి అవకాశం కలుగుతుంది. అందువల్లనే ఆయన అనుభవాలు, జ్ఞాపకాలు గ్రంథస్థం కావాలని కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర నాయకత్వం, ఇతర మిత్రులూ ఆకాంక్షించారు. తదనుగుణంగా ఆయన నుంచి విషయసేకరణ జరిపి, అక్షర రూపమిచ్చే ప్రయత్నం చేపట్టవలసిందిగా నాకు సూచన చేయటం జరిగింది.

నేను యువజనోద్యమ కార్యకర్తగా వుండగా 1958లో ఆయనతో పరిచయం మొదలయింది. ఆ తర్వాత నా జర్నలిస్టు జీవితంలోనూ కొనసాగింది. ఈ విధంగా మొత్తం నలభై సంవత్సరాలకు పైగా ఆయనతోగల సాన్నిహిత్యం కారణంగా, విషయసేకరణ జరిపే పని విశ్వాసంతో మొదలు పెట్టి, 2001 సంవత్సరంలో ఏడెనిమిది మాసాలపాటు అవకాశమున్నప్పుడల్లా ఆయన దగ్గర కూర్చుని నోట్సు రాసుకోవడం జరిగింది. అప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితి బాగా లేదు. ఒక గంటసేపు సంభాషించటం అంటే ఆయనకు ఎంతో ప్రయాసకలుగజేయటమే. అలాంటి స్థితిలో వుండి కూడా తన జ్ఞాపకాలను వివరించటానికి పూనుకున్నారు. చిన్ననాటి తన అనుభవాలను, ఆయా దశలలో గల సామాజిక, రాజకీయ పరిస్థితులను గూర్చి ఓపికగా వివరించారు. అందుకు ఆయన ఎంతో శ్రమపడవలసి వచ్చింది.

ఏకబిగిన కొన్ని గంటలపాటు మాట్లాడగల స్థితిలో ఆయన లేరు. ఆయన విజయవాడలో వున్న రోజులలోనే రోజుకు ఒక గంట చొప్పున ఈ పని సాగింది. ఈ ప్రయత్నం మొదలు పెట్టిన తర్వాత ఏడెనిమిది మాసాలకుగాని విషయసేకరణ పూర్తి కాలేదు. ఆ విధంగా దాదాపు వంద గంటలపాటు ఇంటర్వ్యూ చేసి ఆయన నుంచి సేకరించిన వివరాలను ఈ గ్రంథరూపంలో పాఠకుల ముందుంచటం జరుగుతోంది.

స్వయంగా తానే వ్రాయటానికి ఆయన ఆరోగ్య పరిస్థితి అనుమతించని పరిస్థితులలో, ఆయన అనుభవాలను, జ్ఞాపకాలను గ్రంథస్థం చేయటానికి ఈ పని ఎవరో ఒకరు చేయవలసిందే. ఆ ఒకరు అయ్యే అవకాశం నాకు లభించింది. ఈ

గ్రంథంలో విషయాలన్నీ గంగాధర రావుగారు తన జ్ఞాపకాలను అందించినవే. వాటన్నింటినీ క్రమ పద్ధతిలో కూర్చటం వరకే ఇక్కడ రచయిత పని. దీన్ని రచన అనటం కంటే, గంగాధరరావుగారి జ్ఞాపకాలకు కలం చిత్రీకరణ అనటమే సముచితంగా వుంటుంది. అయితే ఇందులో అక్కడక్కడ ఆయన గూర్చి ఇతరుల నుంచి విన్నవీ, తెలుసుకున్నవీ ఆధారంగా వ్రాసిన మాటలూ వున్నాయి. అలాంటివి కొన్ని మినహా ఈ పుస్తకంలోని విషయం అంతా ఆయన సమకూర్చినదే.

ఆయా దశలలో సామాజిక రాజకీయ పరిస్థితులు ఎలా వున్నదీ ఆయన వివరించారు. సామాన్య ప్రజల మనోభావాలెలా వుండేవో తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో తొలి రోజుల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఏటికి ఎదురీదుతూ, ప్రతికూల పరిస్థితులలో సయితం మొక్కవోని ధైర్యంతో ఆనాటి వారు ఎలా కృషి చేసిందీ తెలిపారు. సందర్భానుసారంగా ఆయా దశలలో కమ్యూనిస్టులు అనుసరించిన వైఖరులలో జరిగిన పొరపాట్లనూ ఎత్తిచూపారు. కొన్నింటిని జ్ఞాపకాలుగా తన మస్తిష్కపు పొరల నుంచి వెలికి తీశారు. మరి కొన్నింటిని, ఫలానాగ్రంధంలో, లేదా ఫలానా తీర్మానంలో ఫలానా విధంగా వున్నదని ఉదహరించి చెప్పారు.

అజ్ఞాతవాస కాలపు అనుభవాలు, కమ్యూనిస్టు పార్టీ తొలిరోజుల నిర్బంధకాలపు అజ్ఞాత వాస జీవితానికి 1962లో చైనా సరిహద్దు సంఘర్షణ సమయంలో, ఆ తర్వాత 1975 అత్యవసర పరిస్థితి కాలంలో అజ్ఞాత జీవితపు అనుభవాలను పోల్చి చూపుతూ, రెండింటికీ మధ్య తేడాను గూర్చి ఆయన వివరించారు.

తెలంగాణా సాయుధ పోరాట కాలంలో నల్లమల అడవులలో, కమ్యూనిస్టు పార్టీ అమరాబాద్ రీజియన్ కార్యదర్శిగా అరణ్య వాసపు అనుభవాలూ, తెలంగాణా పోరాట వీరగాథల గూర్చి చెప్పేటప్పుడు, అలనాటి జ్ఞాపకాలు పెల్లుబికి రాగా, ఆయనే వుత్తేజితుడై మామూలుగా మాట్లాడగలుగుతున్నట్లనిపించేది.

కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో అన్యవర్గ ధోరణులు ప్రబలకుండా నిరంతరం జాగ్రత్త పడుతుండటం అవసరం అని ఆయన పదేపదే చెబుతున్నారు. ఈ సందర్భంలోనే, పునాది వర్గాలను సమీకరించి, సంఘటిత పరచటం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలని ఆయన కోరుతున్నారు. మనదేశ జనాభాలో అత్యధిక సంఖ్యాకులు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవించు తున్నందున వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయ కార్మికుల సమస్యలు తీసుకుని పని చేస్తే రైతులు దూరం అవుతారనే భయంతో వ్యవసాయ కార్మికుల సమస్యలపట్ల నిర్లక్ష్యం తగదు. జాతీయ బూర్జువా వర్గంలో ఒక సెక్షను కమ్యూనిస్టుల వైపుకు రావటమనేది ఆర్థిక పరిస్థితుల ప్రభావంవల్ల జరిగేదేననే విషయాన్ని ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలని ఆయన కోరుతున్నారు.

ఐక్య సంఘటన ఎత్తుగడలను అనుసరించేటప్పుడు 'కలిసి పోరాడుదాం", 'మనంత మనంగా పయనిద్దాం" (Strike together and March seperately) అనే లెనిన్ బోధనను, మావో, తన దేశ కాల పరిస్థితులకు అన్వయించుకుని సమర్థవంతంగా ఆచరణలో పెట్టారు. అలాంటి అనుభవాల నుంచి నేర్చుకోవాలని గంగాధరరావు కోరుతున్నారు. లెనిన్, స్టాలిన్ రచనలు దగ్గర వుంచుకోవటంతోనే సరిపోదు, వాటిని అధ్యయనం చెయ్యాలి. "లెనినిజం-సమస్యలు" వంటి గ్రంధాలను చదువుతూ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన యువతరాన్ని కోరుతున్నారు.

ఇన్ని గంటలపాటు సాగిన ఇంటర్వ్యూలో గంగాధరరావుగారు చెప్పిన అంశాలనే గ్రంథరూపంలో మీ ముందుంచుతున్నాను. కలం సేతలో లోటుపాట్లుంటే సహృదయంతో మన్నించగోరుతున్నాను. నిజానికి ఇందులో రచనా శిల్పం అంటూ ఏమీలేదు.

పదహారేళ్ల వయస్సులోనే 1937లో కొత్తపట్నం రాజకీయ పాఠశాలకు హాజరవటంతో క్రియాశీల రాజకీయాలలో ప్రవేశించడం, 1938లో కమ్యూనిస్టు పార్టీ సభ్యులవటం మొదలు ఎత్తిన జెండా దించకుండా గత ఆరున్నర దశాబ్దాలుగా కృషి సాగించుతున్న కమ్యూనిస్టు నాయకుడు ఆయన. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో 8 సంత్సరాలకుపైగా అజ్ఞాతవాసం, అందులో 18 మాసాలు నల్లమల అడవుల్లో - మూడు సంవత్సరాలకుపైగా కారాగారవాసంలో నిర్బంధ కాండకు గురైనారు. 1943లో కమ్యూనిస్టు పార్టీ పిలుపునందుకొని, తనవాటాకు వచ్చిన నాలుగు ఎకరాల మాగాణి భూమి అమ్మివేసి, ఆ సొమ్మును పార్టీకి ఇచ్చారు. ప్రజాసంఘాలలోనూ, కమ్యూనిస్టు పార్టీలోనూ వివిధ స్థాయిలలో బాధ్యతలు నిర్వర్తించారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘాల నిర్మాణంతో మొదలు పెట్టి, రాష్ట్ర స్థాయిలోనూ అఖిలభారత స్థాయిలోనూ ఆ సంఘ బాధ్యతలు నిర్వహించారు.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోనూ, ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లోనూ గుంటూరు జిల్లా కమిటీ కార్యదర్శిగా, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడుగా, సహాయ కార్యదర్శిగా, కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడుగా, పొలిట్‌బ్యూరో సభ్యుడుగా సేవలందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీగా కృషి కొనసాగిస్తున్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులు, వ్యక్తిగతంగానూ నాకు ఆప్తులు అయిన ఎల్‌బిజి అనుభవాల ఈ గ్రంధరచనలో భాగం పంచుకోగలిగినందుకు ఆనందిస్తూ వాటిని పాఠకుల ముందుంచుతున్నాను.

-వాసిరెడ్డి సత్యనారాయణ

## బాల్యం

లావు బాల గంగాధరరావు, గుంటూరు జిల్లా తెనాలి తాలూకా క్రాప గ్రామానికి చెందిన సంపన్న రైతు కుటుంబంలో 1921 అగస్టు 3వ తేదీన జన్మించారు. క్రాప గ్రామం ఇప్పుడు కొల్లూరు మండలంలో వుంది. ఆయన తండ్రి సుబ్రహ్మణ్యం, తల్లి లక్ష్మీకాంతమ్మ. స్వగ్రామం క్రాపలోనే ప్రాథమిక విద్య అభ్యసించారు. ఆ తర్వాత కొల్లూరు హైస్కూలులో చేరారు. ఆయనకు పదకొండేళ్ళ వయసులోనే తల్లి మృతి చెందారు. ఆయన చదువు సజావుగా సాగటం కోసం తండ్రి తెనాలిలో కైవల్య ఆశ్రమంలో వుంచారు. అక్కడే ఎనిమిదో తరగతి పూర్తి చేశారు. ఆ తర్వాత తురుమెళ్ళ హైస్కూలులో చేర్పించారు. అక్కడ ఆయన హాస్టలులో వుండి చదువుకున్నారు.

బాల్యంలో కైవల్య ఆశ్రమ జీవితం ఆయనను ప్రభావితం చేసింది. ఆశ్రమంలో స్వాములవారు, ఆశ్రమవాసులను బాగా చూసుకోవటంతోపాటు, సేవా కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించుతుండేవారు. ఆశ్రమ జీవితం, ఆశ్రమ నిర్వహణ బాలగంగాధర రావును బాగా ప్రభావితం చేశాయి. పెద్దయ్యాక తన ఆస్తిని ఆశ్రమానికి గాని, లేదా మరేదయినా మంచి పనికి గాని ఇవ్వాలన్న అభిలాష ఆయనలో ఆ రోజుల్లో ఏర్పడింది.

తురుమెళ్ళ హైస్కూలులో చదవటం కూడా ఆయన భావి జీవితాన్ని ప్రభావితం చేసింది. ఆ రోజుల్లో తురుమెళ్ళలో సామాజిక వాతావరణం చదువు, సంస్కారాలు పెంపొందటానికి దోహదకరంగా వుండేది. విద్యార్థుల చదువు సంధ్యల పట్ల ఉపాధ్యాయులు ఎంతో శ్రద్ధ చూపుతుండేవారు. దేశానికి తొలి రాష్ట్రపతిగా పని చేసిన రాజేంద్రప్రసాద్ స్వాతంత్ర్యోద్యమ సందర్భంగా తెనాలి వచ్చారు. తమ హైస్కూలులోని మరికొందరు విద్యార్థులతో సహా బాలగంగాధర రావు రాజేంద్రప్రసాద్ ప్రసంగం వినడానికి తెనాలి వెళ్ళారు. అందుకు గాను ఆయనను హెడ్మాస్టరు

మందలించారు. అంతటితో వూరుకోలేదు. ఆయన తండ్రిని పిలిపించారు. అవసరమయితే హైస్కూలు నుంచి వెళ్ళిపోవటానికయినా సిద్ధమేనని, బాలగంగాధరరావు గట్టిగా నిలబడ్డారు. మంచి మార్కులు తెచ్చుకునే విద్యార్థిని వదులుకోవటానికి సిద్ధపడని హెడ్‌మాస్టర్ మందలింపుతో సరిపుచ్చి ఆయన హైస్కూలులో కొనసాగటానికి అంగీకరించారు.

## రాజకీయ జీవిత ప్రారంభం

అతివాద కాంగ్రెసు నేతల అండదండలతో 1937లో ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని సముద్రతీర గ్రామం కొత్తపట్నం వద్ద నిర్వహించబడిన రాజకీయ పాఠశాలకు హాజరైన వారిలో పలువురు ఆ తర్వాత రాష్ట్రంలో కమ్యూనిస్టు వుద్యమంలో ముఖ్యపాత్ర వహించారు. నాయకులుగా అభివృద్ధి చెందారు. అందుకే రాజకీయ వుద్యమాల చరిత్రలో కొత్తపట్నం రాజకీయ పాఠశాలకు విశిష్ట స్థానం వుంది. 1937లో ఆ రాజకీయ పాఠశాలకు హాజరవటంతో గంగాధరరావులో కమ్యూనిస్టు వుద్యమ బీజాలు నాటుకున్నాయి. నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆ పాఠశాలను నిషేధించింది. దానితో పాఠశాలను పదకొండు రోజులకే ముగించవలసి వచ్చింది.

హైస్కూలు చదువు ముగించి స్కూలు ఫైనల్ పరీక్ష వుత్తీర్ణుడయిన మీదట లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీ గ్రూపుతో ఇంటర్మీడియెట్‌లో చేరినా, చదువు మీద కంటే, రాజకీయాల మీదనే ఎక్కువ శ్రద్ధ చూపడం మొదలెట్టారు. విద్యార్థి వుద్యమంలో క్రియాశీల పాత్ర వహించనారంభించారు. చదువుకోవటానికి కాలేజీకి వెళ్లటం కాదు, రాజకీయాల కోసమే విద్యార్థిగా కొనసాగటం అనే స్థితికి వచ్చారు. ఆయన ఇంటర్మీడియెట్‌లో చేరేసరికి మాకినేని బసవపున్నయ్య అదే కాలేజీలో బి.ఎ. ఫైనల్ ఇయర్‌లో వున్నారు.

రాజకీయాల కోసమే కాలేజికి వెళ్ళడం అనేది గంగాధరరావు తండ్రికి ఇష్టం లేని పని. శ్రద్ధగా చదువుకుంటూ, రాజకీయాలలో ప్రమేయం వుండటం వరకు ఆయనకు అభ్యంతరం వుండేది కాదు. ఆ రోజుల్లో దేశ స్వాతంత్ర్యం కోసం వుద్యమం సాగించుతున్న కాంగ్రెసు పట్ల ఆయన సానుకూల వైఖరి కలిగివుండేవారు. కాని తన కుమారుడు రాజకీయాలలో చురుకుగా పాల్గొనటం ఆయనకు ఇష్టం లేదు. రాజకీయాలలో మునిగిపోకుండా చదువు మీదే కేంద్రీకరింప జేయాలని ఆయన ప్రయత్నించారు. కుమారుడు చదువుకుని పైకి రావాలన్నది ఆయన కోర్కె ప్రథమ సంతానమైన బాలగంగాధరరావుకు పదకొండేళ్ళ వయసులోనే ఆయనకు భార్యావియోగం సంభవించింది. కుమార్తెలు జగదాంబ, సక్కుబాయి ఇంకా

చిన్నవాళ్ళు. ఆ రోజుల్లో ఆయన మరల వివాహం చేసుకోకపోవటమే విశేషం. ఆయనకు అప్పుడు 38 ఏళ్ళ వయస్సు. భార్య మరణించితే మళ్ళీ పెళ్ళి చేసుకోవడము. ఆ రోజులలో సర్వ సాధారణమైన విషయం. "నేనూ అందరిలా మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా వున్నది, మీకోసమే గదా! అలాంటి నా మాట వినకుండా రాజకీయాలలోకి దిగటం న్యాయమేనా?" అంటూ కుమారుడిని మెత్త బరచటానికి ఆయన ప్రయత్నించారు. అయితే గంగాధరరావు అప్పటికే దృఢసంకల్పంతో తాను ఎంచుకున్న బాటనే పయనించటానికి అంకితమయినారు. తండ్రి పట్ల తనకు గల గౌరవం ఆయన పట్టుదలను సడలించలేకపోయింది. డబ్బు పంపటం మానేసి ఒత్తిడి తీసుకు రావటానికి తండ్రి ప్రయత్నించినా ఆయన జంకలేదు. గంగాధరరావు చదువు కొనసాగించటానికి అవసరమయిన డబ్బును బసవపున్నయ్య అప్పటికి సర్దుబాటు చేశారు.

గంగాధరరావు తన చెల్లెలు జగదాంబకు – మాకినేని బసవపున్నయ్యతో వివాహం 1938 మే 5వ తేదీన తానే జరిపించారు. తండ్రి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా బసవపున్నయ్య జీవిత భాగస్వామి కావాలని జగదాంబ చేసుకున్న నిర్ణయానికి అన్నగా గంగాధరరావు అండగా నిలిచారు. ఇరవయ్యేళ్ళ వయస్సులోనే ఆయన నాలుగు వందల రూపాయలు అప్పు చేసి మరీ ఆమె పెళ్ళి చేశారు. అప్పట్లో అది పెద్ద మొత్తమే. ఆ రోజులలో బ్రాహ్మణ వ్యతిరేకతతో సంస్కరణ వివాహాలను ప్రోత్సహించుతున్నవారు ఈ సందర్భంలో ఆయనకు తోడ్పడ్డారు. పెళ్ళి ఏర్పాట్లలో నిమగ్నం అయివున్నందువల్ల ఆ సమయంలో గుంటూరు జిల్లా మంతెనవారి పాలెం వద్ద నిర్వహించబడిన రాష్ట్రస్థాయి రాజకీయ పాఠశాలకు గంగాధరరావు హాజరవలేకపోయారు.

ఆస్తులు అమ్మి పార్టీకి ఇవ్వవలసిందిగా 1943లో కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపునకు స్పందించడంలో బాల గంగాధరరావు ముందున్నారు. ఆస్తిలో తనవాటా పంచుకుని అమ్మివేయాలని నిర్ణయించుకున్నారు. తన వాటా పంచి ఇమ్మని తండ్రిని కోరారు. కాని ఆయన అందుకు విముఖంగా వున్నారు. ఆస్తి పంపిణీకై ఆయన తండ్రితో ఘర్షణ పడుతున్న సమయంలోనే బసవపున్నయ్య వారింటికి వచ్చారు. ముందుగా కూడబలుక్కుని అలా ఏర్పాటు చేసుకున్నారు. బసవపున్నయ్య రాగానే "ఈ విషయం ముందు మీ బావకు చెబుదాం. ఆయన చెప్పినట్లు చేద్దాం అంటూ సుబ్రహ్మణ్యం గారు అల్లుడికి పెద్దరికమిచ్చారు. "పంచుకుంటానంటున్నప్పుడు గొడవెందుకు, ఆయన వాటా ఆయనకు పంచి ఇవ్వండి" అని ఆయన సలహా

చెప్పారు. ఆస్తి పంపిణీ జరిగింది. గంగాధరరావు వాటాకు నాలుగు ఎకరాల భూమి వచ్చింది. పంచుకున్నంత మాత్రాన, ఆ భూమిని అమ్మకానికి పెడితే కొనటానికి ఎవరూ సిద్ధపడరని సుబ్రహ్మణ్యంగారు అనుకున్నారు. అయితే గంగాధరరావు తన వాటాగా వచ్చిన నాలుగు ఎకరాల భూమినీ ఎనిమిదివేల రూపాయలకు అమ్మి వేయగలిగారు. నిజానికి అప్పటి ధరలలోనూ, అది తక్కువే అయినా తన భూమిని కొనటం ద్వారా వారు తనకు సహాయం చేశారనే గంగాధరరావు సంతోషించారు. ఆ మొత్తాన్ని పార్టీకి ఇచ్చివేశారు. ఈ విధంగా ఆస్తులను అమ్మి కమ్యూనిస్టు పార్టీకి ఇచ్చినవారు గుంటూరు జిల్లాలో ఎక్కువ మందే వున్నారు.

## విద్యార్థి ఉద్యమం

గంగాధరరావు 1937లో గుంటూరు ఎ.సి. కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో చేరినప్పటినుంచి విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొనసాగారు. 1938లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందారు. రాజకీయ కార్యకలాపాల్లో మునిగి ఇంటర్మీడియెట్ పరీక్ష ఫెయిలవడంతో ఒక సంవత్సరం వ్యవధి తర్వాతనే డిగ్రీ విద్యార్థిగా మరల కాలేజీలో ప్రవేశించారు. ఆ విధంగా 1940లో ఎ.సి. కాలేజీలోనే బి.ఎ.లో చేరారు. బి.ఎ.లో అయన సహ విద్యార్థియగు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నర్రా అంజనేయులును ఆ తర్వాత నిర్బంధ కాలంలో పోలీసులు కాల్చి చంపారు. 1940 చివరి నుంచి నిర్బంధకాండ సాగుతోంది. బి.ఎ. ఫైనలియర్‌లోకి వచ్చేసరికే గంగాధరరావుపై అరెస్టు వారెంట్ జారీ అయింది. దానితో అయన 1941 ఫిబ్రవరి నుంచి అజ్ఞాతవాసంలోకి వెళ్ళవలసి వచ్చింది. అప్పటినుంచి 1942 ఆగస్టు వరకు ఒకటిన్నర సంవత్సరాల కాలం అజ్ఞాతవాసంలోనే విద్యార్థి వుద్యమంలోనూ, కమ్యూనిస్టు పార్టీ పనిలోనూ నిమగ్నమయ్యారు. 1940–41లో గుంటూరు జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అప్పుడు అధ్యక్షుడుగా ఉన్న రొండా నారపరెడ్డి స్వాతంత్ర్యానంతరం రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. అప్పుడు జరిగిన గుంటూరు జిల్లా విద్యార్థి మహాసభకు జ్యోతిబసు హాజరయ్యారు. ఇంగ్లండుకు వెళ్ళి పెద్ద చదువులు చదివి వచ్చి ప్రఖ్యాతి గడించిన డా.కె బి. కృష్ణ కూడా ఆ సభలో ప్రసంగించారు. అయితే ఆ తర్వాత అయన రాజకీయాలలో లేరు.

ఆ రోజుల్లో గుంటూరు జిల్లాలో మొత్తం 18 హైస్కూళ్ళుండేవి. విద్యార్థి ఫెడరేషన్ కార్యకలాపాలు అక్కడే మొదలయ్యేవి. స్కూల్ ఫైనల్ పబ్లిక్ పరీక్షకు విద్యార్థులందరినీ పంపకుండా వడపోత పోసే డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా

సాగిన వుద్యమంలో విద్యార్థులు బాగా కదిలారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ వుద్యమం పట్ల సానుకూలంగా వుండేవారు. కాలేజీలలోనూ డిటెన్షన్ వ్యతిరేక పోరాటం అప్పటికే సాగుతుండేది. 1938లో జరిగిన గుంటూరు ఎ.సి. కాలేజి విద్యార్థుల సమ్మె ఈ పోరాటంలో ఒక చారిత్రాత్మక ఘట్టం. ఆ వుద్యమాల వూపులో, డిటెన్షన్ వ్యతిరేక పోరాటమే ప్రధాన నినాదంగా, రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ మహాసభ జరిగింది. రాష్ట్రంలో విద్యార్థి వుద్యమ నిర్మాణంలో అఖిల భారత నాయకులూ తోడ్పడుతుండేవారు. రాష్ట్ర కార్యదర్శిగా బసవపున్నయ్య ఎన్నికయ్యారు. ఆయన సారధ్యంలో విద్యార్థి ఫెడరేషన్ డిటెన్షన్ వ్యతిరేక పోరాటాన్ని మరింత వుధృతం చేసింది. గుంటూరు ఎ.సి కాలేజీలో 1938లో జరిగిన విద్యార్థుల సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వ అధికారులు విభజించి పాలించు ఎత్తుగడలను అవలంబించారు. విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తలు కాలేజి గేట్లకు అడ్డంగా పడుకుని పికెటింగ్ చేశారు. అప్పుడు కాలేజి ప్రిన్సిపాల్‌గా వున్న డా.స్ట్రాక్, బర్సార్‌గా వున్న సైప్స్ విద్యార్థుల మీదుగా నడిచి లోపలికి వెళ్ళారు. విద్యార్థుల పోరాటానికి అండగా పుర ప్రముఖుల మద్దతును కూడగట్టడం ద్వారా విద్యార్థి ఫెడరేషన్ ఆ విచ్ఛిన్నాలను అధిగమించగలిగింది. గుంటూరు విద్యార్థుల ప్రభావం రాష్ట్రం అంతటిపైనా పడింది. డిటెన్షన్ వ్యతిరేక పోరాటం ఒక వెల్లువగా పెంపొందింది.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగంగానే రాష్ట్రంలో విద్యార్థి వుద్యమం పునరుజ్జీవం పొందింది. డిటెన్షన్ సమస్యతో పాటు ఎక్కడికక్కడ విద్యాలయాలలో విద్యార్థులకు సంబంధించిన ప్రాథమిక అవసరాల పైనా పని చేయడం జరుగుతుండేది. స్కూలులో విద్యార్థులకు త్రాగునీటి వసతి, పొరుగూళ్ళ నుంచి వచ్చే విద్యార్థులు తమ క్యారేజీలు తినటానికి వసతి, విద్యార్థినులకు మరుగుదొడ్లు, హాస్టళ్ళలో సౌకర్యాలు మొదలయిన వాటికోసం విజ్ఞాపనలు, వీటి ప్రాతిపదికపై విద్యార్థుల సమీకరణ జరుగుతుండేవి. విద్యార్థి ఫెడరేషన్ స్థానిక యూనిట్లు ఎక్కడికక్కడ స్థానిక సమస్యలపై పని చేస్తూనే విద్యావిధానం పట్ల అవగాహన కల్పించుతూ, లోపాలను ఎత్తి చూపుతూ వుద్యమానికి రాష్ట్ర వ్యాపిత స్వరూప స్వభావాలను కలిగించడం జరుగుతుండేది. ఈ కార్యకలాపాల ద్వారా ముందుకొచ్చిన క్రియాశీల కార్యకర్తల రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుండేది. అప్పట్లో ఆరెస్సెస్ నామమాత్రంగా వుండేది. అఖిల భారత విద్యార్థి వుద్యమంలో అంతర్భాగంగానే ఈ పని సాగింది. విద్యార్థి ఫెడరేషన్ దేశంలో ప్రధానమైన విద్యార్థి సంఘంగా విస్తరించింది.

అప్పటికే రెండవ ప్రపంచ యుద్ధం మొదలయింది. హిట్లర్, ముస్సోలినీ, టోజోల నాయకత్వాన జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాల ఫాసిస్టు కూటమి ప్రపంచానికి ప్రధాన ప్రమాదంగా తయారయింది. ఆ పరిస్థితులలో ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడటమే ప్రధానం అని విద్యార్థి ఫెడరేషన్, యువజన సంఘమూ భావించాయి. విద్యార్థి లోకానికి, యువతరానికి ఆ విషయాన్ని వివరించి చెప్పటానికి కృషి చేస్తుండేవి. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వుద్యమాలలో పాల్గొంటున్నందుకు అరెస్టు చేయబడిన కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని కోరుతూ సంతకాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపట్టటం జరుగుతుండేది. అప్పట్లో విద్యార్థులుగా వున్న కమ్యూనిస్టులు, విద్యార్థి వుద్యమం ద్వారా పార్టీ కార్యకర్తలను తీర్చిదిద్దే కృషి సాగించారు.

విద్యార్థి వుద్యమంలో పని చేసిన అనుభవం కలిగిన కామ్రేడ్ జిల్లా కేంద్రంలో వుండటం అవసరమని భావించిన కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకత్వం ఆదేశానుసారం ఆయన గుంటూరు కేంద్రంగా ప్రజాసంఘాలు, పార్టీ నిర్మాణంలో నిమగ్నమయినారు.

ఆ రోజుల్లో విద్యార్థి, యువజన వుద్యమాలే వూపుగా వుండేవి. వ్యవసాయ కూలీ సంఘం, రైతు సంఘం అప్పుడప్పుడే ఏర్పడి, ప్రచార దశలో మాత్రమే వుండేవి. ఒకటి రెండు గ్రామాలలో మాత్రమే వ్యవసాయ కూలీలు గట్టిగా నిలబడి సమ్మెలు చేశారు. ఆ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీకి కొత్త కార్యకర్తలను సమకూర్చటం విద్యార్థి, యువజన వుద్యమాల ద్వారానే జరిగేది. అందునా విద్యార్థి వుద్యమం ప్రముఖ పాత్ర వహించుతుండేది. ఇందులో భాగంగానే వుద్యమ అవసరాల నిమిత్తమే కాలేజీలో చేరినవారున్నారు. మోటూరు హనుమంతరావు అందుకొక ఉదాహరణ. ఆయన కాలేజి చదువుకు మధ్యలో అంతరాయం ఏర్పడినప్పటికీ, రాజకీయ అవసరాలరీత్యా తిరిగి కాలేజీలో చేరారు. ఆయన తిరిగి కాలేజీలో చేరేటట్లు చేయడంలో బసవపున్నయ్యతో పాటు గంగాధరరావు పాత్ర కూడా వుంది. మధ్యలో కొంత అంతరాయం, తర్వాత మోటూరు హనుమంతరావు తిరిగి కాలేజీలో చేరడంతో, వయస్సులో ఆయన కంటే నాలుగేళ్ళు చిన్నవారైన గంగాధరరావూ ఆయన సహ విద్యార్థులయ్యారు. ఆ తర్వాత కమ్యూనిస్టు వుద్యమంలోనూ కలసి పని చేశారు. ఆ రోజుల్లో గుంటూరు అరండల్ పేట మెయిన్‌రోడ్డులో సిటీ స్టూడెంట్స్ ఎంపోరియం' పేరుతో హనుమంతరావు ఒక పుస్తకాల షాపునూ నిర్వహించారు. అభ్యుదయ సాహిత్యాన్ని అందించడంలో అది ఒక కేంద్రంగా వుండేది. రహస్యంగా

ప్రచురించబడుతున్న పత్రిక 'స్వతంత్ర భారత్' ను పాఠకులకు అందజేయటానికి ఆ కేంద్రం వుపకరించేది. దాన్ని పసి కట్టిన పోలీసులు వల పన్నారు. తనను అరెస్టు చేయటానికి గాను పోలీసులు వారెంటు తెచ్చేలోగా హనుమంతరావు తప్పుకున్నారు. అజ్ఞాత వాసంలోకి వెళ్ళారు . బి.ఎ. ఫైనలియర్‌లోకి వచ్చేసరికి గంగాధరరావు పైనా అరెస్టు వారెంటు జారీ అయింది. అయనా అజ్ఞాత వాసానికి వెళ్ళారు.

గుంటూరు కమ్మ హాస్టలు ఆ రోజుల్లో వామపక్ష రాజకీయాలకు కేంద్రంగా వుండేది. ఆనాటి బ్రిటిష్ పాలనకు అనుకూలమైన జస్టిస్ పార్టీకి చెందిన భూస్వాములచే ఏర్పాటు చేయబడిన ఆ హాస్టలు, కులతత్వానికి అతీతంగా వుండే వామపక్ష రాజకీయాలకు నిలయంగా తయారవటమే విశేషం. అప్పట్లో మోటూరు హనుమంతరావు, వై.వి.కృష్ణారావు తదితరులు ఆ హాస్టలులో వుండేవారు. బసవపున్నయ్య, తుమ్మల వెంకట సుబ్బయ్య, కనగాల కుటుంబరావు తదితరులు కొందరు వేరేచోట వుంటూ తమ నివాసానికి "కామ్రేడ్స్ లాడ్జి" అని పేరు పెట్టుకున్నారు. మొదట్లో కొంతకాలం కమ్మ హాస్టలులో వున్న గంగాధరరావు ఆ తర్వాత కామ్రేడ్స్ లాడ్జిలో చేరారు.

విద్యార్థి వుద్యమంతో పాటు, యువజన సంఘాలూ కమ్యూనిస్టు వుద్యమానికి పట్టుగొమ్మలుగా వుండేవి. యువజన సంఘాల కార్యక్రమాలు సాధారణ యువజనులను ఆకట్టుకునేవిగా వుండేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి వయోజన విద్య నేర్పడం జరిగేది. కళ కళ కోసమే కాదు ప్రజా ప్రయోజనం కోసం అనే ధ్యేయంతో పనిచేస్తూ, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల చైతన్యాన్ని పెంపొందించటానికి కృషి చేశారు. సాంఘిక దురాచారాల నిర్మూలనకై వాటిని వుపయోగ పెట్టుకోవటం జరిగేది. నాటికలు, ఏక పాత్రాభినయ పోటీలు నిర్వహించి యువజనులలో దాగివున్న ప్రతిభను వెలికితీయటం జరిగేది. జానపద కళారూపాలను సామాజిక ప్రయోజనం కోసం వుపయోగపెట్టుకునే ప్రయత్నమూ సాగేది. చెడుగుడు ఆటకు బహుళ జనాదరణ వుండేది. పమిడి ముక్కల లక్ష్మణరావు, తాతయ్య తదితరులతో కూడిన కొల్లూరు జట్టు ప్రసిద్ధిగాంచింది. గుంటూరు జిల్లా కూచిపూడికి చెందిన ధనుంజయ రాష్ట్రస్థాయి క్రీడాకారుడుగా వెలుగులోకి వచ్చాడు.

ఈవిధంగా కార్యకలాపాలు నిర్వహించటం ద్వారా యువజనులను, విద్యార్థులను సమీకరించడమే కాదు. వీటిలో ముందు కొచ్చిన యువజనుల అవగాహనను, చైతన్యాన్ని పెంపొందించటం పట్ల శ్రద్ధ వహించేవారు. వారి

రాజకీయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచేవారు. ఆ యువజనులను రాజకీయ కార్యకర్తలుగా తీర్చి దిద్దటానికి కృషి జరుగుతుండేది. క్రియాశీల విద్యార్థి, యువజన కార్యకర్తలను ముందు అగ్జిలరీ సెల్సులో పెట్టి శిక్షణ గరుపుతూ, వారి పని విధానాన్ని, అంకిత భావాన్ని గమనించి నిగ్గు దేరినవారిని పార్టీ సభ్యులుగా తీసుకోవడం జరుగుతుండేది. అంతకంటే ముందు నుంచీ పార్టీ సాహిత్యం చదివించటం ద్వారా వారిని రాజకీయంగా అభివృద్ధి చేయటానికి ఎంతో శ్రద్ధ వహించుతుండే వారు. ఆ విధంగా చాలామంది కార్యకర్తలను తయారు చేసినప్పటికీ అందరూ నిలవలేక పోయేవారు. కాగా కొందరు బాగా అభివృద్ధి చెంది నాయకులుగా రూపు దిద్దుకున్నారు. ఈ విధంగా విద్యార్థి వుద్యమాల ద్వారా కమ్యూనిస్టు పార్టీ విస్తరించుతుండటం కాంగ్రెసు నాయకులకు కంటగింపుగా వుండేది. విద్యార్థులకు రాజకీయాలు వద్దనీ, చదువులకే పరిమితం కావాలని అంటుండేవారు. అయితే కాంగ్రెస్ వారు తమ రాజకీయ అవసరాలకు మాత్రం విద్యార్థులను వుపయోగపెట్టుకుంటుండేవారు.

గుంటూరు జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగా పని చేస్తుండగానే గంగాధరరావు వివిధ జిల్లాలకు వెళ్ళి "యువజనులు, విద్యార్థులు - రాజకీయ నిర్మాణం" అనే కర్తవ్యాన్ని వివరించడం జరిగేది. ఆ తరం విద్యార్థి కార్యకర్తల దృష్టంతా వుద్యమం పైనే వుండేది. చదువు పట్ల శ్రద్ధ నామ మాత్రం. ఉద్యమంలో పాల్గొంటూ చదువునూ నిర్లక్ష్యం చేయకుండా వున్నవారు అరుదుగా వుండేవారు. అలాంటి వారిలో డా వై. రాధాకృష్ణమూర్తి ఒకరు.

బాల గంగాధరరావు, ఆయన సమకాలికులూ విద్యార్థులుగా వున్ననాటి సామాజిక పరిస్థితులను గూర్చి ప్రస్తావించడం కూడా ఈ సందర్భంలో అవశ్యకం. ఆ రోజుల్లో గుంటూరు, కృష్ణా, తదితర కోస్తా జిల్లాలలో సంఘ సంస్కరణ వుద్యమం వూపు నందుకుంది. ఆ సంఘ సంస్కరణ వుద్యమం నాటి రాజకీయ వుద్యమానికి ఎంతగానో తోడ్పడింది. ఫ్యూడల్ ఆధిపత్య దోరణులకు వ్యతిరేకమైన పాత్ర నిర్వహించిన ప్రతి వుద్యమాన్నీ అభ్యుదయ దాయకమైనదిగానే పరిగణించవచ్చు. సంస్కరణలు కూడా ఒకానొక సందర్భంలో విప్లవాత్మక పాత్రను నిర్వహించవచ్చు. ఏదయినా ఒకానొక సామాజిక ఖండం, ఒకానొక నిర్దిష్ట పరిస్థితులలో నిర్వహించిన పాత్రనే ఎప్పుడూ నిర్వహించుతుందని అనుకోవటానికి వీలు లేదు. అనాటి రాజకీయ, సామాజిక పరిస్థితులను వెనుదిరిగి చూసుకుంటూ బాల గంగాధరరావు చెప్పిన మాటలివి అలాంటి సాంఘిక సంస్కరణోద్యమాలు లేకపోవడమే ఉత్తర ప్రదేశ్ వంటి చోట్ల సామాజిక వెనుకబాటు తనానికి కారణమయింది. ఆ తర్వాత

వామపక్ష వుద్యమాలు పెంపొందటానికి అవరోధంగా నిలిచింది ఆ వెనుకబాటుతనమే.

బొంబాయి వంటి చోట్ల కార్మికవర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం పెంపొందింది కాగా, ఆంధ్రలో విద్యార్థి వుద్యమమే పునాదిగా వుంది. మధ్యతరగతి వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులే పార్టీ కార్యకర్తలుగా తయారయినారు. నాయకత్వంలోనూ విద్యార్థి వుద్యమం నుంచి వచ్చినవారే ఎక్కువగా వుండేవారు. పెటీబూర్జువా లక్షణాలు, బలహీనతలు, ఊగిసలాటలు వుండటానికి అదో ప్రధాన కారణం. ఆంధ్రలో 1955 మధ్యంతర ఎన్నికలలో ఓటమి తర్వాత ఏర్పడిన నిరుత్సాహానికి ఈ వర్గపు పునాది పూర్వ రంగమే ప్రధాన కారణం. పార్టీకి ఎదురయిన రివిజనిస్టు, ఉగ్రవాద పెడధోరణుల విషయంలోనూ ఈ ప్రభావం వుంది.

అయితే విద్యార్థి వుద్యమం మనకు అందించిన నాయకులలో, మార్క్సిస్టు మేధావిగా అఖిల భారత స్థాయికి ఎదిగిన మాకినేని బసవపున్నయ్య వంటివారూ వున్నారు. గుంటూరు జిల్లాలో మేధావి వర్గం నుంచి వచ్చి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేసిన పులుపుల శివయ్య రాజకీయ గురువుగా గుర్తింపు పొందారు. తెనాలికి చెందిన పోలేపెద్ది నరసింహమూర్తి గుంటూరు జిల్లాలో తొలి కమ్యూనిస్టు. ఆయన మొదట్లో కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగాను, ఆ తర్వాత రాష్ట్ర కార్యదర్శిగానూ పని చేశారు. ఆయనా, పులుపుల శివయ్య, ప్రభల కృష్ణమూర్తి, అమరవాది కృష్ణమూర్తి గుంటూరు జిల్లా వుద్యమంలో ముందుండి నాటి విద్యార్థి కార్యకర్తలను వుత్తేజ పరుస్తుండేవారు. రాజకీయ తరగతులు నిర్వహించి చైతన్యపరిచేవారు. జొన్నలగడ్డ రామలింగయ్య, మునిపల్లె రామారావు విద్యార్థి వుద్యమం నుంచి చురుకయిన కార్యకర్తలుగా అప్పుడే కమ్యూనిస్టు వుద్యమంలోకి వచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా పనిచేసిన జస్టిస్ అమంచర్ల గంగాధరరావు, జస్టిస్ పి.ఎ. చౌదరి ఆనాటి విద్యార్థి వుద్యమంలో క్రియాశీల పాత్ర వహించారు.

ఆ రోజుల్లో కమ్యూనిస్టు కార్యకర్తలు చేపట్టిన కార్యకలాపాలలో ప్రధానమైనది సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్యాన్ని ప్రచారం చేయడమే. సైద్ధాంతిక పరిజ్ఞానం పెంపొందించటానికీ కృషి సాగింది. రహస్య కాలంలో రాజకీయ సాహిత్యాన్ని అధ్యయనం చేయటానికి పార్టీ సహాయపడుతుండేది. రహస్య పత్రిక "స్వతంత్ర భారత్' పంపిణీ అందులో భాగమే. 1940-42 మధ్యకాలంలో తెనాలి నుంచి 'నగారా' పత్రిక వెలువడేది. చట్టబద్ధమైన ఆ పత్రిక ద్వారా సామ్రాజ్యవాద వ్యతిరేక భావాల వ్యాప్తికై కృషి జరిగింది. కమ్యూనిస్టు పార్టీ నాయకులు అజ్ఞాతవాసం నుంచే ఈ

పత్రికకు మార్గదర్శకత్వం వహించుతూ, ప్రోత్సహించుతూ ముందుకు నడిపేవారు. ఈ పత్రిక నిర్వహణలో మహీధర రామమోహనరావు తోడ్పాటు కూడా వుండేది.

కార్మిక వర్గపార్టీ గనుక నాయకులు కార్మికులను సంఘటిత పరచడం మీద దృష్టిని కేంద్రీకరించి, అంకితభావంతో కృషి చేస్తుండేవారు. యువజన, విద్యార్థి సంఘాలు సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యంగా, స్వాతంత్ర్యోద్యమంలో నిర్బంధించబడిన నాయకుల విడుదలకై సంతకాల సేకరణ వంటి రూపాలతో ఆందోళన సాగించడం జరిగింది.

కమ్యూనిజం పై రాల్ఫ్‌ఫాక్స్ రచన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని గూర్చి తెలుసుకోవటానికి ఎంతో వుపకరించింది. పార్టీ హోల్‌టైమర్‌గా వున్న మునిపల్లె రామారావు ఆ పుస్తకాన్ని గంగాధరరావుకు పరిచయం చేశారు. మునిపల్లె రామారావు నిరాడంబరత, అధ్యయనం, ఆచరణ గంగాధరరావును ప్రభావితం చేశాయి. ఆ రోజుల్లో పార్టీ హోల్‌టైమర్‌కు నెలకు 7 నుంచి 15 రూపాయల వరకు అలవెన్సుగా లభించేది. దాంతోనే ఆయన తన అవసరాలు తీర్చుకుంటూ, తన కొరకు వచ్చే కామ్రేడ్స్‌కు ఆతిథ్యమిచ్చి ఆదరించుతుండేవారు. దుస్తుల విషయంలో నిరాడంబరంగా వుండటమే గాక, ఆహారం విషయంలోనూ ప్రత్యేక పద్ధతులను అనుసరించేవారు. కేవలం అరటిపళ్ళు, కొబ్బరికాయల వంటి వాటితోనే సరిపుచ్చుకున్న పూటలుండేవి. గుంటూరు జిల్లా పొన్నూరు సమీపాన గల మునిపల్లె గ్రామానికి చెందిన రామారావు. ఎం.ఎ.ఎల్.ఎల్.బి డిగ్రీలు పొందారు. ఆ రోజుల్లో ఆ చదువుకు మంచి వుద్యోగం వచ్చే అవకాశం ఉంది. అయినా ఆయన అవైపు ప్రయత్నం చేయలేదు. జాతీయ స్వాతంత్ర్యం కోసం, కమ్యూనిస్టు వుద్యమం కోసం పని చేయాలని సంకల్పించారు. మచిలీపట్నం (బందరు) కేంద్రంగా కార్మికోద్యమ నిర్మాణానికి పూనుకున్నారు.

1942 జులైలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించారు. 18 మాసాల అజ్ఞాతవాసం అనంతరం గంగాధర రావు తిరిగి బహిరంగంగా పనిచేయ నారంభించారు. మరల ప్రజా సంఘాల కార్యకలాపాలలో, పార్టీ నిర్మాణంలో నిమగ్నమయ్యారు. అంతవరకూ అజ్ఞాతంగా వున్నదీ పార్టీ కార్యకలాపాలు సాగించటానికే. అజ్ఞాతవాసంలోకి వెళ్ళటానికి ముందే గుంటూరు జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నికై విద్యార్థి వుద్యమంలోనూ, విద్యార్థులలో పార్టీ నిర్మాణం చేయటానికీ పని చేస్తూ వచ్చారు. ఇక మీదట యువజన రంగంలో పని చేయవలసిందిగా పార్టీ ఆయనను ఆదేశించింది. ఆ రోజుల్లో విద్యార్థి రంగం నుంచే పార్టీ కార్యకర్తలు తయారవుతుండేవారు. అందువలన వెనుకబడిన ప్రాంతాలలో

పని చేయటానికి వారిలో కొందరిని పంపుతుండేవారు. అందులో భాగంగానే గుంటూరు జిల్లా వినుకొండలో వుండి పని చేయవలసిందిగా గంగాధరరావును కోరారు. కాని, గుంటూరు జిల్లా పార్టీ నాయకత్వం పునరాలోచించి ఆ నిర్ణయాన్ని మార్పు చేసింది. 1942 నుంచీ ఆయన మరోవైపు పార్టీ నిర్మాణం మీద కూడా దృష్టి కేంద్రీకరించారు.

భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా పి.సి. జోషి పని చేస్తున్న ఆ రోజులలో దేశంలో విద్యార్థి, యువజనోద్యమ కార్యకలాపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ముమ్మరంగా సాగాయి. మౌలిక వర్గ సమస్యల పట్ల అప్పట్లో అంతగా శ్రద్ధ చూపడం జరగలేదు. అయితే ప్రజల నిత్య జీవితావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడానికి ప్రయత్నం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం సాగుతున్నందున నిత్య జీవితావసరాలు లభ్యమవక, లభ్యమయినా చీకటి బజారులో ఎక్కువ ధర చెల్లించి కొనవలసి రావటం కారణంగా సామాన్య ప్రజలు నానావస్థలు పడుతున్న దశలో ఈ విధమైన కృషి చేయటం వల్ల ప్రజల ఆదరణ లభించింది. రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం అప్పులు, ఎరువులు, బండి పట్టాలు, సామాన్య ప్రజలకు అవసరమయిన కిరోసిన్, వంటనూనెలు, తిండిగింజలూ లభింప జేయటానికి ఈ కృషి దోహదపడింది.

ఈ సందర్భంలోనే రెండవ ప్రపంచ యుద్ధాన్ని గూర్చి, ఆ యుద్ధం పట్ల కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన వైఖరి గూర్చి చెప్పుకోవలసిన అవసరం వుంది. 1939 సెప్టెంబరులో హిట్లరు పోలెండు దేశం మీద దాడి చేశాడు. ఆ వెంటనే బ్రిటన్, ఫ్రాన్సు, దేశాలు జర్మనీ పై యుద్ధం ప్రకటించాయి. దేశాన్నేలుతున్న బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని ఆ యుద్ధంలోకి లాగారు. భారత ప్రజలు ఆ యుద్ధానికి సహకరించాలంటే బ్రిటిష్ ప్రభుత్వం ముందుగానే తన యుద్ధలక్ష్యాలను ప్రకటించాలనీ, పాలనా నిర్వహణలో దేశ ప్రజలకు భాగస్వామ్యం కల్పించే దిశలో కొన్ని షరతులు నెరవేర్చాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కోరింది. బ్రిటిష్ ప్రభుత్వం అందుకు తిరస్కరించింది.

యుద్ధాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ వెనువెంటనే ప్రకటన చేసింది. కమ్యూనిస్టు పార్టీ చొరవతో బొంబాయిలో తొంభైవేల మంది కార్మికులు సమ్మె చేశారు. అదే విధంగా దేశంలో మరికొన్ని పారిశ్రామిక కేంద్రాలలోనూ సమ్మెలు జరిగాయి. అదే సమయంలో విద్యార్థులూ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ముందుకొచ్చారు. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ దేశంలో

అత్యంత శక్తిమంతమైన సంస్థగా అభివృద్ధి చెందింది. అతివాదభావాలు కలిగిన, సమరశీల విద్యార్థులను సమైక్యపరచింది. ఆంధ్రప్రాంతంలోనూ విద్యార్థి వుద్యమం అనలు తొడిగింది. బలీయమైన ప్రజా సంఘంగా పెంపొందింది.

దీంతో బ్రిటిష్ ప్రభుత్వం డిఫెన్సు ఆఫ్ ఇండియా రూల్స్‌ను అమలు జరిపింది. 1940 జూన్ నుంచి దేశమంతటా కమ్యూనిస్టులను, ఇతర అతివాదులను అరెస్టు చేయటం మొదలు పెట్టింది. ఆంధ్ర ప్రాంతంలోనూ అరెస్టులు జరిగాయి. కమ్యూనిస్టు నాయకులు పలువురు అజ్ఞాతవాసానికి వెళ్ళవలసి వచ్చింది. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించబడింది.

ఇంతలోనే 1941 జూన్‌లో సోవియట్ యూనియన్‌పై జర్మనీ దాడి చేసింది. దానితో యుద్ధ స్వభావంలో మార్పు వచ్చింది. మూడు ఫాసిస్టు రాజ్యాలకు - జర్మనీ, జపాన్, ఇటలీ - వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా వుద్యమం ప్రారంభమయింది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఏర్పడిన నూతన పరిస్థితిని గూర్చి చర్చించిన మీదట భారత కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో 1942 ఫిబ్రవరిలో ఒక తీర్మానం చేసింది. "ప్రజా యుద్ధంలో భారత ప్రజలు ప్రధాన పాత్ర వహించాలి" అని పిలుపు నిచ్చింది. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించబడింది. కమ్యూనిస్టు నాయకులను జైళ్ళనుంచి విడుదల చేయడం మొదలయింది. అజ్ఞాతవాసంలో వుంటూ కార్యకలాపాలు నిర్వహించుతున్న నాయకులూ బహిరంగంగా పనిచేసే వీలు కలిగింది.

ఆనాడు ఫాసిజం ప్రపంచానికి ప్రధానమైన ప్రమాదంగా వున్నందున, ఫాసిజాన్ని ఓడించడమే ప్రప్రథమ కర్తవ్యంగా పరిగణించుతూ కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న నిర్ణయం, అందుకు అనుగుణంగా చేపట్టిన అచరణ, దేశ ప్రజలలో కమ్యూనిస్టు పార్టీ పట్ల అపోహలు ఏర్పడటానికి దారి తీశాయి.

సోవియట్ యూనియన్‌పై జర్మనీ దాడితో యుద్ధ స్వభావమే మారిపోయిందని, ఫాసిస్టు దేశాలైన జర్మనీ, ఇటలీ, జపానులకు వ్యతిరేకంగా సాగే యుద్ధం ప్రజాయుద్ధం అని, అందువల్ల భారత దేశంలోనూ యుద్ధ ప్రయత్నాలను బలపరచడం అవసరం అనే వైఖరితో కమ్యూనిస్టు పార్టీ తన కార్యకలాపాలను తీర్చి దిద్దుకున్నది. అది ప్రజాయుద్ధం ఎలా అవుతుంది? అనే అంశంపై ప్రజల మధ్య పెద్ద ఎత్తున చర్చ సాగింది. ఆంధ్రలోనూ అదే చర్చ జరిగింది. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడటమే ప్రధానం అనే వాదనను విద్యార్థి లోకానికి నచ్చ జెప్పటానికి విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తలు కృషి చేశారు. అయితే కమ్యూనిస్టు పార్టీ వైఖరిని

అందరూ సరిగా అర్థం చేసుకోలేకపోయారు. ప్రజాయుద్ధ నినాదాన్ని బలపరచడం జాతీయ వ్యతిరేక చర్యగా చిత్రించుతూ శత్రువులు ప్రచారం చేశారు. నిజానికి, కమ్యూనిస్టు పార్టీ ఆనాడు ఆ వైఖరి తీసుకోవటం దేశభక్తితో చేసిన పనే. భారతదేశం మీద జపాన్ ఆధిపత్యం వస్తే ప్రజలు మరింతగా అవస్థల పాలు కావలసి వస్తుందని, అలా కాకుండా నివారించాలన్న వుద్దేశంతోనే కమ్యూనిస్టు పార్టీ ఆనాడు ఫాసిస్టు వ్యతిరేక పంథాను చేపట్టడం జరిగింది. అయితే ఆనాడు మన దేశాన్ని పరిపాలించుతున్నది బ్రిటిష్‌వాళ్ళు. అందువల్ల కమ్యూనిస్టు పార్టీ రాజకీయ వాదనలు అందరికీ నచ్చలేదు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడవలసిన ఆవశ్యకతను, ఆ పోరాటం ప్రాధాన్యతను గుర్తించి, ఫాసిజం ప్రధాన ప్రమాదంగా ఎంచి పని చేస్తూనే, ఆనాడు మన దేశాన్ని పాలించుతున్న బ్రిటిష్ పాలకులపై పోరాటం విషయంలో మెతకదనం లేకుండా వ్యవహరించి వుంటే వుద్యమం మరింత బలపడి వుండేది. ఫాసిస్టు వ్యతిరేక నినాదంతో ఆ రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ భారత దేశంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రక్కన పెట్టటం వల్ల జరిగిన నష్టాన్ని తర్వాత గుర్తించడం జరిగింది. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులుగా మాకినేని బసవపున్నయ్య, చండ్రరాజేశ్వరరావు, యస్.ఏ. డాంగే, అజయ్‌ఘోష్ 1950లో రహస్యంగా మాస్కో చేరుకుని, ఆనాటి సోవియట్ అధినేత, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి స్టాలిన్‌తో చర్చలు జరిపిన సందర్భంలోనూ ఈ అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగుతున్న ప్రజా ఉద్యమాల పట్ల ఆకర్షితులై ముందుకొచ్చిన కొందరు, ఆనాడు బ్రిటిష్ పాలకుల పట్ల పార్టీ అనుసరించుతున్న వైఖరి కారణంగా దూరమయ్యారు. అప్పట్లో భారత కమ్యూనిస్టు పార్టీ చేసింది పూర్తిగా సరికాదని స్టాలిన్ వ్యాఖ్యానించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడివుండవలసిందని కూడా ఆయన చెప్పారు. సోవియట్ యూనియన్ జర్మనీపై సాగించే యుద్ధాన్ని, భారత కమ్యూనిస్టు పార్టీ తనదిగా చేసుకోవటం, ప్రజా యుద్ధ నినాదాన్ని చేపట్టటం సాధారణ ప్రజల మనోభావాలకు విరుద్ధం. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలనేదే ఆనాడు భారత ప్రజల అభీష్టం,అభిమతం. అందువల్లనే స్టాలిన్ అప్పుడు భారత కమ్యూనిస్టు నాయకులకు సూటిగా చెప్పారు. "మా యుద్ధం, మీ యుద్ధం ఎలా అవుతుంది? భారత కమ్యూనిస్టు పార్టీ అలా ప్రకటించి వుండవలసింది కాదు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చురుకుగా సాగించి వుండవలసింది అని స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆ తర్వాత ఆత్మవిమర్శ చేసుకుంది. అయితే ఆ దశ గడచిన అనంతరమే అది జరిగింది.

కాగా రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో ప్రజా యుద్ధ నినాదంతో పనిచేసే సందర్భంలో కమ్యూనిస్టు శ్రేణులు జాతీయోద్యమ ప్రధాన వాహినికి ఎదురీదవలసి వచ్చింది. గాంధీ, నెహ్రూల అభీష్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేసి గెలిచిన సుభాస్ చంద్రబోస్ అతివాద కాంగ్రెస్ నేతగా ఆనాటి యువతరానికి ఉత్తేజం కలుగజేశారు. గాంధీజీ నాయకత్వాన కాంగ్రెస్ అనుసరించుతున్న విధానాల పట్ల అసంతృప్తితో ఆయన ఇతర మార్గాలను గూర్చి ఆలోచించేవారు. గాంధీజీ ప్రతిపాదించిన అభ్యర్ధి డా. భోగరాజు పట్టాభి సీతారామయ్యపై సుభాస్ చంద్రబోస్ పోటీ చేసినప్పుడు, అప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న సుందరయ్య తదితర కమ్యూనిస్టులు సుభాస్ చంద్రబోస్ అభ్యర్థిత్వాన్నే బలపరిచారు. పట్టాభి ఆంధ్రుడు గనుక, ఆంధ్ర ప్రతినిధులంతా ఆయనకే వోటేయాలనే నినాదానికి మెత్తబడక, “అతివాద విధానం కావాలి. బోస్ గెలుపే అతివాదం గెలుపు” అని స్పష్టం చేస్తూ ఆంధ్రకు చెందిన అతివాద కాంగ్రెస్ వాదులు తీసుకున్న వైఖరివల్లనే స్వల్ప మెజారిటీతో బోసు గెలుపు సాధ్యమయ్యింది.

“మన శత్రువుకు శత్రువు, మనకు మిత్రుడు” అనే సూత్రంతో బోస్ తన వ్యూహాన్ని చేపట్టారు. మన దేశాన్ని పరిపాలించుతున్నది బ్రిటిష్‌వాళ్ళు. వాళ్ళ పెత్తనాన్ని వదిలించుకోవడం కోసం మనం పోరాడుతున్నాం. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్, ఇటలీలు -బ్రిటన్‌కు వ్యతిరేకంగా వున్నాయి. కాబట్టి ఆ దేశాల తోడ్పాటు పొందాలని ఆయన పథకం వేసుకున్నారు. ఈ పరిస్థితులలో సుబాష్ చంద్రబోస్ పాత్రను గురించి వివరించే సందర్భంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించి వుండవలసింది. అదొక సున్నితమైన సమస్య. ఫాసిస్టు ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయటానికి వీలు లేదు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిస్టు శక్తులు విజయం సాధించగలిగితే ప్రపంచంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఏర్పడబోయే ముప్పును గూర్చి ప్రజలకు వివరించడం అవసరమే. ప్రపంచానికీ, అలానే భారత ప్రజలకూ ప్రధాన ప్రమాదం ఫాసిజమేననే విషయాన్ని, ప్రమాద తీవ్రతను తెలియ జెప్పవలసిందే. అయితే ఈ సందర్భంలో సుభాష్ చంద్రబోస్ పాత్రను గూర్చి చెప్పేటప్పుడు ఆచి తూచి వ్యవహరించి వుండవలసింది. సహాయం కోసం ఆయన జపాన్ వెళ్లటం ఎలా పొరబాటో వివరించటం అవసరమే. అయితే అంతటితో ఆగక, పంచమాంగదళంగా పేర్కొంటూ ఆయనపై దాడి చేయటం వల్ల నష్టం జరిగింది. ఫాసిస్టు ప్రమాదాన్ని ఆయన గుర్తించలేదనడం వరకు సరయినదే కాని ఆయన చిత్తశుద్ధిని, దేశభక్తిని శంకించే విధంగా వ్యాఖ్యలు చేయడం జరిగి వుండవలసింది కాదు. ఫాసిస్టు ప్రమాదాన్ని గూర్చి ప్రజలకు ఓర్మితో వివరించి వుండవలసింది.

కాగా కమ్యూనిస్టు పార్టీ ఆనాడు ప్రజాయుద్ధం నినాదంతో చేపట్టిన కార్యకలాపాలు, ఆనాటి ప్రజల మనోభావాలను నొప్పించాయి. పార్టీ జాతీయోద్యమ ప్రధానవాహినికి ఎదురీదవలసి వచ్చింది.

అయినప్పటికీ క్రమశిక్షణ గల సైనికులుగా పార్టీ ఆదేశాలను పాటించుతూ, కమ్యూనిస్టు శ్రేణులు మొక్కవోని ధైర్యసాహసాలను ప్రదర్శించారు. ప్రజాయుద్ధం నినాదంతో ప్రచారం సాగించారు. సభలు జరిపారు. సుభాష్ చంద్రబోస్ పాత్రపై విమర్శలు చేశారు. మరోవైపున జైళ్ళనుంచి కాంగ్రెస్ నాయకుల విడుదల కోరుతూ సంతకాల సేకరణ జరిపారు. కాంగ్రెసుతో కూడిన జాతీయ ప్రభుత్వం కావాలని, అలాంటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనిదే, ఆనాడు సాగుతున్న ఫాసిస్టు వ్యతిరేక యుద్ధానికి వ్యతిరేకంగా భారతదేశ ప్రజలను సమీకరించడం సాధ్యం కాదని కమ్యూనిస్టు పార్టీ ప్రచారం సాగించింది.

అంతేగాక యుద్ధభారాన్ని సామాన్య ప్రజలపై మోపటానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలన్నిటినీ కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకించింది. నిర్బంధకాండను ఎదిరించింది. అధికారుల అవినీతికి వ్యతిరేకంగా రంగంలో నిలిచింది. సుభాష్ చంద్రబోస్ నిర్మించిన ఆజాద్ హింద్ ఫౌజ్ (ఐ.యన్.ఏ) కు చెందిన వారిపై రెండవ ప్రపంచ యుద్ధానంతరం బ్రిటిష్ పాలకులు పెట్టిన కేసులకు వ్యతిరేకంగా ఆందోళనలో, పోరాటాలలో కమ్యూనిస్టు పార్టీ చురుకుగా పాల్గొన్నది.

"అంతర్జాతీయ పరిస్థితితో జాతీయ పరిస్థితిని సమన్వయం చేయడంలో విఫలమైనాము... మన దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రపంచ శాంతి పోరాటం పేరుతో, దానికి లోబడి వుంచడం సరికాదన్నది సక్రమంగానే అవగాహన చేసుకున్నాం కానీ, తీరా సమస్య ముందుకొచ్చేసరికి అన్వయించటంలో విఫలమయ్యాం" అని సుందరయ్య గారు తన స్వీయ చరిత్రలో పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంలో గమనించాలి.

జపాన్ భారతదేశం మీద దాడిచేస్తే ఆ సమయంలో జపాన్ మీద పోరాడటం ప్రధానం అవుతుంది. ఈలోగా దేశం లోపలి పోరాటాలే ప్రధానంగా ఐక్య సంఘటన ఎత్తుగడలను రూపొందించుకొనివుండవలసింది. కాని ఆ విషయంలో అప్పుడలా చేయటంలో పార్టీ విఫలమయింది.

జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ విప్లవం పట్లనూ, సోషలిజం పట్లనూ సానుకూలంగా వుండటాన్ని వుపయోగపెట్టుకుని ముందుకు పోవాలని, బూర్జువా వర్గంలో కలిసొచ్చే వారిని కలుపుకుపోవాలని బ్రిటిష్ కమ్యూనిస్టు నాయకుడు

పామీదత్ సూచించారు. అయినా మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆ దశలోనూ జాతీయ బూర్జువా వర్గాన్ని అంటరానిదిగానే పరిగణించింది. కాగా, చైనా కమ్యూనిస్టు పార్టీ తమ దేశంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో జాతీయోద్యమంలో ముందు పీఠిన నిలిచింది. మన దేశంలో ఆవిధంగా మమేకమవలేదు. ఎత్తుగడల విషయంలో జరిగిన ఈ పొరపాటును ఆ తర్వాత గుర్తించడం జరిగింది.

ప్రజాయుద్ధ నినాద కాలంలో, జాతీయోద్యమ ప్రధానవాహినికి ఎదురీదుతూనే పార్టీ ఆదేశాలను పాటించుతూ, కమ్యూనిస్టు కార్యకర్తలు రాజకీయ ప్రచారం సాగించారు. ఆ సందర్భంగా సభలు నిర్వహించేటప్పుడు వ్యతిరేకుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుండేది. సభలు జరుపుకునేటప్పుడు కొట్లాటలకు సిద్ధ పడవలసి వచ్చేది. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా అమృతలూరు వంటి చోట్ల ఆచార్య రంగా కవ్వింపు ప్రసంగాల అనంతరం ఆ ప్రాంత గ్రామాలలో వ్యతిరేకులు రెచ్చిపోయారు. కమ్యూనిస్టు పార్టీ ప్రచారాలను, సభలనూ భగ్నం చేసే ప్రయత్నాలు ఎక్కువయినాయి.

"....... తెనాలి తాలూకా అమృతలూరులో ఈ విధంగానే జరిగింది. గంగాధర రావు తదితరులు నిలబడి వారిని తరిమి కొట్టారు. మా వాలంటీర్లదళాలకు అవసరమైన శిక్షణ, డ్రిల్లు నేర్చుకున్నాము. నాలుగు లైన్లలో సైనిక దళాల మాదిరిగా, ఈ వాలంటీర్ దళాలు రక్షణ వలయంగా వుంటూ వుండేవి. మొదటి వలయాన్ని ఛేదించుకుని వచ్చినా, రెండవ వలయంగా వున్న వాలంటీర్లు తిప్పి కొట్టేవారు..." అని సుందరయ్య గారు తన స్వీయచరిత్రలో పేర్కొన్నారు.

ఆ రోజుల్లో కమ్యూనిస్టులు దెబ్బ కాచుకుని ఆత్మరక్షణ చేసుకునే స్థితిలో గాక, తామే ముందుగా దాడి చేయటానికి సన్నద్ధంగా వుండేవారు. ఆ విధంగా తెనాలి తాలూకాలోనూ కొట్లాటలు జరుగుతుండేవి. అలాంటి వాటిలో ముఖ్యమైన సంఘటనల్లో గంగాధరరావు ప్రత్యక్షంగా పాలుపంచుకుంటుండేవారు. ఆ తర్వాత 1952 ఎన్నికల్లో దుగ్గిరాల నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో వోడిపోయిన అజానుబాహుడగు రైతు కామ్రేడ్ కోగంటి కోటయ్య అలాంటివాటిలో పాల్గొంటుండేవారు.

తెనాలిలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో నాయకుల ప్రసంగాలు విననివ్వకుండా కాంగ్రెస్ వాళ్ళు గోల చేశారు. కమ్యూనిస్టు వాలంటీర్లు ఎదుర్కోవటంతో వాళ్ళు పారిపోయారు. కాని కక్షగట్టి దెబ్బ తీయాలని పథకం వేసుకున్నారు. భోజనం చేయుడం కోసం తెనాలి సెంటరులోని ఒక హోటల్‌కు వచ్చినప్పుడు గంగాధరరావును కొట్టటానికి పథకం వేశారు. ఆయన కోసం కాపు

కాశారు. అయనను కొట్టటం కుదరక పోయేసరికి కక్షతో ఆయన చేతిని కొరికారు. ఆ గాయం జాడ ఆయన చేతి మీద ఇప్పటికీ కనిపించుతూనే వుంటుంది.

ఆ రోజులలో ఎక్కడయినా కమ్యూనిస్టు పార్టీ బహిరంగ సభ తలపెడితే దానిపై వ్యతిరేకులు చేసే దాడులను ఎదుర్కొనటానికి సన్నద్ధమై వుండటం కూడా అవసరమయ్యేది. తెనాలి తాలూకా అమృతలూరు, రేపల్లె తాలూకా రాజవోలు గ్రామాలలో ఈ విధంగా వ్యతిరేకుల దాడిని తిప్పికొట్టి సభ జరుపుకోవటానికి గట్టిగా దెబ్బలాటకు దిగవలసి వచ్చింది. ఆ తర్వాత, ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో ఎక్కడ కమ్యూనిస్టు సభ జరిగినా సరే, దాన్ని భగ్నం చేయించేవాళ్ళకు అమృతలూరు దళం అంటే సింహస్వప్నంగా వుండేది.

ఆ రోజుల్లో పార్టీ నాయకులు సయితం స్వయంగా ముందు నిలిచి వ్యతిరేకుల దాడులను ఎదుర్కొనేవారు. బెజవాడ (విజయవాడ)లో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం మీద జరిగిన దాడిని తిప్పి కొట్టడానికి చండ్ర రాజేశ్వరరావు స్వయంగా కర్ర తీసుకుని ముందు నిలబడ్డాడు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడటమే ప్రధాన కర్తవ్యమని కమ్యూనిస్టు పార్టీ తీసుకొన్న వైఖరి కారణంగా అనాటి బ్రిటిష్ పాలకులు భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ పట్ల తమ వైఖరిని తాత్కాలికంగా మార్చుకున్నాయి. అప్పుడు పార్టీ ప్రధాన కార్యదర్శిగా వున్న పి.సి.జోషి పై స్థాయిలలో మాట్లాడిన మీదట కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు కొందరికి మిలటరీ ట్రెయినింగు ఇవ్వటానికి పాలకులు ఏర్పాటు చేశారు. భారతదేశం మీద జపాన్ దాడి జరిగితే ఎక్కడికక్కడ ఎదుర్కొనడానికి సన్నద్ధం చేయటానికి ఆ శిక్షణ గరిపారు. ఆ విధంగా మిలటరీ శిక్షణ పొందినవారిలో గంగాధరరావు ఒకరు. అనాడు ఆ విధంగా శిక్షణ పొందటం తర్వాత తెలంగాణా పోరాట కాలంలో వుపయోగపడింది.

యుద్ధానికి సహకరించాలన్న అనాటి వైఖరికి అనుగుణంగా కృష్ణాజిల్లాల్లో బందరు కాలవ పూడిక తీసే కార్యక్రమాన్ని చేపట్టటానికి కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. 1943లో నిర్వహించబడిన ఆ కార్యక్రమాన్ని గూర్చి గ్రామాలలో ఇప్పటికీ కథలుగా చెప్పుకుంటారు. కమ్యూనిస్టు వాలంటీర్లు చేసిన కృషి రైతాంగంలో కమ్యూనిస్టు పార్టీ పట్ల సద్భావం పెంపొందటానికి దోహదపడింది.

బెజవాడ (విజయవాడ) వద్ద కృష్ణానదిపై నిర్మించబడిన అనకట్ట వల్ల ఏర్పడిన జలాశయం నుంచి పంట పొలాలకు సాగునీరు అందించటానికి గాను ఏర్పాటు చేయబడిన బందరు కాలువ పూడుకుపోయింది. లోతు తగ్గింది. పూడిక తీస్తే

తప్పు నీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడింది. నీరు పుష్కలంగా అందితే గాని పంటలు పండవు. అయినా పూడిక తీయించడం అధికారుల వల్ల కాలేదు. ఆ పని పూర్తి చేయటానికి అవసరమైన కూలీలను సమీకరించలేక పోయారు. ఈ పరిస్థితులలో మామూలు కూలి తీసుకుంటూ ఆ కాలవ పూడిక తీసే పని పూర్తి చేయాలని కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. పార్టీ సభ్యులంతా వాలంటీర్లుగా వచ్చి ఆ పనిలో పాల్గొనాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపు నిచ్చింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వాలంటీర్లు వచ్చి పాల్గొన్నారు. పందొమ్మిది రోజుల పాటు ఆ కార్యక్రమం నిర్విరామంగా సాగింది. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు సుందరయ్య తదితరులు అందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకై బెజవాడ సమీపంలో ఏర్పాటు చేయబడిన శిబిరంలో వుండి, కాలవ పూడిక తీత కార్యక్రమంలో పందొమ్మిది రోజులూ పాల్గొన్న వారిలో గంగాధరరావూ వున్నారు. వాలంటీర్లకు భోజనాలు మాత్రం ఏర్పాటు చేయబడినాయి. అక్కడే వుండి, అక్కడే తిండి, అక్కడే నిద్ర. ఏనాడూ పార, పలుగు పట్టని వారు కూడా అందులో పాల్గొని కాయకష్టం చేశారు. మట్టిపని చేయటమే వృత్తిగా అనుభవం గడించిన వారితో దీటుగా కమ్యూనిస్టు వాలంటీర్లు పని చేశారు. అందరి మన్ననలందుకున్నారు. కమ్యూనిస్టులు మాటల మనుషులు కారు, చేతల మనుషులని, నిస్వార్థ ప్రజా సేవకులని రైతాంగం గుర్తించటానికి ఈ కార్యక్రమం దోహద పడింది.

1944లో బెజవాడ (విజయవాడ) లో అఖిల భారత రైతు మహాసభ నిర్వహించడం ఆంధ్రాలో కమ్యూనిస్టులకు నూతనోత్తేజాన్నిచ్చింది. లక్షమంది ప్రజల సమీకరణ, మహాసభను క్రమపద్ధతిలో నిర్వహించిన తీరూ దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారందరి ప్రశంసలనందుకుంది.

ఆ మహాసభకు బెంగాల్ నుంచి వచ్చిన ప్రతినిధులలో ఒకరైన సేన్‌గుప్తా మన రాష్ట్రంలో గ్రామాలను సందర్శించాలని గ్రామీణ ప్రజల జీవితాలను పరిశీలించాలని ఆసక్తి కనబరచారు. ఆయన కృష్ణాజిల్లాలో కొన్ని గ్రామాలకు వెళ్ళి వచ్చారు. గుంటూరు జిల్లాలో కొన్ని గ్రామాలను చూపించే బాధ్యతను గంగాధరరావుకు ఒప్పగించారు. ఆయనకు తెనాలి తాలూకా గ్రామాలను చూపించిన ఆనాటి అనుభవాన్ని గంగాధరరావు ఇప్పటికీ గుర్తు చేసుకుంటుంటారు. అప్పుడు సేన్‌గుప్తాను తెనాలి తాలూకా దావులూరు గ్రామానికి తీసుకు వెళ్ళారు. ఆయన అచ్చటి పల్లెలోని వారితో కలిసి తిరిగారు. వాళ్ళను పాటలు పాడమని కోరారు. హిట్లరు వ్యతిరేక పాటను వారు లయబద్ధంగా పాడగావిని ముగ్ధుడయ్యారు. ఆ పాటలు రాయించుకుపోయారు. గ్రామంలో ప్రజల చైతన్యాన్ని ఆయన మెచ్చుకున్నారు.

సేన్‌గుప్తాకు దావులూరులో ఒక సామాన్యుని ఇంట్లో ఆతిధ్యమిచ్చారు. ఆ వూరిలో ఒక చెరువుంది. అందులో నుంచి పెద్ద చేపను పట్టి తెచ్చి కూర వండి వడ్డించారు. కమ్మని పెరుగుతో భోజనం పెట్టారు. తనకు లభించిన సౌహార్ద్రపూరితమైన ఆదరణకు, ఆతిద్యానికి ఆయన ఎంతో ముగ్ధులయినారు.

తొలి రోజులలో పార్టీ నిర్మాణం కష్టతరంగా వుండేది. ఎక్కడకు వెళ్ళాలన్నా కాలినడక, లేదా సైకిలు ప్రయాణం. గ్రామాలలో ఆహ్వానించేవారుండేవారు కాదు. విద్యార్థి దశలో ఏర్పడిన పరిచయాలను ఉపయోగించుకుని గ్రామంలోని పెద్దవాళ్ళతోనూ పరిచయాలు పెంచుకోవటానికి కృషి చేసేవారు. శ్రామిక వర్గ పంథాయే సిద్ధాంత పునాదిగా పని చేయటమే గాక, ఆచరణలోనూ అందుకు తగినట్లే ఆనాటి వ్యవహార సరళి వుండేది. నిరాడంబరంగా వుండటం ఒక సహజ ప్రవృత్తిగా విలసిల్లింది. నిరాడంబర జీవన విధానంలో సుందరయ్యగారు తొలి రోజులనుంచీ ప్రత్యేకతను కనబరిచారు. 1946లో తెనాలి నుండి సమీపంలోని ఒక గ్రామానికి వెళ్ళటానికి సుందరయ్య, గంగాధరరావు తెనాలి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైలు ఎక్కి వెళ్ళాలనుకున్నారు. కాని, రైలు లేటయింది. మరికొంత సమయం వరకూ అది రాదని తెలుసుకున్న మీదట, వారిరువురూ కాలినడకన బయలు దేరి వెళ్ళారు.

## ప్రకాశం ఆర్డినెన్సు - నిర్బంధ కాండ

1946 నుంచి 51 వరకు తెలంగాణా ప్రాంతంలో చరిత్రాత్మకమైన రైతాంగ సాయుధ పోరాటం సాగింది. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన పోరాటమది. ఆ రోజుల్లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా వున్న ఆంధ్ర ప్రాంతంలోనూ నిర్బంధకాండ సాగింది. అప్పట్లో మద్రాసు రాష్ట్ర ప్రధాన మంత్రి (అప్పుడు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రధానమంత్రులని పిలిచేవారు) టంగుటూరి ప్రకాశం జారీ చేసిన ఆర్డినెన్సు ఆంధ్ర ప్రాంతంలో ప్రజా వుద్యమాలపై ఉక్కుపాదం మోపటానికే వుద్దేశించబడింది. తెలంగాణా పోరాటం మొదలయిన తర్వాతనే, వర్గ పోరాటాల ప్రాతిపదికపై వుద్యమాల నిర్మాణం యొక్క ప్రాధాన్యత ఇతోధికంగా గుర్తించబడింది.

నిర్బంధకాండను తట్టుకుని ఆంధ్రప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని, ప్రజా వుద్యమాలనూ నిలబెట్టుకోవటానికి కృషి సాగించుతూనే తెలంగాణా పోరాటానికి కార్యకర్తలను సమకూర్చటం లక్ష్యంగా కృషి సాగేది. తెలంగాణా పోరాట యోధులకు సురక్షిత స్థావరాలను (షెల్టర్లను) నిర్వహించడం జరిగింది. ఈ కృషిలో

పాల్గొంటున్న వారిలో స్థాయి గల కార్యకర్తలను చాలామందిని పోలీసుల తుపాకీ తూటాలు బలిగొన్నాయి. గుంటూరు జిల్లాలోనూ అలానే చాలా మంది వాటికి ఎరయై రక్తం ధార పోశారు. ఆ రోజుల్లో పోలీసుల అకృత్యాలకు అంతు లేకుండా వుండేది. కృష్ణాజిల్లా కాటూరు, యలమర్రు గ్రామాలలో మూకుమ్మడిగా గ్రామ ప్రజలందరినీ చిత్రహింసలకు గురి చేశారు. వివస్త్రలను చేసి మహాత్మాగాంధీ విగ్రహం చుట్టూ ప్రదక్షిణం చేయించడం వంటి దారుణాలు జరిగాయి. పోలీసులు క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజలను చిత్రహింసలు పెట్టారు. పశువులను బందెల దొడ్డిలో పెట్టిన విధంగా ప్రజలను ఆ శిబిరాలలో వుంచి నానా హింసలకు గురి చేశారు. తద్వారా వారి చేత రహస్యాలు చెప్పించాలని, లొంగదీసుకోవాలని ప్రయత్నించారు. ముఖ్య కార్యకర్తలు దొరికితే కాల్చి చంపి కథలల్లేవారు. బాలగంగాధరరావులో తెలంగాణా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనాలన్న పట్టుదల ఏర్పడటానికి ఆనాడు సాగిన ఈ దారుణ నిర్బంధకాండయే ప్రేరణ.

ప్రకాశం ఆర్డినెన్సు క్రింద నిర్బంధకాండ ప్రయోగించబడిన సందర్భంగా 1947 జనవరి నుంచి ఆగస్టు వరకు ఎనిమిది మాసాల పాటు గంగాధరరావు అజ్ఞాతవాసంలో వుంటూ పని చేయవలసి వచ్చింది. ఈ అజ్ఞాతవాస కాలంలోనే గంగాధరరావు – సరోజిని గార్ల వివాహం 1947 జులై 8న జరిగింది. కృష్ణాజిల్లా కాటూరులో జరిగిన ఈ వివాహానికి బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు రహస్యంగా వుంటూనే హాజరయ్యారు. మోటూరు హనుమంతరావు ఆచార్యత్వం వహించి వివాహం జరిపారు. పెళ్ళినాటికి ఆమె వయస్సు 17 ఏళ్ళు పూర్తయి 18లో ప్రవేశించారు. ఆమె తండ్రి కడియాల రంగారావు. తల్లి లక్ష్మమ్మ. ఆమె 1930 జులై 6న జన్మించారు. ఆమె జన్మస్థలమైన కాటూరు, అలానే తల్లిదండ్రుల కుటుంబమూ రాజకీయ కార్యకలాపాలకు నిలయంగా వుండేది. ఆమె పినతండ్రి కడియాల గోపాలరావు రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నాటి ముఖ్య నాయకులలో ఒకరు. ఈ వాతావరణం ప్రభావం ఆమెపైనా చిన్న నాటినుంచీ వుండేది.

పెళ్ళి నాటికి ఆమె బెనారస్ మెట్రిక్ పరీక్ష రాశారు గాని ఉత్తీర్ణులవలేదు. గంగాధరరావు అజ్ఞాత వాసంలో వుండగానే పెళ్ళి. ఆ తర్వాత నిర్బంధకాండ మరింత తీవ్రతరమయింది. ఆయన అజ్ఞాతవాసంలో, ఆమె తల్లిదండ్రుల వద్ద, ఉత్కంఠ భరితమైన జీవితం. ఆయనకు ఎప్పుడు ఏమవుతుందోనన్న ఆదుర్దా. అయినా గంగాధరరావు కమ్యూనిస్టు పార్టీ పని చేస్తున్నందుకు ఆమె ఎన్నడూ బాధ పడలేదు. ఆయన అలా పని చేస్తున్నందుకు ఆమె గర్వపడుతుండేవారు. జూలియస్ ఫ్యూజిక్

"రక్తాక్షరాలు" లెనిన్ అజ్ఞాత జీవితాన్ని గూర్చి తెలిపే విప్లవ గాథలు, రెండవ ప్రపంచ యుద్ధకాలపు వీరగాధలూ చదువుతుండేవారు.

వివాహానంతరం 1949లో ఆమె మెట్రిక్ ప్యాసై గుంటూరులో ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరారు. ఫస్టియర్ తర్వాత ఒక సంవత్సరం అంతరాయం. అనంతరం 1951-52లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఉత్తీర్ణులయ్యారు. ఆ తర్వాత అదే కాలేజీలో 1952-54 రెండు సంవత్సరాలు బి.ఏ. చదువు. ఆ వెంటనే గుంటూరులోనే సెంట్ జోసెఫ్స్ కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్‌లో చేరారు. 1955లో బి.ఇ.డి డిగ్రీ పొందారు. ఇంటర్మీడియెట్ చదువు మధ్యలోనే, 1950 అక్టోబర్ 5న వారి కుమారుడు ప్రేమ్‌సాగర్ జన్మించారు.

బి.ఇడి డిగ్రీ పొందిన వెంటనే ఆమె 1955 ఆగస్టులో ఒక కమిటీ స్కూలులో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. 1956 మార్చి వరకు అక్కడే పని చేశారు. ఆ తర్వాత తెనాలి మున్సిపల్ హైస్కూలులో టీచరుగా చేరారు. ఆ తర్వాత కొంత కాలానికి ఉద్యోగానికి సెలవు పెట్టి 1960-62లో ఆంధ్ర విశ్వవిద్యాలయం (వాల్తేరు) లో చదివి రాజకీయ శాస్త్రంలో ఎం.ఎ. డిగ్రీ పొందారు. యూనివర్సిటీ చదువు తర్వాత మరల తెనాలిలోనే మునిసిపల్ హైస్కూలు ఉద్యోగంలో కొనసాగారు. తన సర్వీసు చివరి దశలో ఆమె అక్కడనుంచి వచ్చి విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్ హైస్కూలులో పని చేశారు. తోటి టీచర్లతో అన్యోన్యంగా వుంటూ, పిల్లల పట్ల శ్రద్ధతో విధి నిర్వహణ గావించారు.

వారి కుమారుడు ప్రేమసాగర్ నెల్లూరు జిల్లా కావలిలో పి.యు.సి. పూర్తి చేసి విజయవాడ లయోల కాలేజిలో బి.కాం చదివారు. ఆ తర్వాత కొంతకాలం సి.ఎ.కై శిక్షణ పొందారు. ఆయన రాజకీయాల పట్ల ఆసక్తి కలిగి, పరిణామాలను శ్రద్ధగా గమనించుతూ వుంటారు. ఆయనా, ఆయన భార్య శోభ ఇరువురూ కూడా గంగాధరరావు - సరోజిని గార్ల దైనందిన కార్యకలాపాల నిర్వహణలో తోడ్పడుతున్నారు.

## కమ్యూనిస్టు పార్టీపై నిషేధం - మరల అజ్ఞాతవాసం

1947 తర్వాత కొద్ది రోజులు మాత్రమే కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పనిచేసే అవకాశం లభించింది. మరల నిషేధం విధించబడింది. దానితో మరల రహస్యంగా పని చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. 1948 జనవరి - ఫిబ్రవరి నుంచి గంగాధరరావు మరల అజ్ఞాతవాసానికి వెళ్ళారు. ఈ దఫా అజ్ఞాత జీవితం

నాలుగు సంవత్సరాల ఐదు మాసాలు సాగింది. అందులోనే కొంతకాలం ప్రత్యక్షంగా తెలంగాణా సాయుధ పోరాట రంగంలో వున్నారు. నల్లమల అడవులలో అమరాబాద్ రీజియన్ కార్యదర్శిగా, అచ్చటి దళాలకు రాజకీయ నాయకత్వాన్ని సమకూర్చే బాధ్యతను పార్టీ ఆయనకు అప్పగించింది. మేజర్ జైపాల్‌సింగ్‌ను వెంట బెట్టుకుని, అడవులలోకి తీసుకు వెళ్ళే పని కూడా ఆయనే నిర్వర్తించారు. గంగాధరరావు రాజకీయ నాయకత్వాన్ని, మేజర్ జైపాల్ సింగ్ సైనిక శిక్షణనూ సమకూర్చారు.

1948లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించబడిన నాటి పరిస్థితులను గూర్చి ఈ సందర్భంగా ప్రస్తావించవలసిన అవసరం వుంది. ప్రజల మధ్య పని చేయడం కోసమే కమ్యూనిస్టు నాయకులు అజ్ఞాతవాసంలో వున్నారు. పోలీసులకు పట్టుబడితే జైలులో నిర్బంధించుతారు. ప్రజలతో రోజువారీ సంబంధాలు పెట్టుకోవటానికి వీలు లేకుండా పోతుంది. అందువల్ల వుద్యమానికి నష్టం జరుగుతుంది. అలా జరగకుండా వుండేందుకే నాయకులు అజ్ఞాతవాసంలో వుండి పని చేశారు. ఈ దశలోనే, అటు తెలంగాణా పోరాటం వుధృతం అయ్యేకొద్దీ, ఇటువైపునా నిర్బంధకాండ తీవ్రతరమయింది. ముఖ్య కార్యకర్తలను జైళ్ళలో నిర్బంధించడంతోనూ పాలకులు సంతృప్తి పడని పరిస్థితి. పోలీసులకు దొరికితే తూటాలకు బలి చేయడం నిత్యకృత్యంగా తయారయింది. కోస్తా జిల్లాలలో మేరికల్లాంటి యువ కార్యకర్తలెందరినో ఆ విధంగా పొట్టన బెట్టుకున్నారు.

1948లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన మీదట నాయకుల అజ్ఞాత జీవితం – ఇందిరాగాంధీ హయాంలో అత్యవసర పరిస్థితి కాలంలో అజ్ఞాతవాసంలోకి వెళ్ళినప్పటిలా వుండేది కాదు. అత్యవసర పరిస్థితి కాలంలో కమ్యూనిస్టు పార్టీతో సంబంధం లేనివారు కూడా నాయకులకు ఆశ్రయం ఇవ్వటానికి సిద్ధపడేవారు. కాని 1948లో అలాంటి పరిస్థితి లేదు. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, అంకితభావం కలిగివారు మాత్రమే నాయకులకు ఆశ్రయం ఇవ్వటానికీ, రక్షణ కల్పించటానికీ సిద్ధపడేవారు. మిగతా జనంలో అంతటి ఆదరణ లేదు. కమ్యూనిస్టులు భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకులు అనే అభిప్రాయం సామాన్యులలో వుండేది. ఫాసిస్టు వ్యతిరేక పోరాటానికి – స్వాతంత్ర్య పోరాటంలోబ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా నిర్వహించవలసిన పాత్రకూ మధ్య సమన్వయం సమకూర్చలేక పోవటం వల్ల అలాంటి అపోహ ఏర్పడటానికి ఆస్కారం కలిగింది. ఆ పరిస్థితులలో సాధారణ జాతీయోద్యమవాదులకు కమ్యూనిస్టుల పట్ల ఆదరణభావం వుండేది కాదు. కాని, కమ్యూనిస్టులంటే క్రమశిక్షణ గలవారనీ, దురలవాట్లు లేనివారనీ, స్త్రీలను గౌరవించే

స్వభావం కలిగిన వారనీ మంచి అభిప్రాయం మాత్రం వుండేది. అలాంటి యువకులు తమకు అల్లుళ్ళుగా దొరికితే బాగుండుననుకోవటమూ వుండేది.

ఇక కమ్యూనిస్టు పార్టీ సభ్యుల విషయానికొస్తే అజ్ఞాత వాసంలో నాయకులకు ఆశ్రయం ఇవ్వటానికి వారు సర్వదా సిద్ధంగా వుండేవారు. కాని, వారి కుటుంబ సభ్యులు భయపడుతున్న సందర్భాలు మాత్రం ఎదురవుతుండేవి. గంగాధరరావుకు కూడా అలాంటి అనుభవం ఒక దఫా ఎదురయింది. అజ్ఞాత వాసంలో గుంటూరు తాలూకాలోని ఒకగ్రామంలో ఒక కామ్రేడ్ ఇంటికి ఆయన ఒక రోజున వెళ్ళారు. కాని, ఆ సమయానికి ఆ కామ్రేడ్ ఇంట్లో లేరు. కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ లభించలేదు. ఆయన ఇంట్లో లేరని, ఇప్పుడప్పుడే రారనీ చెప్పారు. అయితే, అప్పటికే తెల్లవారి పోయింది. అజ్ఞాత వాసంలో ప్రయాణాలన్నీ రాత్రి వేళలకే పరిమితం చేయవలసిన పరిస్థితి. అందువల్ల, అప్పుడు, అక్కడ నుంచి బయటకు వెళ్ళే అవకాశం లేదు. దానితో గంగాధరరావు అలానే కూర్చుండి పోయారు. తర్వాత కొంతసేపటికి ఆ కామ్రేడ్ వచ్చారు. వచ్చీ రాగానే ఆప్యాయంగా పలకరించారు. ఆదరణ చూపారు. అప్పటిదాకా తన కుటుంబ సభ్యులు ప్రదర్శించిన అనాసక్తత పట్ల ఆ కామ్రేడ్ తన బాధను వ్యక్తం చేశారు. అయితే, అనేక సందర్భాలలో రహస్య జీవితం గడిపే నాయకులకు ఆశ్రయం ఇవ్వడంలో మహిళలు ప్రశంసనీయమైన పాత్ర వహించారు.

ఆ దశలో కమ్యూనిస్టు నాయకులకు అజ్ఞాతవాసంలో ఎన్నెన్నో అనుభవాలున్నాయి. సమరశీలురగు కార్యకర్తలను ప్రజలు ఆదరించేవారు. ఆర్థికంగానూ అండగా నిలిచేవారు. 1948లో కృష్ణా జిల్లాలో గ్రామాలపై పోలీసు దాడులు జరుగుతుండేవి. అలా దాడి జరుగుతున్న ఒక గ్రామంలో చంద్ర రాజేశ్వరరావు వున్నారు. పోలీసులు ఆ గ్రామాన్ని చుట్టుముట్టారు. ఆయన అనారోగ్యంతో వున్నారు. అయినా ఆ పరిస్థితుల్లో ఆయన కృష్ణానది దాటి గుంటూరు జిల్లాకు చేరుకున్నారు. ఆయనను తెనాలి తాలూకా చినపాలెం గ్రామంలో వుంచి వైద్యం చేయించడం జరిగింది. తెనాలి నుంచి డా. అలపర్తి కృష్ణమూర్తి ధైర్యంగా చినపాలెం వెళ్ళి రాజేశ్వరరావుకు వైద్య సేవలను అందించారు.

ఆ తర్వాత కొన్నాళ్ళపాటు తెనాలి సమీపంలో కరెవరంగ్రామంలో పేదల ఇళ్ళల్లో ఆశ్రయం కల్పించడం కూడా జరిగింది. తినటానికి తిండి సంపాదించుకోవటమే అంతంత మాత్రంగా వున్న పేద కుటుంబాల వారు ఒక అతిథిని పోషించడం కష్టమే. అయినా, వారు తమకున్నంతలోనే ఎంతో ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చి, ఆశ్రయం కల్పించారు.

గుంటూరు జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నికయిన కొద్ది రోజులకే గంగాధరరావు పై అరెస్టు వారెంటు జారీ అయింది. ఆయన తప్పుకొని అజ్ఞాతవాసంలోకి వెళ్ళారు. కొన్నాళ్ళు ఆయనా, మోటూరు హనుమంతరావు పులుపుల శివయ్య, ఒక ఆశ్రయం ఏర్పరచుకుని కొంతకాలం గడిపారు.


రహస్యంగా పార్టీ కార్య కలాపాలను నిర్వహించే సందర్భంలో అజ్ఞాత యంత్రాంగాన్ని నిర్వహించే పాత్రకు ఎంతో ప్రాధాన్యత వుంది. ఆ బాధ్యతలు నిర్వర్తించే వారు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించవలసి వుంటుంది. అజ్ఞాతంగా వుండి పార్టీ బాధ్యతలు నిర్వర్తించే కామ్రేడ్ ప్రాణాలకు ప్రమాదం రాకుండా కాపాడటం కోసం వారు అంకితభావంతో చాకచక్యంగా మెళకువతో పని చేయవలసివుంటుంది. గోళ్ళ రాధాకృష్ణమూర్తి, పరుచూరి నాగేశ్వరరావు ఆరోజుల్లో అలాంటి గురుతరమైన బాధ్యతను నిర్వర్తించిన వారిలో వున్నారు.

మాకినేని బసవపున్నయ్య డిగ్రీ చదువు పూర్తి చేసి ఫైనల్ పరీక్షలో ఫెయిల్ అయిన తర్వాత మరలా పరీక్షలకు సిద్ధమవుతూ గుంటూరు జిల్లా రేపల్లెలో వుండగా ఆయనను అరెస్టు చేయటానికి పోలీసులు వచ్చారు. ఆయన సమయస్ఫూర్తి ప్రదర్శించి తప్పుకోగలిగారు. దొడ్లోకి వెళ్ళి వస్తాను వుండండని చెప్పి పెరటిలోకి వెళ్ళారు. పోలీసులు కొంతసేపు వేచి చూచారు. ఆయన ఎంతకూ రాకపోయే సరికి పోలీసులు పెరటిలోకి వెళ్ళి చూచారు. అయితే బసవపున్నయ్య అప్పటికే తప్పుకున్నారు. పొరుగున వున్న ఒక ఇంట్లో ఆశ్రయం పొంది, ఆ తర్వాత తన ఏర్పాటు తాను చేసుకున్నారు.

అప్పటివరకు తన నెలవులు మార్చుకుంటూ అజ్ఞాతంగా వుండి, గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కమ్యూనిస్టు వుద్యమ వ్యాప్తికై కృషి సాగించుతూ వచ్చిన మోటూరు హనుమంతరావు 1949 మే నెలలో కృష్ణాజిల్లా నూజివీడు తాలూకా వట్టిగుడిపాడు శివారు గ్రామం అనంత సాగరం వద్ద అరెస్టు చేయబడ్డాడు. తెలంగాణా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం తనకు లేకుండా పోయిందని, ఆయన ఎప్పుడూ బాధ పడుతుండేవారు. అరెస్టయిన మీదట ఆయనను కడలూరు సెంట్రల్ జైలుకు పంపారు. జైలులో డిటెన్యూల హక్కుల కోసం, డిటెన్యూల కుటుంబాలకు అలవెన్సు కోసం కడలూరు జైలులో జరిగిన పోరాటాల్లో హనుమంతరావు ప్రధాన పాత్ర వహించారు.

పార్టీ మీద విశ్వాసంతో అజ్ఞాత వాసంలో నాయకులకు ఆశ్రయం కల్పించేందుకు తరతమ స్థాయిలలో ఎందరెందరో త్యాగాలు చేశారు. ఒక ద్రోహి

# ANUBHAVALU GNAPAKALU



2002లో హైదరాబాద్‌లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
17వ మహాసభ సందర్భంగా జండావిష్కరిస్తున్న ఎల్ బి జి




నెల్లూరు ప్రజా వైద్యశాల నూతన భవన ప్రారంభ సందర్భంగా
సుందరయ్య, ఎల్ బి జి

L.Balagangadhara Rao



1986లో కర్నూలులో జరిగిన సి.ఐ టి యు మహాసభలో బి టి రణదివేతో ఎల్ బి జి



ఎం హెచ్ , ఎస్ పి ఆర్ . ఎల్ బి జి . వెంకటపతి

# ANUBHAVALU

# GNAPAKALU



1984లో చైనా పర్యటన సందర్భంగా చర్చలు జరుపుతున్న ఎం హెచ్, ఎల్ బి జి



విశాఖలో జరిగిన రాష్ట్ర పార్టీ 17వ మహాసభ సందర్భంగా జరిగిన బహిరంగసభలో
జ్యోతిబాసు. బసవపున్నయ్య.ఏచూరి. కొరటాల. ఎం హెచ్ గార్లతో ఎల్ బి జి

L.Balagangadhara Rao



భారతకమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 14వ మహాసభలో
ఇ.ఎం ఎస్ తో ముచ్చటిస్తున్న ఎల్ బి జి , ఎం హెచ్



చిరకాల మిత్రుడు కొండపనేని రంగారావు జెకోస్లోవేకియా నుండి వచ్చిన సందర్భంగా
ఎల్ బి జి ప్రభృతులు

అచూకీ ఇచ్చిన కారణంగా ఆ రోజుల్లోనే బాపట్ల రహస్య స్థావరంపై పోలీసులు దాడికి రాగా వీరోచితంగా ప్రతిఘటించారు. గంగాధరరావుతో కలసి చదువుకున్న వారిలో ఒకరైన కంఠంనేని వెంకటరత్నం ఆ స్థానంలో వుండి, తనవద్ద గల రివాల్వరు సమయానికి మొరాయించినా అత్యంత సాహసంతో పోలీసులను ఎదుర్కొన్నారు. ఆ రహస్య స్థావర నిర్వహణ బాధ్యత చూస్తున్న మోటూరు వెంకటరత్నం, తన బిడ్డను చంకన పెట్టుకొని అడ్డం నిలబడి తాను పోలీసుల తుపాకి తూటాలకు అహుతై, ఇతర నాయకులు తప్పుకోవటానికి అవకాశం కల్పించారు.

అదే రోజుల్లో వెల్లూరు, సేలం, విశాఖపట్నం, రాజమండ్రి జైళ్ళలోనూ డిటెన్యూలు పోరాటాలు సాగించారు. తద్వారా కొన్ని విజయాలు సాధించారు. జైళ్ళ లోపల ఆవిధంగా ఆందోళన సాగించుతున్న డిటెన్యూలపై అధికారులు కాల్పులు జరిపిన సందర్భాలూ వున్నాయి. తుపాకి తూటాలకు ఎదురొడ్డి పోరాడేందుకు సయితం వీరు సిద్ధ పడ్డారంటే వెలుపలి పరిస్థితులు కూడా అందుకు ప్రేరణ. తెలంగాణా ప్రాంతంలో సాయుధ పోరాటం సాగుతోంది. కోస్తా జిల్లాలలో నిర్బంధకాండ, పోలీసు దమననీతి పరాకాష్ఠకు చేరుకున్నాయి. మలబార్ స్పెషల్ పోలీసులు గ్రామాలపై దాడులు సాగించారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారిని స్త్రీ పురుష విచక్షణ లేకుండా నానావిధాలుగా చిత్రహింసలకు గురి చేశారు. హోంగార్డుల పేరుతో కాంగ్రెస్ నాయకులు ఏర్పరచిన రౌడీమురాలు గ్రామాలలో కాపలాల పేరిట అకృత్యాలకు పాల్పడ్డారు. కమ్యూనిస్టులను పోలీసులకు పట్టించటానికి నానాపాట్లు పడ్డారు.

మరోవైపున కమ్యూనిస్టు పార్టీలో వున్నవారిలోనూ కొందరిలో అవకాశవాద ధోరణులు పొడచూపాయి. అవకాశవాదులు జైళ్లలో ఉన్నా వెలుపల ఉన్నా చాలా నష్టం కలుగజేశారు.

ప్రకాశం ఆర్డినెన్సు క్రింద నిర్బంధకాండ సాగుతున్న రోజులలోనే 1948 జనవరి 30 వ తేదీన ఆరెస్సెస్‌కు చెందిన నాథూరామ్ వినాయక్ గాడ్సే గాంధీజీని హత్య చేశాడు. బెజవాడలో సభ జరుపుకుంటున్న ఆరెస్సెస్ వాళ్ళు ఆ వార్త విన్నవెంటనే ఆనందోత్సవం జరుపుకున్నారు. మిఠాయిలు పంచుతూ వూరేగింపుగా సాగారు. గాంధీజీ హత్య చేయబడినందుకు ఆ విధంగా ఆనందంతో కేరింతలు గొడుతుండటాన్ని చూసి ప్రజలు ఆగ్రహించారు. వాళ్ళమీద రాళ్లు రువ్వారు. దానితో అందులో ఒకడు మృతి చెందాడు. అప్పుడు అధికారంలో వుంది కాంగ్రెస్

ప్రభుత్వం. అయినా పోలీసులు గాంధీజీ మృతి చెందినందుకు సంబరం జరుపుకుని, ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి ఆగ్రహాన్ని చవిచూచిన ఆరెస్సెస్ వాళ్ళ జోలికి పోనేలేదు. అదేరోజున బెజవాడలో మొదలయిన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని గాంధీజీ మరణవార్త వినగానే వాయిదా వేశారు. కమిటీ సభ్యులలో కొందరు ఆరెస్సెస్ గొడవ చూడటానికి వీధిలోకి వెళ్ళారు. అలా వెళ్ళిన కమ్యూనిస్టు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఆరెస్సెస్ వాళ్ళపై మాత్రం ఎలాంటి చర్యా తీసుకోలేదు. కమ్యూనిస్టు నాయకులు అజ్ఞాతవాసానికి వెళ్ళవలసి వచ్చింది. ఆవిధంగా, కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించటానికి ముందునుంచే ఆచరణలో నిర్బంధకాండ తిరిగి మొదలయింది.

సామ్రాజ్యవాద దాడి నిరంతరం సాగుతూనే వుంది. వలసపాలన, ఆ తర్వాత స్వాతంత్ర్య ప్రదానం సందర్భంలోనూ, స్వాతంత్ర్యానంతరమూ ఎప్పటికప్పుడు రూపాలు మార్చుకుంటూ తన దాడిని మాత్రం కొనసాగిస్తూనే వుంది. దోపిడీయే ఆ దాడి యొక్క పరమావధి.

### తెలంగాణా పోరాటరంగంలో

1946 నుంచీ తెలంగాణా ప్రాంతంలో పోరాటం సాగుతోంది. రజాకార్ల దౌష్ట్యాలకు వ్యతిరేకంగా, నైజాం నిరంకుశ, ఫ్యూడల్ పాలనలో గ్రామ సీమలలో దేశముఖులు, జాగీర్దార్ల దారుణ దోపిడికి వ్యతిరేకంగా సామాన్యులు సైతం నిలబడక తప్పని పరిస్థితులు ఆనాడు అక్కడ నెలకొన్నాయి. వారి చైతన్యాన్ని ప్రజ్వరిల్ల చేసి, వారి ఆగ్రహాన్ని ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేక పోరాటంగా మలచటానికి కమ్యూనిస్టు పార్టీ కృషి ప్రారంభించింది. మరోవైపున, అప్పటి మధ్యతరగతి వర్గాలు కూడా తమ సంస్కృతీ పరిరక్షణకై గళం విప్పటానికి కార్యాచరణకు వుద్యుక్తమయినాయి. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని అప్పటి హైదరాబాదు సంస్థానం మాత్రం భారత్‌యూనియన్‌లో విలీనం కాలేదు. నైజాం నవాబు స్వతంత్ర్య రాజ్యంగా వుండాలని వువ్విళ్ళూరుతుండేవాడు. అయితే నైజాం సంస్థానంలో, ముఖ్యంగా అందులోని తెలంగాణా ప్రాంతంలో గ్రామీణ ప్రజల ప్రతిఘటన అంతకంతకూ బలం పుంజుకోజొచ్చింది. రజాకార్ మూకలు గ్రామాలలో సాగించుతున్న దురంతాలకు వ్యతిరేకంగా–మధ్యతరగతి ప్రజలు కూడా కదులుతున్నారు. కమ్యూనిస్టు పార్టీ సారధ్యంలోగ్రామీణ పీడిత ప్రజలు సంఘటిత మవజొచ్చారు నైజాం నిరంకుశ ప్రభుత్వం అండదండలతో ఆ ప్రాంతంలోని గ్రామ సీమలలో రైతులను, వ్యవసాయ కూలీలను, వృత్తిదారులనూ అమానుషమైన దోపిడీకి

గురి జేస్తూ భోగలాలస జీవితాలు గడుపుతున్న దొరలు బెంబేలెత్తిపోయారు. ప్రజల ఆగ్రహం, కదలిక చూచిన తర్వాత భయకంపితులై తమ గడీలు వదిలి హైదరాబాదు నగరానికి పలాయనం చిత్తగించారు.

పొరుగునే ఉన్న ఆంధ్ర కోస్తా ప్రాంతం నుంచి తెలంగాణా రైతాంగ పోరాటానికి సంఘీభావం, మద్దతూ అంతకంతకూ పెరిగింది. తెలంగాణా పోరాటయోధులకు ఆశ్రయం కల్పించడంలో, పోరాటానికి అవసరమైన ఆయుధాలు తదితర వనరులు సమకూర్చడంలో తమవంతు పాత్ర నిర్వహించటానికి చైతన్య వంతులైన ప్రజలు ముందుకొచ్చారు. తెలంగాణా పోరాటంలో స్వయంగా పాల్గొనటానికి గాను దళాలలో చేరటానికి సమరశీలురగు కమ్యూనిస్టు కార్యకర్తలు సంసిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర కోస్తా ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వమూ దారుణమైన నిర్బంధకాండను ప్రయోగించింది. కమ్యూనిస్టులను ఎదుర్కొని నిలబడగల సామర్థ్యం నైజాం నవాబు బలగాలకు లేదన్న నిర్ధారణకు వచ్చిన కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వం నైజాం సంస్థానంలోకి సైన్యాలను పంపింది. అప్పుడు కేంద్ర హోం మంత్రిగా వున్న వల్లభాయ్ పటేల్ ఆ విషయంలో ప్రధాన పాత్ర వహించారు. భారత సైన్యాలను నైజాం సంస్థానంలోకి పంపింది. నైజాం నవాబు మీద, ఆయన బలగాల మీదా యుద్ధం చేయటానికి కాదని, కమ్యూనిస్టులను ఎదుర్కొనడం వారిచేత గావటం లేదు గనుక ఆ పనిని తాము నిర్వహించడం కోసం, కమ్యూనిస్టులను అణచివేయడం కోసమేనని అప్పట్లోనే బాహాటంగా ప్రపంచానికి చాటుకున్నారు.

ఈ నేపథ్యంలో కోస్తా ప్రాంతంలో పోలీసు నిర్బంధకాండ వికటాట్టహాసం చేసింది. మెరికల్లాంటి కమ్యూనిస్టు, ప్రజాసంఘాల కార్యకర్తలను వందలమందిని పొట్టన పెట్టుకున్నారు. వారు చదువుకుంటున్న విద్యాలయాల నుంచి, వారు పని చేస్తున్న సంస్థల నుంచీ, పంటపొలాల నుంచీ, నిద్రమంచాల మీదనుంచీ అలాంటివారెందరినో పోలీసులు పట్టుకెళ్ళారు. కొండ కోనల్లోకి తీసుకెళ్ళి నిలువునా కాల్చి చంపడం విచ్చలవిడిగా సాగింది. నిరాయుధులయిన వారిని ఆ విధంగా కాల్చి చంపి కట్టుకథలల్లి ప్రచారం చేశారు. ఆయుధాలు పట్టి తమపై దాడి చేయగా ఆత్మరక్షణకై పోలీసులు కాల్పులు జరిపినట్లూ, ఆ కాల్పులలో వారు మరణించినట్లూ నమ్మింపజూచారు. బూటకపు ఎన్‌కౌంటర్లు ఆనాడే మొదలయినాయి. అంతటితోనే ఆగలేదు. కమ్యూనిస్టు, ప్రజా వుద్యమాలపై దుర్మార్గమైన దాడులు చేశారు. ప్రజల ఆస్తులను ధ్వంసం చేశారు. రైతుల పంట కుప్పలను తగులబెట్టారు. పచ్చని పైర్లను

నాశనం చేశారు. కమ్యూనిస్టు పార్టీలో లేని ప్రజాతంత్రవాదులనూ అరెస్టు చేశారు. బెజవాడ వద్ద మొగల్రాజపురం నుంచి కొట్రగడ్డ మధుసూదనరావును అరెస్టు చేయడం అలాంటిదే. కమ్యూనిస్టు పార్టీతో తనకు సంబంధం లేదని రాసిస్తే విడుదల చేస్తామని అధికారులు సూచించారు. ఆయన కమ్యూనిస్టు పార్టీలో లేరనేది వాస్తవమే అయినా, ఆ విధంగా వ్రాసి యిచ్చి విడుదల కావటానికి ఆయన సిద్ధపడలేదు. ఆత్మాభిమానంతో ఆయన అందుకు నిరాకరించారు. నిర్బంధాన్ని అనుభవించారు. అదేవిధంగా ఆత్మాభిమానంతో నిలబడిన ప్రజాతంత్రవాదులు ఆ తర్వాత కాలంలోనూ తమ విశిష్టతను చాటుకున్నారు. 1962లో చైనా-భారత సరిహద్దు సంఘర్షణ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీలోనే కొందరిని ఎంపిక చేసి అరెస్టు చేయటం జరిగింది. కమ్యూనిస్టు పార్టీ బలపరచిన ఇండిపెండెంట్ అభ్యర్థిగా గుంటూరు జిల్లా కూచినపూడి నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయిన ఈవూరు సుబ్బారావు వంటివారినీ అప్పుడు అరెస్టు చేశారు. జైలు నుంచి బయట పడటం కోసం ఆయన ఎలాంటి ప్రయత్నమూ చేయకుండా నిలబడ్డారు.

ఆంధ్రప్రాంతంలో నిర్బంధకాండ తీవ్రతరం అయిన మీదట, నిషేధంలో వున్న కమ్యూనిస్టు పార్టీ రహస్యంగా వుండి పని చేయడంలో మరింత క్లిష్టపరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చింది. మరోవైపున తెలంగాణా ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం సాగుతోంది. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కేంద్రం, ముఖ్యనాయకులూ పట్టణాలలో రహస్య స్థావరాలను ఏర్పరచుకొని, అక్కడ నుండే పని చేయడం మొదలయింది.

1950వ సంవత్సరం ప్రారంభం నాటికి లావు బాలగంగాధరరావు, తరిమెల నాగిరెడ్డి బెంగుళూరులో వేర్వేరు స్థావరాలలో వుండి పని చేస్తుండేవారు. ఆ సందర్భంలో ఒక రోజున బయటకు వెళ్ళి పని చూచుకుని వచ్చేసరికి ప్రమాద సంకేతాలు గోచరించాయి. కొరియర్ మెతకదనాన్ని ఆయన పసి కట్టారు. అతని ముఖ కవళికలు చూడగానే ఆయనకు అనుమానం వచ్చింది. తన వునికిని గూర్చి పోలీసులకు ఆచూకీ ఇవ్వడం జరిగిందని, తనను పట్టుకునేందుకు పోలీసులకు సంకేతం ఇవ్వటానికి సిద్ధమై ఎదురు చూస్తున్నాడని గంగాధరరావు అర్థం చేసుకున్నారు. కొరియర్ తాను చేస్తున్నదానికి పశ్చాత్తాపంతో బాధ పడుతున్నట్లు కూడా ఆయనకు అనిపించింది. అతని సిగ్నల్ పోలీసుల కంటే గంగాధరరావుకే ఎక్కువ వుపయోగపడింది. సంకేతాన్ని అందుకుని పోలీసు జీపు కదిలే లోపునే ఆయన తప్పుకున్నారు. జీపు రావటానికి వీలు పడనంత చిన్న సందులోకి వెళ్ళారు.

ఆయనకు బెంగుళూరు నగరం కొత్త. కొరియర్ ద్రోహానికి పాల్పడటంతో

ఇబ్బందిలో పడ్డారు. రహస్యంగా ఏర్పరచుకున్న సాంకేతిక యంత్రాంగంతో సంబంధం తెగిపోయింది. అయినా గంగాధరరావు అతి కష్టం మీద రాష్ట్ర కేంద్రానికి చేరుకున్నారు. అప్పుడది బెంగుళూరులోనే ఒక రహస్య స్థావరంలో వుండేది. మద్దుకూరి చంద్రశేఖరరావును కలుసుకున్నారు. తెలంగాణా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనాలని తాను కోరుకుంటున్నట్లు గంగాధరరావు ఆయనకు తెలిపారు. నిజానికి ఆయనకు ఈ కోరిక అంతకు ముందు నుంచీ వుంది. అయితే పార్టీ తనకు నిర్దేశించిన బాధ్యతలనే క్రమశిక్షణతో నిర్వర్తించుతూ వున్నారు. బెంగుళూరులో కొరియర్ మెతకదనంతో లొంగిపోయిన మీదట ప్రమాదపుటంచుల దాకా పోయి బయట పడినా, థామస్ అనే పోలీసు అధికారి బెంగుళూరులోనే వుండి గంగాధరరావును పట్టుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిస్థితిలో తెలంగాణా పోరాటానికి వెళ్ళాలనే గంగాధరరావు మదిలోని కోరిక పైకి వచ్చింది. నిజానికి చంద్రరాజేశ్వరరావు అంతకు పూర్వమే ఆయనను అందుకు ప్రోత్సహించారు. అంతేకాదు తెలంగాణా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనేటట్లు యువకులను ఆయన ప్రోత్సహించుతుండేవారు. అంతకుముందు దశలో ఆయన పలువురు యువకుల చేత డ్రిల్లు చేయించేవారు. కర్ర తిప్పడంలో నైపుణ్యం పొందునట్లు శిక్షణ గరపడం ఆయన ప్రత్యేకత. ఆయన మొదటి నుంచీ మిలిటెంటు కార్యక్రమాలకు నాయకుడుగా వుండేవాడు. ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు వుద్యమ నిర్మాణంలో సుందరయ్య తర్వాత రాజేశ్వరరావే ప్రముఖ పాత్ర వహించారు. తమ్మారెడ్డి సత్యనారాయణ తెలంగాణా పోరాటంలో గట్టిగా నిలబడ్డారు. ఆయన మణికట్టులో తుపాకీ తూటా దూసుకుపోయిన గుర్తు చివరికంటా అలానే వుంది.

గంగాధరరావు కోర్కెను కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆమోదించింది. ఆయనను ఫారెస్టులోకి పంపించాలని నిర్ణయించారు. నల్లమల అడవుల లోతట్టున గల దొంగలింగాల ప్రాంతానికి పంపించారు. దట్టమైన అటవీ ప్రాంతంలో వుంటూ, తెలంగాణా పోరాటంలో పాల్గొంటున్న కామ్రేడ్స్ యొక్క రాజకీయ చైతన్యాన్ని, పోరాట నైపుణ్యాన్ని పెంపొందించటానికి అవసరమైన ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతను గుర్తించిన మీదటనే పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అమరాబాద్ రీజియన్ పార్టీ కార్యదర్శిగా దళసభ్యుల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించే బాధ్యతను గంగాధరరావుకు ఒప్పగించారు. పోరాటంలో క్రమపద్ధతులు అనుసరించటానికి అవసరమైన సైనిక శిక్షణను మేజర్ జయపాల్‌సింగ్ చేత ఇప్పించాలనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకత్వం చేసిన ఈ నిర్ణయం మేరకు గంగాధరరావు, మేజర్ జయపాల్ సింగ్‌ను వెంట బట్టుకొని నల్లమల

అడవులలోకి వెళ్ళారు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో గంగాధరరావు సైనిక శిక్షణ పొంది వుండటం కూడా ఈ సందర్భంలో పరిగణనలోకి తీసుకోబడింది. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ వాళ్ళు భారతదేశం మీదకు వస్తే ఎదుర్కొనటానికి గెరిల్లా పోరాటంలో శిక్షణ పొందివుండటం అవసరం అని అప్పట్లో బ్రిటిష్ ప్రభుత్వం అందుకు ఏర్పాటు చేసిన విషయం ఇంతకుముందే పేర్కొనడం జరిగింది.

1950 మండు వేసవిలో ఒకనాటి రాత్రివారు తమ ప్రయాణం ప్రారంభించారు. తిరిగి వస్తారో, రారో తెలియని పరిస్థితులలో సాగించిన ప్రయాణం అది. కామ్రేడ్ సుందరయ్య వారికి ప్లాన్ ఇచ్చి ప్రయాణానికి సన్నద్ధం చేశారు. సుందరయ్య గారి భార్య లీల వారికి ఆప్యాయంగా మిఠాయిలిచ్చి వీడ్కోలు చెప్పారు. అమరాబాద్ అడవులలోకి బయలుదేరేటప్పుడే వారిరువురికీ, మారుపేర్లు పెట్టారు. గంగాధరరావు ఆ రోజునుంచీ చన్నన్న అనే పేరుతోనూ, మేజర్ జయపాల్‌సింగ్ కొండన్న అనే పేరుతోనూ వ్యవహరించారు. జయపాల్‌సింగ్ కూడా తెలుగువాడిలాగా ధోవతి కట్టుకున్నాడు. వారిద్దరినీ నిర్ణీత స్థలానికి చేర్చటానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. పందొమ్మిదేళ్ళ యువకుడొకరికి కొరియర్‌గా బాధ్యత ఒప్పగించారు. ఇంతటి క్లిష్టమైన విధి నిర్వహించటానికి ఆ యువకునికి గల అనుభవాన్ని గూర్చి వారు సంశయించారు. కాని ఆ యువకుడు ఎంతో ధైర్యంతో వ్యవహరించాడు. చెట్లూ, గుట్టలూ గుర్తు పెట్టుకుని మొదటి రాత్రే ఇరవై మైళ్ళదూరం అడవులలో నడిపించుకెళ్ళాడు. తిన్నని రహదారులు లేక పోయినప్పటికీ చేరవలసిన చోటుకి వారిని చేర్చాడు. అంతకుముందు అలవాటు లేకుండా ఏకబిగిన ఇరవై మైళ్ళ దూరం రాళ్ళు రప్పలతో, ముళ్ళపొదల గుండా నడవటం వల్ల వారి చీలమండలు వాచిపోయాయి. విప్లవదీక్షతో గమ్యస్థానానికి చేరటం మీదనే మనసులు లగ్నమై వున్నందున వారు ఆ బాధను లెక్క చేయకుండా తొలిమజిలీ చేరుకున్నారు.

అక్కడ నుంచి మరో మజిలీకి వారిని తీసుకెళ్ళటానికి మరొక కామ్రేడ్ రావలసివుంది. పిట్ట కూత శబ్దం చేస్తే రెండవ కొరియర్ వచ్చి వారిని తీసుకెళ్ళాలనేది ఏర్పాటు. కాని మొదటి కొరియర్ సంకేతాన్ని అందుకుని రావలసిన రెండవ కొరియర్ రాలేకపోయాడు. ఆ ప్రాంతం చుట్టూ కేంద్ర ప్రభుత్వ సైనిక బలగాలు వేలసంఖ్యలో కేంద్రీకరించి కమ్యూనిస్టు దళాలను హతమార్చటానికి గాలింపు సాగించుతున్న రోజులవి. అరణ్యంలో సయితం పగటిపూట బహిరంగంగా వుండటానికి వీలులేని పరిస్థితి నెలకొని వుంది. అందువల్ల తన సంకేతాన్ని అందుకుని, తర్వాత

ప్రయాణంలో తోడు రావలసిన కొరియర్ రాకపోవడంతో మొదటి కొరియర్ భయపడ్డాడు. అయితే ఆయనకు కామ్రేడ్స్ గంగాధరరావూ జయపాల్ ధైర్యం చెప్పారు. ఇంతలోనే తెల్లవారింది. అప్పటికి వారున్న చోటుకి దగ్గరలోనే బోడిగుట్ట (కొండ) వుంది. అది నెర్ర చీలి వుంది. వారు ముగ్గురూ ఆ నెర్రెలో దూరబడ్డారు. ఆ పగలంతా అందులోనే వున్నారు. మండు వేసవి గనుక ఎండ మండిపోతున్నది. వారికి ఆకలి దహించుకుపోతున్నది. తమకు వీడ్కోలు చెబుతూ శ్రీమతి లీలా సుందరయ్య ఇచ్చిన మిఠాయి తిందామంటే ఆ తర్వాత త్రాగటానికి నీళ్ళు లేవు. అప్పటికే గొంతు ఎండిపోయి వుంది ఆ కొండ నెర్రెలో నుంచి బయటపడటం చీకటి పడేదాకా కుదరనందు వల్ల అలాగే కూర్చుండి పోవలసి వచ్చింది.

బయటకు వెళ్ళి నీరు తీసుకురావటానికి కొరియర్ సంసిద్ధత వ్యక్తం చేశాడు. ఆ యువ కామ్రేడ్‌కూ గొంతు ఎండిపోతూనే ఉంది. అలా వెళ్ళి నీరు తీసుకు వచ్చే ప్రయత్నం ప్రమాదకరం అని భావించిన జయపాల్ సింగ్ అందుకు అంగీకరించలేదు. తాను చావటానికయినా సిద్ధమే గాని, శత్రువుల చేతుల్లో నాయకులు చావవలసిన పరిస్థితి రానివ్వనని కొరియర్ కామ్రేడ్ చెప్పాడు. తాను వెళ్ళి నీళ్ళు తెస్తానని పట్టుబట్టాడు. గంగాధరరావు మేజర్‌కు నచ్చజెప్పి అతనిని నీళ్ళకోసం పంపించారు. ఆ కామ్రేడ్ జాగ్రత్తగా వెళ్ళి నీళ్ళు తీసుకొని రెండు గంటలలో తిరిగి వచ్చాడు. అప్పుడు మిఠాయి తిని, నీళ్ళు తాగి ఆకలి చల్లార్చుకున్నారు. అప్పటికే సాయంత్రమయిపోయింది. అయినా వారి ప్రయాణం కొనసాగింపునకు అవసరమయిన కాంటాక్టు దొరకలేదు. అందువల్ల ఆరాత్రే మళ్ళీ ఇరవై మైళ్ళ దూరం వెనకకు నడిచి, మరునాటి ఉదయానికల్లా తాము బయలు దేరివచ్చిన సుందరయ్య గారి రహస్య స్థావరానికే తిరిగి చేరుకున్నారు. గంగాధరరావుకూ జయపాల్‌సింగ్‌కూ ఇద్దరికీ కూడా అరణ్యవాసంలో తొలి అనుభవం అదే. వారి ప్రయాణం బహు కఠోరమైనది. ఏ క్షణంలోనైనా శత్రుబలగాలు పట్టుకుని కాల్చివేసే ప్రమాదం పొంచివున్న భయంకర వాతావరణంలో సాగిన సాహసయాత్ర అది.

సుందరయ్య గారు నాలుగు రోజులలోనే అడవులలోని దళాలతో సంబంధం ఏర్పరచుకుని, వారిని తిరిగి అరణ్యంలోకి పంపారు. అదే కీకారణ్యంలో మరలా ప్రయాణం చేశారు. బాగాతుఏరియా కమాండరుగా వున్న కామ్రేడ్ కృష్ణమూర్తి వుండే స్థావరానికి చేరుకున్నారు. తిరిగి రెండవ దఫా బయలుదేరిన తర్వాత అదే వారికి మొదటి మజిలీ.

బాగాతుకొండల గుండా నల్లమల అడవులలోకి నూట యాభైమైళ్ళ ప్రయాణం. కొండల మీదుగా, లోయల గుండా కారు చీకట్లో నడక సాగించవలసి వచ్చింది. పదిహేడు రోజుల దాకా స్నానానికి నీళ్ళు దొరకలేదు. ఇక అప్పుడు మురికినీరు దొరికింది. గెరిల్లా దళాల స్నానానికి ఆ నీరే ఆధారం. స్నానం చేయకపోయినా ఫర్వాలేదు గాని, ఆ మురికి నీటితో స్నానం చేస్తే జబ్బులు వస్తాయని జయపాల్‌సింగ్ వారించారు. ఆయన చెప్పింది నిజమే. అయినా గెరిల్లా దళ సభ్యులలో తామూ ఒకరుగా మమేకం అవటానికైనా వాళ్ళతో పాటే ఆ నీళ్ళతో స్నానం చేయడం అవసరమని ఆయనకు వివరించి చెప్పి, గంగాధరరావు ఆ మురికి నీటితో స్నానం చేశారు.

అడవులలో జీవితం కఠోరం. అప్పటికే కమ్యూనిస్టుగా రూపొంది పోరాటంలోకి వెళ్ళిన తాను రాటు దేలటానికి అడవులలో అనుదినం వుపయోగపడిందని చెబుతూ గంగాధరరావు ఆనాటి అనుభవాలను, జ్ఞాపకాలను, ఘటనలను తరచు ప్రస్తావించుతుంటారు.

ఆకలి తీర్చుకోవటానికీ, రోజువారీ కార్యకలాపాల నిర్వహణకూ అవసరమైన శక్తిని సమకూర్చటానికీ మనిషికి ఆహారం అవసరం, త్రాగటానికి నీరు అంతకంటే ప్రధానం. కాని, అరణ్యవాసంలో ఈ రెండింటి విషయంలోనూ చాలా కష్టాలు పడాల్సిందే. అయినా తెలంగాణా పోరాట కాలంలో అడవులలో గెరిల్లా దళాలు మొక్కవోని దీక్షతో, ధైర్యసాహసాలతో వ్యవహరించారు.

దళాలకు తినటానికి తిండి దొరకటమే పెద్ద సమస్యగా వుండేది. అడవుల్లో దొరికే ఆకూ అలములపైనే ఆధారపడవలసి వచ్చేది. దేవదారు ఆకులు, కొండరావి చిగురు, చింతచిగురు వంటివి తిని ఆకలి తీర్చుకున్న సందర్భాలూ వుండేవి. బయటి నుంచి జొన్నలు వస్తే వాటిని పొట్టుతో సహా పిండి చేసి వుడికించి గంజి కాచుకుని తాగడం జరిగేది. జొన్నపిండి తయారు చేసుకోవటానికి ఎలాంటి సాధనాలూ లేవు. రాతిబండ మీద నూరటమే. అదయినా సరిపడా దొరికేది కాదు.

ఎండ బెట్టిన మాంసం తెలంగాణా ప్రాంతంలో అంతటా దొరుకుతుండేది. అలాంటి ఎండుమాంసం ముక్కలు ఒక బస్తా ఒక దఫా బయట నుంచి వచ్చాయి.

ఆహారం కోసం అడవి జంతువులను, పక్షులను వేటాడటానికి తుపాకులు వుపయోగించటానికి వీలు లేదు. శత్రువు మీద తప్ప ఒక్క తూటాను కూడా ఇతరత్రా వుపయోగించరాదనే నియమాన్ని పాటించేవారు. దళాలు విధిగా పాటించిన సూత్రం ఇది. అందువల్ల అడవి జంతువులు, పక్షులు, ఇతర విధాలుగా దొరికితేనే ఆహారానికి

వినియోగించుకోవడం జరిగేది. అంతకు పూర్వం నుంచి తమకు గల ఆహారపు అలవాట్లు ఏమైనా ఏది దొరికితే అది తినవలసి వచ్చేది. గొడ్డుమాంసం దొరికినా, కొండతాబేళ్ళు దొరికినా ఆహారంగా వుపయోగించారు. ఎలుక కనబడితే రాళ్ళతో కొట్టి చంపి వుపయోగపెట్టుకోవడం జరిగేది. ఒకసారి ఒక కొండముచ్చు ఒక కొమ్మ నుంచి ఎగిరి మరో కొమ్మను పట్టుకోబోయింది, కాని కొమ్మ చేతికి చిక్కలేదు. దానితో అది లోయలో పడింది. నడవలేని స్థితిలో పడి వుండగా, దాన్ని పట్టుకుని చంపి తిని ఆకలి తీర్చుకోవటం జరిగింది. ఒకసారి ఒక గద్ద పెద్ద చేపముక్కను కాళ్ళకు కరచుకొని పోతుండగా జారి కింద పడిపోయింది. ఆ ముక్కను కాల్చుకుని ఎంతో వాపోయినట్టు తలా కాస్త తిని ఆ పూటకు సరిపెట్టుకున్నాం. అడవిలో తేనె తుట్టెలూ వుండేవి. వాటినుంచి తేనె సేకరించి అపురూపంగా వాడుకునేవారు.

లభ్యమయిన ఆహారాన్ని నాయకులతో సహా అందరూ సమంగానే తినేవారు. నాయకుల పట్ల గౌరవంతో ప్రత్యేకత చూపుతుండేవారు. కాని అందుకు అంగీకరించకుండా నాయకులూ అందరితో పాటే తినేవారు. ఒక్క జయపాల్ సింగ్ పట్ల మాత్రమే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది. ఆయన ఉన్నతవర్గం నుంచి వచ్చినవారు. సైన్యంలో ఉన్నతాధికారిగా సుఖమయ జీవితం గడిపినవారు. ఆయన నల్లమల అడవులలోకి వచ్చేటప్పుడు పాలు గారుతూ వచ్చారు. లోపలికి వచ్చిన తర్వాత నల్లబడిపోయారు. ఆయన ప్రాణాలు కాపాడటం తమ విధి అన్న దృష్టితో ఆయన ఆహారం విషయంలో మాత్రం ప్రత్యేకశ్రద్ధ చూపటం జరిగేది. ఎవరికయినా అతిథి మర్యాదలు చేయాలన్నా, ప్రత్యేకత చూపాలన్నా తేనె ఇవ్వటం ఒక్కటే అచ్చట దళాలకు గల అవకాశం.

నీళ్ళ విషయంలోనూ కష్టాలనే ఎదుర్కొనవలసి వచ్చేది. దొరికే నీరు త్రాగటానికే సరిపోయేది కాదు. స్నానం చేయటానికి నీరు దొరకటం అపురూపమే. రోజుల తరబడి స్నానం లేకుండానే గడపవలసి వచ్చేది. యూనియన్ సైన్యాలు రంగంలోకి వచ్చిన తర్వాత గాలింపు (కూంబింగ్) చర్యలలో భాగంగా నీటి వనరులను గుర్తించి, సైన్యాలు వాటిని తమ ఆధీనంలోకి తీసుకుంటుండేవారు. దానితో దళాలు ఎప్పటికప్పుడు సరికొత్త నీటివనరులు కోసం వెతుక్కోవలసి వచ్చేది. నీళ్ళు దొరికే చోటు వెదుక్కుంటూ దళ సభ్యులు వెళితే కొన్నిచోట్ల పులులూ తారస పడుతుండేవి.

ఆహారం కోసం, నీటి కోసం, ఆశ్రయం కోసం అన్వేషణ సందర్భంగా తారసపడే క్రూరమృగాల బారి నుండి ఆత్మరక్షణ చేసుకోవటానికి తీసుకోవలసిన

జాగ్రత్తలను గూర్చి దళ సభ్యులకు వివరించడం జరిగింది. పులి కనిపిస్తే రక్షణ పొందటానికి చెట్టెక్కడమే మార్గం. చేతిలో తుపాకి వున్నా కాల్చితే అది విజృంభించి మీదికి దూకుతుంది. చెట్ల మీద మంచె వేసి కూర్చుంటేనే తుపాకితో పులిని కాల్చటమైనా ఆచరణ సాధ్యం. ఎలుగుబంట్లూ కనబడుతుండేవి. కట్టెలు పేర్చి నెగడు ఏర్పాటు చేసుకోవటమే ఎలుగుబంటి బారి నుంచి రక్షణకు మార్గం. ఒకసారి దళసభ్యులొకరు ఒక గుహలోకి వెళితే అందులో ఈనిన ఎలుగుబంటి పిల్లలతో సహా వుంది అది కామ్రేడ్ మీదికి దూకింది. ఆయన ధైర్యంతో దాన్ని వెనక్కుకొట్టారు. కాని అది తిరిగి విజృంభించి ఆ కామ్రేడ్‌ను చీల్చేసింది. మరో సందర్భంలో ఒక మహిళ గుడ్డి ఎలుగును రెండు కాళ్ళూ పట్టుకొని పోరాడి చంపివేయగలిగింది. ఎలుగుబంటి కనబడితే మంటవేసేవారు. దానితో అది పారిపోయేది.

అరణ్యంలో పండుకోవటానికి చదునైన నేల దొరకడమే కష్టం. వర్షం వస్తే తడవకుండా తప్పించుకోవడం కుదరదు ఎక్కడయినా గుహలు కనిపించినా అందులో తలదాచుకోవాలన్నా అప్పటికే అక్కడ పామో, పులో, ఎలుగుబంటో విశ్రాంతి తీసుకుంటూ వుండవచ్చు. అన్ని చోట్లా గుహలు వుండనూ వుండవు. గొంగళితోనే వారికి రక్షణ. గొంగళి కప్పుకుని, ఒళ్ళంతా చుట్టుకొని పండుకోవటమే జరిగేది.

ఎవరికయినా దెబ్బతగిలినా, గాయపడినా, సిబ్బాల్ బిళ్ళలే వారి వద్ద వున్న మందు. జయపాల్ సింగ్ అరణ్యంలోకి వస్తూనే దారి పొడవునా తుప్పలగుండా నడుస్తూ ముళ్ళు చీరుకుపోయి, రక్తం కారుతుంటే ఆయనకు లభించిన వైద్యం సిబ్బాల్ పొడరువేసి కట్టుకట్టడమే. అంతకు మించి వేరే మందు వారి వద్దలేదు.

నైజాంపాలనకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభమైన తొలి రోజులలో ప్రజలు రాయి, రప్ప, కట్టె, వడిసెల, గొడ్డళ్ళు, బర్మార్లు, ఊదరబాంబులు వుపయోగించుతుండే వారు. ఆధునికమైన ఆయుధాలు లేవు. అత్యంత ఆధునిక ఆయుధాలు కలిగిన యూనియన్ సైన్యాలు నైజాం సంస్థానంలో ప్రవేశించిన తర్వాత కొంత కాలానికి లావుబాలగంగాధరరావు, మేజర్ జయపాల్‌సింగ్ అమరాబాద్ అడవులలోకి వెళ్లేటప్పటికి దళాల వద్ద కొద్దిగా ఆధునిక ఆయుధాలున్నాయి. ఐనప్పటికీ, ఆయుధాలను వుపయోగించడంలో శాస్త్రీయ పరిజ్ఞానంలేదు. సైనిక శిక్షణ లేదు. నైజాం నవాబుకు వ్యతిరేకంగా, రజాకార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ సాగించుతున్న పోరాటంపట్ల సానుభూతి, సంఘీభావం, మద్దతూ కోస్తా జిల్లాల ప్రజల నుంచీ లభించింది. పోరాడే దళాలకు ఆయుధాలు సమకూర్చటానికి విరాళాలు సేకరించడం జరిగింది. విజయవాడ పట్టణంలోనే రెండు మూడు

రోజులలో సుమారు నలభై వేల రూపాయలు ఆయుధాల కొనుగోలు నిమిత్తం సేకరించగలిగారు. ఆ రోజుల్లో నలభై వేల రూపాయలంటే చాలా పెద్ద మొత్తమే. కమ్యూనిస్టు నాయకులతోపాటు కాట్రగడ్డ మధుసూధనరావు వంటి పెద్దలు కూడా చందాలు పోగు చేయటంలో కలిసి తిరిగారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడుతున్నారన్న సానుభూతిని కాంగ్రెస్ వాదులు కూడా వ్యక్తం చేస్తుండే వారు.

యూనియన్ సైన్యాలు ప్రవేశించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. మరింత ఆధునిక ఆయుధాలు సమకూర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. మాకినేని బసవపున్నయ్య నాగపూర్ వెళ్ళి ఆయుధాలు కొనుగోలు చేసి తెస్తుండేవారు. ఈ విధంగా కొనుగోలు చేసిన ఆయుధాలను చేరవేయడంలో ఆయన భార్య జగదాంబ ముఖ్యపాత్ర వహించారు. రహస్య జీవితంలో బసవపున్నయ్య జట్కా బండిలో ఆయుధాలను తీసుకెళ్తుండగా పోలీసు అధికారి ఒకరు గమనించారు అప్పుడు పట్టుకుంటే పోలీసులు ఆయనను కాల్చివేయటానికి కూడా అవకాశం వుంది. అయితే ఆ పోలీసు అధికారి ఆయనను గమనించి కూడా ఏమీ చేయలేదు. ఒక మంచి ఆశయం కోసం పని చేస్తున్న వ్యక్తి బసవపున్నయ్య, అలాంటి ఆయన జోలికి పోగూడదని అనుకొని ఆ పోలీసు అధికారి ఆయనను పట్టుకోకుండా వదిలేసినట్లు ఆ తర్వాత తెలిసింది. నైజాం సంస్థానానికి ఆంధ్ర ప్రాంతానికి మధ్యన అక్కడక్కడా ఏర్పాటు చేయబడివున్న చెక్ పోస్టుల వద్ద వుండే నైజాం ఉద్యోగుల నుంచి తుపాకులు గుంజుకోవడం పోరాటపు తొలి రోజులలో జరిగేది. ఆ తర్వాత శత్రువు నుంచి కూడా ఆయుధాలు స్వాధీనపరచుకున్న సందర్భాలూ వున్నాయి.

అందుకే ఎన్ని ఆయుధాలున్నా అవి ఎంత ఆధునికమైనవయినా, వాటిని వుపయోగించే బలగాలకు తగిన శిక్షణ లేనిదే ప్రయోజనం వుండదు. యూనియన్ సైన్యాలు రంగప్రవేశం చేసిన తర్వాత ఈ అవసరం మరింత పెరిగింది.

తెలంగాణాలో ఫ్యూడల్ భూస్వాముల దౌర్జన్యానికి గురై అష్టకష్టాలనుభవించిన పేదలు, ఆ విధానంపై కసితో పోరాటానికి సిద్ధపడ్డారు. హక్కుల రక్షణకు, ఫ్యూడల్ దోపిడీని, దురాగతాలను ఎదిరించడానికి ధైర్యంగా నిలిచారు. వారి జీవితానుభవాల నుంచే పోరాట పద్ధతులూ రూపుదిద్దుకున్నాయి. భూస్వాముల గడీలపై ప్రజలు దాడి జరిపితే, తుపాకి కాల్పులు ఎదురయ్యేవి. వాటిని తట్టుకోవటానికి పొగబాంబు (ఉదరబాంబు)లు వుపయోగించడం అనేది అలాగే వచ్చింది. పోరాటాలలోకి వచ్చిన సామాన్యులు తుదకంటా నిలబడిపోరాడారు. తమను పీల్చిపిప్పి చేస్తున్న ఫ్యూడల్ దోపిడికి వ్యతిరేకంగా నిలబడటం వరకే వారికి తెలుసు. అలాంటి వారికి సైనిక శిక్షణ ఇవ్వటం, రాజకీయ

చైతన్యాన్ని పెంపొందించటం వల్ల వారి పోరాటపటిమ, నైపుణ్యం పెరిగాయి. వారంతా పుట్టుకతోనే వీరులుగా పుట్టలేదు. చైతన్యం పెంచిన కొద్దీ పెరిగింది. కమ్యూనిస్టు నాయకులు తమ మధ్యనే వున్నప్పటికీ ఎవరూ బయటపెట్టలేదు. ఎన్ని దెబ్బలు తిన్నా ఫలానా వారు నాయకులని, తమ మధ్యన వున్నారనీ ఎవ్వరూ చెప్పేవారు కాదు. తెలంగాణా ప్రాంతంలోనిగ్రామాలలో ఆనాటి చైతన్యం ఆ స్థాయిలో వుంది. అందువల్లనే నాలుగు వేల మంది కార్యకర్తలు పోరాటంలో నేలకొరిగినా సామాన్య ప్రజలు మొక్కవోని ధైర్యంతో నిలబడ్డారు. నైజాం సైన్యాలు, ఆ తర్వాత యూనియన్ సైన్యాలూ ఆ విధంగా కాల్చి చంపిన వారిలో చాలా మంది ముఖ్యకార్యకర్తలు కూడా వున్నారు. ఎన్ని విధాలుగా చిత్ర హింసలకు గురి చేసినా, ఏ విధమైన సమాచారం రాబట్టుకోలేకపోయిన మీదటనే చంపివేశారు. ఎలాంటి రాజకీయ పరిజ్ఞానం లేకపోయినా, తామనుభవించిన బాధలకు కారకులైన ఫ్యూడల్ పెత్తందార్లపట్ల రగులుతున్న పగ, ద్వేషం కారణంగానే వారు అంతటి పట్టుదలతో తలవంచని వీరులుగానిలిచారు. మట్టిలో నుంచి వచ్చిన మాణిక్యాలు వారంతా.

పార్టీ నాయకుడుగా గుర్తింపు పొందిన రచయిత ఒకరు పోలీసులకు పట్టుబడిన తర్వాత సరెండర్ అయ్యారు. కొద్దిగా టార్చర్ చేసి, పెద్ద ఆఫీసర్లు వచ్చి ఆశలు చూపి సరెండరు అయ్యేట్లు చేశారు. కొన్ని రహస్యాలు చెప్పించుకోగలిగారు. అతడు చచ్చిపోయినట్లు పత్రికలలో ప్రకటించారు. ఆ తర్వాత అతనిని దళాలలోకి పంపారు. అతడు నడవలేకపోతే మోసుకొచ్చి మరీ దగ్గరలోకి తీసుకొచ్చి వదిలారు. పోలీసు క్యాంపు నుంచి తప్పించుకు వచ్చానని, దళాలలో చేరటానికి నిర్ణయించుకున్నానని చెప్పుకొచ్చారు. పోలీసు క్యాంపు నుంచి తప్పించుకు వచ్చాడని నమ్మి దళ సభ్యులు అతడిని ఆదరించారు. వున్నంతలో మంచి తిండి పెట్టారు. తమ వద్ద అపురూపంగా వుంచుకున్న తేనె కూడా ఇచ్చారు. అయితే గంగాధరరావు అక్కడ వున్నట్లు అతనికి ముందు తెలియదు. ఆయనను చూడగానే కంగుతిన్నాడు. గంగాధరరావు తదితరుల రహస్య స్థావరాల గురించి అతడు శత్రువుకు చెప్పేశాడు. అయినా పార్టీ నాయకులు కొద్దిలో తప్పించుకోగలిగారు. అతడే ఈ ద్రోహి. అడవులలోని దళాలను పట్టిస్తానని శత్రువుకు నమ్మకం కలిగించి వారి తరపునే అడవుల్లోకి వచ్చాడు. గంగాధరరావు నల్లమల అడవుల్లో వున్నారనేది అతనికి తెలియదు. ఆయనను చూడడంతోటే అతడు వణికిపోయాడు. అతడిపై తక్షణమే చర్య తీసుకోవాలని, వెంటనే వదిలించుకోవాలనీ ఇతరులు ఒత్తిడి చేసినా గంగాధరరావు తొందరపడలేదు. కోపం కనబడనివ్వకుండా అతడి నుంచి పోలీసు క్యాంపు రహస్యాలు తెలుసుకోవటానికి అతనితో మంచిగా మాట్లాడారు. అతడి

నుంచి రాబట్టవలసిన శత్రు సమాచారం చాలా వుండటమే అందుకు కారణం.

తనను నమ్మటంలేదనే విషయం అతడూ గ్రహించాడు. దానితో ఒక రోజు అతడొక నాటకం ఆడాడు. గంగాధరరావుకు తనపై అనుమానం వచ్చిన తర్వాత తానికబ్రతకటమే వృధా అని భావించి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఒక వుత్తరం రాసిపెట్టి ఆ స్థావరం నుంచి తప్పుకున్నాడు. అతడు నిజంగా ఆత్మహత్య చేసుకోదలచుకుంటే అదేమంత కష్టంకాదు. పక్కనే లోతైన లోయ ఒకటుంది. అందులోకి దూకితే చాలు. అయితే అతడుద్రోహి. పిరికివాడు ఆత్మహత్య చేసుకోడు అనేది గంగాధరరావు నమ్మకం. అతన్ని వెతకడానికి దళాన్ని పంపారు. ఒక చెట్టుకు తుండుగుడ్డ కట్టి వుంది. ఉరివేసుకోబోతున్నట్లు నాటకామాడుతుండగా, ఈతంతు గమనించిన దళసభ్యులు అతడిని లాక్కెళ్ళారు. శత్రువుకు సంబంధించిన సమాచారాన్నీ, అతడు ద్రోహం చేసిన విధమంతటినీ కాగితం మీద రాసివ్వవలసిందిగా హెచ్చరించారు. అప్పుడిక తప్పని సరై పళనియప్పన్ క్యాంపు వివరాలన్నింటినీ పూసగుచ్చినట్లు రాసి ఇచ్చారు. అతడు కొందరి ప్రాణాలు బలితీసుకున్న దానికి సంబంధించిన వివరాలు తద్వారా బయటపడినాయి. పట్టుబడిన వెంటనే అతనిపై చర్య తీసుకునివుంటే ఎంతో వుపయుక్తమైన ఆ సమాచారం లభ్యమయ్యేదికాదు. సైనిక రీత్యా మాత్రమే ఆలోచించితే ద్రోహి పట్టుబడిన వెంటనే శిక్షించడం జరిగేది. అలాగాక రాజకీయంగా ఆలోచించినందువల్ల సంయమనంతో నిబ్బరంగా వ్యవహరించడంవల్ల ఆ సమాచారాన్ని రాబట్టగలిగారు. ఆ పని పూర్తయిన తర్వాత అతడి ద్రోహానికి తగిన శిక్ష విధించడం జరిగింది. పళనియప్పన్ క్యాంపులో అనుసరించబడుతున్న పద్ధతులు, శత్రువు అనుసరించిన వ్యూహం గూర్చి తెలుసుకోవడం జరిగిన తర్వాత అతడు ఎంతటి ప్రమాదకారిగా తయారయిందీ రూఢి చేసుకొని దళం అతనికి విధించిన శిక్షకు వెలుపల అజ్ఞాతంగా వున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దుకూరి చంద్రశేఖరరావు ఆమోదం తెలుపుతూ లెటరు రాశారు.

రాజకీయ నాయకుడే దళానికి నాయకత్వం వహించడంవల్లనే ఆ విధమైన ప్రయోజనం పొందడం సాధ్యమయింది. అప్పుడు దళంలో వున్న మోటూరు పరంధామయ్య విషయంలోనూ, సరయిన వైఖరి అనుసరించడానికి అవకాశం కలిగింది. పోరాటం విరమించాలని ఆయన వాదించుతూ వచ్చారు. పోరాటం సాగుతుండగా మాత్రం ధనికవర్గాన్ని బెదిరింపులతో ఆయుధం చూపి ఒప్పించుతుండేవాడు. లొంగిపోలేదు. పోరాటం విరమించాలని వాదన చేస్తున్నారు గనుక శిక్షించాలనే అభిప్రాయం తప్పు అని గంగాధరరావు ఆ సమయంలో గట్టిగా

వాదించారు. తనబ్రతుకు తాను బ్రతకటానికి గాను అరణ్యం నుంచి బయటకు వెళ్లిపోవటానికి పరంధామయ్యకు అవకాశం కల్పించారు. పంథా విషయంలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన వారిపట్ల శతృత్వం వహించటం, అంతు తేల్చాలనుకోవడం సరికాదని, అలాంటి వైఖరి హానికరమని ఆయన నిశ్చితాభిప్రాయం. శత్రువుకు లొంగిపోయిన వారిపట్ల మాత్రం ఏవగింపు, వారిపట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలనే విషయంలో మాత్రం ఎలాంటి తటపటాయింపు లేకుండా వ్యవహరించుతుంటారు.

సిద్ధాంతంపట్ల అవగాహన లేకపోయినా, తెలంగాణా ప్రాంతంలో ఫ్యూడల్ దోపిడిని, దౌర్జన్యకాండను అనుభవించి కష్టాలుపడిన సామాన్యులు తమ జీవితానుభవం నుంచి నేర్చుకుని గట్టిగా నిలబడ్డారు. పోరాటంలో పాల్గొన్న దళ సభ్యులంతా ప్రత్యక్షంగా దేశముఖులు, జాగీర్దార్ల దౌష్ట్యాలకు దోపిడికి గురయినవారే. వారిపట్లనూ, ఆ వ్యవస్థ పట్లనూ ద్వేషంతో రగులుతున్నవారే. గంగాధరరావు, జయపాల్‌సింగ్ అరణ్యంలోకి వెళ్లిన తర్వాత అలాంటి దళ సభ్యులలో ముఖ్యుల కోసం స్కూలు నడిపారు.

అందులో ముఖ్యులు చదువు విషయంలో స్థాయి తక్కువలోనే వున్నప్పటికీ సైనిక శిక్షణను పొందగలిగారు. చెప్పిన విషయాలను అవగాహన చేసుకోగలిగారు. ఆయుధాలను శుభ్రంగా వుంచటం, వాటిని వుపయోగించే నైపుణ్యంలో తర్ఫీదు పొందారు. శత్రువుల మీద దాడులు చేయడంలోను, రక్షణ పొందడంలోనూ, తక్కువ నష్టాలతో ఎక్కువ విజయాలు సాధించడంలోనూ నైపుణ్యం సాధించారు.

జూలియస్ ఫ్యూజిక్ రచించిన "రక్తాక్షరాలు" గంగాధరరావుపై చెరగని ముద్ర వేసింది. ఆ గ్రంథం చదివి ఆయన ఎంతో వుత్తేజం పొందారు. రహస్య స్థావరాలలో వున్నప్పుడు ఇతరుల చేతనూ చదివించుతుండే వారు. ఆ గ్రంథాన్ని చదివి వుత్తేజం పొంది దృఢ సంకల్పంతో నిలిచిన వారు పలువురు ఆయన దృష్టిలో వున్నారు.

తెలంగాణా పోరాట కాలంలో నల్లమల అడవులలో గడిపిన సమయంలో గంగాధరరావుకు మరెన్నెన్నో అనుభవాలు ఎదురయినాయి.

ఒక రోజు ఒక దళ కమాండరు చేతిలో శక్తివంతమైన 303 రైఫిలు వుంది. అప్పటికే లోడ్ చేయబడి వుంది. జైపాల్ సింగ్ అడగగా ఆయన ఆ రైఫిల్‌ను లాక్ చేయకుండానే అందించాడు. దళ నాయకుడు ఆ విధంగా లోడ్ చేసిన రైఫిల్‌ను లాక్ చెయ్యకుండా ఇస్తాడని ఆయన అనుకోలేదు. జైపాల్‌సింగ్ రైఫిల్ తీసుకుని

పరిశీలించుతూ ట్రిగ్గర్ నొక్కారు. అది పెద్ద శబ్దంతో పేలింది. దగ్గరలోనే వున్న ఒక పుట్టకు తగిలి బుల్లెట్ ఆగిపోయింది. లేకపోతే ఆ రైఫిల్ ప్రేలుడు శబ్దం శత్రుసైన్యాలను మేల్కొలిపి వుండేది. అక్కడ వున్న పుట్ట అడ్డం వచ్చి ఆ ప్రమాదాన్ని నివారించింది. అయితే ఆ శబ్దంతో దగ్గరలోనే వున్న దళాలు అప్రమత్తమయినాయి. శత్రువులు వస్తున్నారని భావించి రక్షణ పొందటానికి సిద్ధమయ్యారు. ఇంతలోనే అసలు విషయం తెలుసుకున్నారు. తోటి కామ్రేడ్స్ దగ్గరకు వారూ వచ్చారు. ఇలాంటిదే ఇంతకంటే ఉద్వేగభరితమైన సంఘటన మరొకటి జరిగింది.

రాత్రి వేళల్లో పోలీసు అడవిలోకి రారన్న ధైర్యంతో దళాలు సేదదీర్చుకుంటూ విశ్రమించడం, నిద్రకు వుపక్రమించడం జరుగుతుండేది. ఒక రోజు రాత్రి మహబూబ్ నగర్, కర్నూలు మధ్యన కృష్ణానది లోతట్టున ఇసుక తిన్నెలపై దళ సభ్యులూ, వారితోపాటే గంగాధరరావు, జైపాల్‌సింగ్ నిద్రపోతుండగా తుపాకి పేలింది. అప్పుడు నదిలో నీళ్లులేవు. ఇసుక తిన్నెలు, పచ్చగడ్డి, చల్లగాలి మంచి నిద్రకు తోడ్పడ్డాయి.

కొరియర్‌గా పని చేస్తుండిన దళ సభ్యుడొకరు 16 బోర్ చెకోస్లోవాక్ ఆయుధంలోడ్ చేసి తన పక్కన పెట్టుకున్నాడు. మామూలుగా లోడ్ చేసి అలా పెట్టుకోకూడదు. నిద్రలో అతని కాలు పక్కనే వున్న ఆయుధపు ట్రిగ్గరు మీద పడింది. ఆ చీకటి రాత్రి వేళ భూమి దద్దరిల్లేట్లు శబ్దం చేస్తూ ఆయుధం నుంచి బుల్లెట్ దూసుకెళ్ళిపేలింది. ఆ కామ్రేడ్‌కు కొద్ది దూరంలోనే గంగాధరరావు నిద్రపోతున్నారు. ప్రేలుడు శబ్దం వినగానే అందరూ నిద్ర నుంచి లేచారు. ఆయుధాలను ఎక్కుబెట్టి ఎవరి స్థానంలో వారు సన్నద్ధమై నిలబడ్డారు. గంగాధరరావుకూడా తన వద్దనున్న రివాల్వర్ చేతబట్టుకుని లేవటానికి ప్రయత్నించారు. కాని లేవలేకపోయారు. నేను లేవలేకపోతున్నా నేమిటి? అనుకున్నారు. మీరెలా లేస్తారు? వొంటి నిండా తూటాలు దూసుకుపోయాయి. అని ఇతర కామ్రేడ్స్ ఆయనకు చెప్పారు. రివాల్వర్ తూటా పేలిన వెంటనే పన్నెండుగా చీలుతుంది. అందులో మూడు వెలుపలికి వెళ్ళిపోగా మిగతా తొమ్మిది గుళ్లూ గంగాధరరావు కాళ్ళకు, తొడకు, చేతులకూ తగిలాయి. అయితే ఆయువుపట్టుల్లో ఎక్కడా తగలకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. అయినా కొన్ని గుళ్లు శరీరభాగాలలో వుండిపోయాయి. ఆ తర్వాత కొంత కాలానికి బొంబాయిలో శస్త్రచికిత్స చేసి వాటిని తొలగించడం జరిగింది. తక్షణ వైద్యం మాత్రం సిబ్బాల్ బిళ్లలతోనే. దీనితోనే గాయాలు మాన్పుకోవటం జరిగింది.

ఈ విధంగా ప్రేలుడు జరిగిందిగనక దళం అక్కడ నుంచి తక్షణమే మకాం మార్చటం అత్యవసరం. ఆ స్థితిలో గంగాధరరావును తీసుకెళ్ళటం ఎలాగా అని మిగతా కామ్రేడ్స్ తటపటాయించారు. తన కోసం అందరూ అక్కడే వుండి పోవద్దని ఆయన వారించారు. తనను దగ్గరలో వున్న గుహలో వదిలి పెట్టి మిగతా వాళ్లంతా సురక్షిత స్థానాలకు వెళ్ళవలసిందిగా ఆయన కోరారు. ఆ ప్రకారమే గంగాధరరావును ఒక గుహలో పెట్టి మిగతా వారంతా వెళ్ళిపోయారు.

ఆయనను గుహలోకి చేర్చటానికి కూడా ఎంతో ప్రయాస పడవలసి వచ్చింది. ఆయన నడవగల స్థితిలో లేరు. కొండలలో ప్రయాణంలో పైపంచే బరువు. ఎవరికి వారు నడవటమే ఎంతో కష్టం. అలాంటిది ఇంకో మనిషిని తీసుకెళ్లటం అంటే మాటలు కాదు. అయినా తెప్పలాంటిది ఒకటి తయారు చేసి గంగాధరరావును దానిపై తీసుకెళ్లారు. కృష్ణానది తీరానికి చేరారు.

ఆవలి వైపున పోలీసులు ఆయుధాలు పక్కన పెట్టి స్నానాలు చేస్తున్నారు. ఈవలి వైపున వున్న దళాలు పోలీసులపై కాల్పులు జరిపారు. మధ్యాహ్నం దాకా కాల్పులు కొనసాగాయి. అక్కడ ఒక దళం వున్నదనే విషయం దాన్ని బట్టి ఆవలి దళానికి తెలిసింది. గంగాధరరావు అక్కడ వున్న విషయం కూడా ఆవలి దళం వారు గమనించారు. గాయాలతో వున్న గంగాధరరావును ఒక గుహలోకి చేర్చి అందరూ వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఏరియా కమిటీపై పోలీసు దాడి జరిగింది. కమాండర్‌ను అరెస్టు చేశారు. దానితో తమ పని పూర్తయిందని పోలీసులు వెళ్లిపోయారు. గంగాధరరావు గుహలో వున్న విషయం వారికి తెలియదు. అందువల్ల ఆయనకు ప్రమాదం తప్పింది.

అమరాబాద్ ప్రాంతంలోనే ఒక దళంలోని సభ్యుడి బాధ్యతారాహిత్యం కారణంగా ఆయుధం పేలటంతో మరో సభ్యుడు మృతి చెందారు. అలాంటి పొరపాట్లు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి ఆ తర్వాత క్లాసులలో శిక్షణ ఇచ్చారు.

నల్గొండ జిల్లా మిర్యాలగూడ తాలూకాలోని సుబ్బారెడ్డి గూడెం మిలటరీ క్యాంపులో చింతకుంట గ్రామానికి చెందిన దళ సభ్యులు ఇద్దరిని చిత్రహింసలు పెట్టి చంపివేశారు. పోరాట విరమణ అనంతరం వాళ్లు ఈ దురంతానికి పాల్పడ్డారు. దానికి ప్రతీకారం తీర్చుకోవాలని రగిలిపోతున్న దళ నాయకుడు మేదరమెట్ల సీతారామయ్య అదనుకోసం వేచి చూచారు. ప్రజాపోరాటం ధాటికి నిలవలేక వూరువదలి వెళ్లిపోయిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు, యూనియన్ సైన్యాలు నైజాం

సంస్థానంలో ప్రవేశించిన తర్వాత, పోలీసుల సాయంతో స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. తన ఇంటిలోనే మిలటరీ క్యాంపు ఏర్పాటు చేయించుకొని దౌర్జన్యాలు చేయటం, సాయుధ బలగాల అండతో తిరిగి ప్రజలను పీడించటం మొదలెట్టాడు. మేదరమెట్ల సీతారామయ్య, ఆయన దళ సభ్యులూ పోలీసు యూనిఫారాలు ధరించి ఒక రోజు రాత్రి చీకటి పడకముందే ఆ మిలటరీ క్యాంపుకు వెళ్లారు. దళ నాయకుడు సీతారామయ్య రివాల్వరు, మిగతా దళ సభ్యులు తుపాకులూ పట్టుకునే వెళ్ళారు. ఆ మిలటరీ క్యాంపులో ఏడుగురు మిలటరీ వాళ్లూ, మరో ఎనిమిది మంది హోంగార్డులూ వున్నారు. పోలీసు యూనిఫారంలో వున్న సీతారామయ్యను పై అధికారిగా భావించి వారంతా లేచి శాల్యూట్ చేస్తుండగానే, హేండ్స్ అప్ అంటూ ఆయన వాళ్లను గద్దించారు. వచ్చింది మేదరమెట్ల సీతారామయ్యేనని వాళ్లకు అర్థమయింది. దానితో వాళ్ళంతా డాబా మీది నుంచి కిందకు దూకిపారిపోయారు. అప్పట్లో తెలంగాణాలో మిలటరీ క్యాంపులు సాధ్యమయినంత వరకు డాబాలపైనే వుండేవి. ఇక్కడా అలానే ఏర్పాటు చేశారు. ఆయన పేరువింటే హడలెత్తి పోతుండే ఆ మిలటరీ వాళ్లూ, హోంగార్డులూ తమ ఆయుధాలన్నీ అక్కడే వదిలేసి బ్రతుకు జీవుడా అనుకుంటూ పారిపోయారు. దళానికి అక్కడ పదహారు ఆయుధాలు లభ్యమయినాయి. వాటిని తీసుకొని వూరిబయటకు వెళ్లిన తర్వాత పోలీసు యూనిఫారం వదిలేసి, రాత్రంతా నడచి కృష్ణానదీతీరానికి చేరుకున్నారు. ఈ దాడి తర్వాత ఆ కాంగ్రెస్ నాయకుడు మరలగ్రామం వదలిపెట్టి వెళ్ళాడు. మిలటరీ క్యాంపు కూడా ఎత్తి వేయబడింది. దానితో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసు క్యాంపుల అండతో పాత పద్ధతులు తిరిగి సాగించవచ్చుననే ధైర్యం భూస్వాములలో సన్నగిల్లింది.

రజాకార్ల తీరుకూ, సైన్యాల తీరుకూ మధ్య తేడా వుంది. ఎదురు బడి పోరాడినప్పుడు ఆ పోరాటంలో మృతి చెందిన దళ సభ్యులకు సైనికులు సగౌరవంగా అంత్యక్రియలు జరుపుతుండేవారు. ఒక సందర్భంలో ఒక దళ సభ్యునికి సైన్యం ఎదురుపడింది. ఆవుల మంద మాటున తప్పుకోవటానికి ఆయన ప్రయత్నించాడు. అయినా కుదరలేదు. ఎదురు బొదురుగా నిలిచిపోరాడవలసి వచ్చింది. ఆఖరి తూటా వరకూ సైనిక బలగాలపైకి ప్రయోగించి, చివరి తూటాతో తననే కాల్చుకుని మరణించాడు. ఆ వీరయోధుని పేరు అలవాల నరసింహారెడ్డి ఆయన మృతి చెందిన తర్వాత సైనికులు కొందరు ఆయన మృతదేహాన్ని కాళ్లతో తన్నుతూ అవమానించుతుండగా సైన్యాధికారి వారించాడు. తమ సైనికులను మందలించాడు.

ఆయన బ్రతికి వుండగా, ఆయనంటే హడలిపోయినవారు, ఆయన యుద్ధంలో వీరమరణం చెందిన తర్వాత అవమానించడం తగనిపని అని సైన్యాధికారి తమ బలగాలకు చెప్పారు. ఆయన మృతదేహానికి అన్ని లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు.

పుట్టుకతోనే ఎవరూ వీరులుకారు. జీవితంలో అనుభవించిన కష్టాలు, ఎదురయిన అనుభవాలవల్లనే వీరులుగా రూపొందుతారు. ప్రజలే పోరాట రూపాలను తీర్చిదిద్దుకుంటారు. సైనిక బలగాల కమాండర్లు వెనక వుండి తమ బలగాలను ముందుకు పంపించుతుంటారు. కాగా, దళాల కమాండర్లు తాము ముందుండి దళ సభ్యులను తమ వెంట నడిపించుతూ పోరాటం సాగించుతుండే వారు. అలా పోరాటాలలో పాల్గొని మరణించిన వారున్నారు. అలాంటి వారు ఎలాంటి కుటుంబాల నుంచి వచ్చారనే వివరాలు తెలుసుకుంటే స్పష్టమయిందొక్కటే. వారంతా పేదకుటుంబాల నుంచి వచ్చిన వారు. భూస్వాముల దౌష్ట్యానికి గురయినవారు. భూస్వాముల పట్ల ద్వేషంతో కూడిన పట్టుదల కారణంగా వీరులుగా తయారయినవారు.

ధనిక వర్గాల నుంచి వచ్చిన కామ్రేడ్స్ పరిస్థితి ఇందుకు భిన్నం. వారు రాజకీయంగా సైద్ధాంతికంగా అంకితభావం కలిగిన వారే అయినా, భూస్వాముల దౌష్ట్యాన్ని చూడటమే తప్ప స్వయంగా అనుభవించిన పరిస్థితి లేదు.

మేధావుల నుంచి వచ్చిన వారిలో కొందరు అంత కరకుగా నిలబడలేకపోయిన సందర్భాలున్నాయి. నీలం రాజశేఖరరెడ్డి, వేములపల్లి శ్రీకృష్ణ వంటి వాళ్లు అలాంటి బలహీనతలు ప్రదర్శించిన ఉదాహరణలున్నాయి. దళ నాయకులుగా వున్న వారి పూర్వాపరాలను పరిశీలించినా ఇదే విషయం ధృవపడుతుంది. భూస్వాముల దౌష్ట్యానికి గురైన వారున్నంత గట్టిగా ఇతరులు వుండలేరనే విషయం స్పష్టమయింది.

ఏమైనా తెలంగాణా పోరాటం దేశంలో కమ్యూనిస్టు వుద్యమానికి అమూల్యమైన అనుభవాలను సమకూర్చింది. మట్టిలో నుంచి మాణిక్యాలను సృష్టించింది. సామాన్యులను వీరులుగా మలిచింది. పోరాటం సందర్భంగా దొరలిన పొరపాట్లూ భవిష్యత్తులో వుపయోగపడే గుణపాఠాలను నేర్పాయి.

తెలంగాణా పోరాట సమయంలో అనుసరించిన ఎత్తుగడలలో కొన్ని మిత్రులుగా వుండవలసిన వారిని దూరం చేసుకోవటానికి కారణమయ్యాయి. తెలంగాణా ప్రాంతంలో వ్యవసాయం ఏ స్థితిలో వుంది? దాన్ని బట్టి రాబడిలో ఎంత మిగులుతుంది? వేతనం ఎంత చెల్లించగలుగుతారు? అనే అంశాలను

ఆలోచించి డిమాండ్లు నిర్ణయించవలసి వుంటుంది. భూమి వదలిపెట్టి వెళ్లిపోవటమే మేలనే ఆలోచన రైతులలో రాకుండా చూచుకోవడం అవసరం. కాగా ఆ రోజులలో అలా చేయటం కాక, తుపాకి చూపి శాసించడం జరిగింది. అందువల్ల కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగుతున్న పోరాటంలో వుండవలసిన వాళ్ళలోకొందరు కూడా గ్రామాలు వదలి పట్టణాలకూ, ఇతర ప్రాంతాలకూ వెళ్లారు. మనకు మిత్రులుగా వుండవలసిన వర్గాలను శత్రువులుగా చేసుకునే చర్యలు చేపట్టకూడదు అని సుందరయ్యగారు తరచు హెచ్చరించుతూ వచ్చారు. అప్పుడే కాక తర్వాత కూడా ఆయన అదే విధంగా హెచ్చరించుతుండేవారు.

అప్పట్లో తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీకి రైతాంగంలో మాత్రం బలం వుంది. వున్న పరిశ్రమలే కొద్ది. వాటిలోగల కార్మికులలోనూ కమ్యూనిస్టు పార్టీ ప్రభావం నామమాత్రంగా వుండేది. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాలలోనూ బలం లేకపోవటం లోటుగా వుండేది. పోరాట కాలంలో దళాలకు వైద్య సహాయం కూడా కష్టమయింది. కార్మిక-కర్షక ఐక్యతకుగల ప్రాధాన్యతను తెలంగాణా పోరాటం గుర్తు చేసింది.

1946 చివరి మూడు నెలలు మొదలుకొని 1951 చివరి వరకు పూర్తి ఐదు సంవత్సరాలపాటు తెలంగాణా రైతాంగ సాయుధ ప్రతిఘటన సాగింది. వీర తెలంగాణా పోరాట సమయంలో తెలంగాణా ప్రజలు, వారికి నాయకత్వం వహించుతూ ముందుండి ఆ వుద్యమాన్ని నడిపిన కమ్యూనిస్టు పార్టీ ఎనలేని త్యాగాలుచేయవలసి వచ్చింది. దాదాపు నాలుగు వేల మంది వీరకిశోరాలు, కమ్యూనిస్టులు బలైపోయారు. పది వేల మందికిపైగా రెండు మూడేళ్ళపాటు కారాగారాలలో బందీలయినారు. యాభై వేల మందికి పైగా పోలీసు క్యాంపులలో నిర్బంధాలకు, చిత్రహింసలకు గురయ్యారు. వేలాది గ్రామాలలో వున్న లక్షలాది ప్రజలపై పోలీసుదాడులు జరిగాయి. కొన్ని కోట్ల విలువగల ఆస్తి ధ్వంసం చేయబడటమో, లూటీ చేయబడటమో జరిగింది. దాదాపు యాభై వేల మంది సాయుధ బలగాలు సైనికులు రంగంలోదించబడ్డారు. 1947-48లో కాశ్మీరు వివాదంపై పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంతో ఖర్చు పెట్టిన దాని కన్నా ఎక్కువ మొత్తాన్ని తెలంగాణా పోరాటాన్ని అణచడం కోసం భారత కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టింది.

వీర తెలంగాణా రైతాంగ విప్లవ పోరాటం సాధించిన విజయాలను ఎన్నటికీ మరచిపోలేము. ప్రధానంగా నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో 16

వేల చదరపు మైళ్ల విస్తీర్ణంలోగల 2500 గ్రామాలలో గ్రామ రైతాంగ కమిటీలు ఏర్పడ్డాయి. ప్రజల ద్వేషానికి గురైన భూస్వాములను తరిమి వేశాయి. వారి భూములలో పరిమితికి మించిన మిగులు భూమిని స్వాధీన పరచుకున్నాయి. పది లక్షల ఎకరాల భూమిని వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు పంచటం జరిగింది. వెట్టిచాకిరి విధానం రూపుమాపింది. తాతలు, తండ్రుల నాటి నుంచి పరంపరగా వస్తున్న వడ్డీ భారాన్ని పూర్తిగా రద్దు చేయటమూ, కొన్ని సందర్భాలలో చాలా భాగం తగ్గించటమూ జరిగింది. అరణ్య ప్రాంతంలోని గిరిజనులకు లంచగొండి అధికారుల బారి నుంచి విముక్తి లభించింది. ఈ ప్రాంతం అంతటా ఈ రైతాంగ కమిటీలే శాంతిభద్రతలను నిర్వహించాయి. 13 వేల మంది వ్యవసాయ కూలీ యువకులు సాయుధ గెరిల్లా సేనలో స్వచ్ఛందంగా చేరారు. వారుగాక వందలకొలదీ సాయుధ దళాలు పోరాటంలో నిమగ్నమై వుండేవి. దేశం మొత్తం మీద భూసమస్యను, భూసంస్కరణల ఆవశ్యకతను ఎజెండా మీదికి తెచ్చిన ఖ్యాతి తెలంగాణా పోరాటానిదే. పోరాట తరుణంలో తాము పొందిన భూమిలో గణనీయమైన భాగాన్ని రైతాంగం నిలబెట్టుకోగలిగింది. వెట్టిచాకిరిని మళ్లా అమలు చేయటం సాధ్యం కాలేదు. నైజాం సంస్థాన విచ్ఛిత్తికి, భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి ఆస్కారం కలిగింది.

పోరాట విరమణ నిర్ణయం దళాల సభ్యులకు రుచించలేదు. రాజకీయంగా చైతన్యపరచి వారికి నచ్చజెప్పవలసి వచ్చింది. పోరాట విరమణ చేసే నాటికి నల్లమల రీజియన్‌లో దళాలలో రెండు వేల మంది వున్నారు. దళాలు నాయకత్వం వహించగా, సామాన్య ప్రజలంతా పోరాటంలో పాల్గొనటం, యూనియన్ సైన్యాలు వచ్చే వరకూ వుధృతంగా సాగింది. ఆ తర్వాత దళాలు మాత్రమే పోరాడే పరిస్థితి ఏర్పడింది. దళ సభ్యులు మైదాన ప్రాంతాలను విడిచి అడవుల్లో వుండవలసి వచ్చింది. నాడు నైజాం నవాబు, ఆతని భూస్వాముల దోపిడీని ఎదిరించి పేదలు, రైతులు కొన్ని హక్కులు సాధించుకున్నారు. వారి హక్కులను నీరుగార్చి నైజాం నవాబుకు వారి తాబేదార్లకూ అండగా ప్రభుత్వం సైనిక దాడిని రైతాంగంపై ప్రారంభించింది. ఆ దాడి నుంచి రక్షించుకొని తమ హక్కులను కాపాడుకునే నిమిత్తం రైతాంగం జరిపిన పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ వారితో తలలో నాల్కలా వ్యవహరించింది. ఆనాడు ఆ ప్రతిఘటన చెయ్యకపోతే అది విద్రోహమయ్యేది. ఆనాడది రైతులు తమ న్యాయమైన హక్కుల కోసం జరిపే సాయుధ గెరిల్లా పోరాటంగా భావించటానికి బదులు, దాన్ని రాజకీయాధికారం కోసం పోరాటంతో ప్రత్యక్షంగా ముడి బెట్టడం జరిగింది. ఆనాటి వర్గ శ[illegible]ల బలాబలాలను నాటి భౌతిక పరిస్థితిని సవ్యంగా

అంచనా వేసుకోలేకపోవడం పొరపాటే.

ఐదేళ్లపాటు జరిగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం కాలంలో పట్టణాలు, పెద్దనగరాలలోని కార్మికవర్గం నుంచి అండదండలు లభించలేదు. శ్రామిక వర్గం రాజకీయంగా బలహీనంగా వుండగా, రైతాంగ పోరాటానికి అండగా పారిశ్రామిక కార్మికులను కమ్యూనిస్టు పార్టీ కదిలించగలిగేంత వరకూ వ్యవసాయ విప్లవం విజయం సాధించే అవకాశం తక్కువ.

పోరాటాన్ని నడుపుతున్న నాయకత్వం, పార్టీ కార్యకర్తలు, ప్రజలకు, వారి చైతన్యానికి, నిర్మాణ పటిమకు మరీ అందుకోలేనంత ముందుండకూడదు. అలా ప్రజలకు దూరమయితే పేరుకు మాత్రమే రైతాంగ ప్రజాపోరాటం అవుతుంది. ప్రజలు పాల్గొనరు. ప్రజలే తమ విముక్తి ప్రదాతలనే సరైన సిద్ధాంతానికి మారుగా, కొద్ది మంది వీరులే అణగారిన ప్రజల విముక్తి దాతలనే ఊహాజనిత సిద్ధాంతం బయలుదేరుతుంది.

తెలంగాణా విప్లవ పోరాటం అనుభవాల నుంచి నేర్చుకోవలసిన గుణపాఠాలుగా పై అంశాలను బసవపున్నయ్యగారు ముప్పయ్యేళ్లనాడే పేర్కొన్నారు.

ఆయుధాలు చేపట్టవలసిన పరిస్థితి 1946 నుంచీ ఏర్పడింది. తెలంగాణా పోరాటానికి అండగా కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల నుంచి తోడ్పాటు లభించింది. ఈ జిల్లాలలో కమ్యూనిస్టు ఉద్యమంపై 1948 నుంచి తీవ్ర నిర్బంధ విధానం ప్రయోగించబడింది. అయినా ఈ ప్రాంతంలో ప్రజాతంత్ర సాంప్రదాయం బలంగా వుండడం, క్రమశిక్షణ, నిర్మాణం కలిగిన కమ్యూనిస్టు పార్టీ వుండటంవల్ల నాటి తెలంగాణా పోరాటానికి అండదండలు లభించాయి. ఈ ప్రాంతానికి చెందిన కమ్యూనిస్టు కార్యకర్తలలో మెరికల్లాంటి వారు, నాయకులుగా అభివృద్ధి చెందిన వారు మూడు-నాలుగు వందల మందిని పోలీసు తూటాలు బలిగొన్నాయి. చల్లపల్లి నారాయణరావు, పండితారాధ్యుల మల్లికార్జునశర్మ, కంఠంనేని వెంకటరత్నం, చింతపల్లి పాపారావు, వి మృత్యుంజయుడు, నిమ్మగడ్డ రత్తయ్య, చుక్కపల్లి నరసయ్య, కోటిపల్లి భాస్కరరావు, అనుమర్లపూడి సీతారామారావు వంటి వారు ఎందరెందరో తమ ప్రాణాలను బలిదానం చేశారు. వారి త్యాగాలు ఉద్యమానికి స్ఫూర్తి నిచ్చాయి. ఈ నిర్బంధకాండకు భయపడక పోగా, దానికి జవాబుగానా అన్నట్లు ఇంకెందరో ఉద్యమానికి అండగా నిలిచారు. ఆడంబరంగా పది మందికి కనిపించకుండానే అజ్ఞాతవాసంలో కమ్యూనిస్టు నాయకులకు రక్షణ ఇవ్వటంలో ఎంతో పట్టుదలతో

విశ్వాసంతో పని చేసిన వారున్నారు. అలాంటి వారు పార్టీ ముఖ్యులందరికీ తటస్థ పడ్డారు. దేశంలో కమ్యూనిస్టు వుద్యమానికి తెలంగాణా పోరాటంవల్ల అమూల్యమైన అనుభవాలు లభించాయి. విలువయిన పాఠాలు నేర్చుకోవటానికి ఆస్కారం ఏర్పడింది.

గంగాధరరావు తెలంగాణా పోరాటం చివరిదశలో అరణ్యంలో కఠోర జీవితంగడిపారు. ఎన్నో కష్టాలనుభవించారు. ధనికవర్గం నుంచి వచ్చిన ఆయన ఈ కష్టాలన్నింటినీ అనుభవించే జీవితాన్ని కోరి స్వీకరించారంటే రాజకీయ సిద్ధాంత సంకల్ప బలమే కారణం. పరిస్థితులే ఆయనలో ధైర్యాన్ని ఇనుమడింపజేశాయి. ఈ క్లిష్ట పరిస్థితులలో కామ్రేడ్స్‌ను కాపాడుకోవటమే ప్రధానం అనే పట్టుదలను పెంచాయి. ఆత్మీయత పెరిగింది. పరిస్థితులే సామాన్యులను యోధులుగా తయారు చేస్తాయి. చేశాయి కూడా.

తెలంగాణా పోరాటం సాగుతుండగానే విధాన సంబంధమైన చర్చలూ జరుగుతుండేవి. పోరాటం కొనసాగించటాన్నే చంద్రరాజేశ్వరరావు సమర్థించారు. తెలంగాణా పోరాటాన్ని విరమించాలనే వారు పి.సి. జోషి, జి. అధికారి తదితరుల నాయకత్వాన పెద్ద సెక్షన్‌గా తయారయ్యారు. పోరాటాన్ని అసలు విరమించరాదన్నది మొదటి నుంచీ బి టి. రణదివే వాదన. తెలంగాణా పోరాటం ప్రారంభానికి పూర్వం పి.సి. జోషి పంథాలోనే పయనించిన సుందరయ్య తెలంగాణా పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. రావి నారాయణరెడ్డి తెలంగాణా ప్రాంతంలో మంచి గుర్తింపు పొందిన నాయకుడు. అయితే ఆయన నిర్బంధం తట్టుకోలేక పోరాటం నుంచి బయటకువెళ్లారు.

రాష్ట్ర స్థాయిలోను, కేంద్ర కమిటీ స్థాయిలోనూ తీవ్రమైన చర్చల అనంతరం 1951 ద్వితీయార్థంలో తెలంగాణా పోరాట విరమణ నిర్ణయం జరిగింది. భారత కమ్యూనిస్టు పార్టీ తరపున బసవపున్నయ్య, రాజేశ్వరరావు, డాంగే, అజయ్‌ఘోష్ రహస్యంగా మాస్కో చేరుకుని స్టాలిన్‌తో చర్చలు జరిపి వచ్చిన తర్వాత ఆయన సూచనలు, సలహాల వెలుగులో పోరాట విరమణ నిర్ణయం జరిగింది. తెలంగాణా ప్రాంతం నుంచి పోరాటంలో పాల్గొన్న కామ్రేడ్స్‌కు ఆ నిర్ణయం మింగుడు పడలేదు. ఫ్యూడల్ పెత్తందార్ల చేతుల్లో అనుభవించిన బాధలను వారు మరచిపోలేకపోయారు. ఈ పరిస్థితులలో సుందరయ్య అమరాబాద్ రీజియన్‌కు స్వయంగా వెళ్లి అరణ్యంలో వున్న దళాల సభ్యులకు అన్ని విషయాలూ వివరించి నచ్చజెప్పారు. పోరాట విరమణ ఒప్పందంపై కమ్యూనిస్టు పార్టీ తరపున అజయ్‌ఘోష్, డాంగే సంతకాలు చేశారు. ఆంధ్రనాయకులు సంతకాలు చేస్తేనే విరమణ చేసినట్లవుతుందని ఆనాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పట్టుబట్టారు. ఆ తర్వాత సుందరయ్య, బసవపున్నయ్య

సంతకాలు చేసిన మీదటనే పోరాట విరమణ జరిగినట్లు అంగీకరించారు.

తెలంగాణా పోరాట విరమణ అనంతరం కేసులున్న వాళ్లు, 1952 మే వరకూ అజ్ఞాతవాసంలోనే వున్నారు. తెలంగాణా ప్రాంతం కమ్యూనిస్టు స్థావరంగా తయారయి స్థిరపడుతుందని భయపడిన పాలకులు తీవ్రమైన నిర్బంధ కాండను ప్రయోగించారు. 1948లో కలకత్తాలో జరిగిన పార్టీ కాంగ్రెస్ మొదలు 1952 వరకూ ఆ నిర్బంధ కాండ కొనసాగింది. పోరాట విరమణ అనంతరం వెనకకు తగ్గటంక్రమపద్ధతిలో లేకపోతే శత్రువు మనలను నష్టపరుస్తాడని సుందరయ్యగారు ముందుగానే హెచ్చరించారు. తదనుగుణంగా పోరాట విరమణ తర్వాత కూడా గంగాధరరావు అక్కడే వుండి 1952 ఎన్నికల తర్వాత కొంత కాలానికి బయటకు వచ్చారు.

1952 ప్రారంభంలో అరణ్యాలకు వెలుపల ప్రజల మధ్యన రహస్య స్థావరాలలో అజ్ఞాతవాసం ఒక అగ్ని పరీక్షగా వుండేది. చావుబ్రతుకులకు మధ్య విభజన రేఖా మాత్రంగా వుండేది. పోరాటాలలో సాధారణ ప్రజలు పాల్గొనటంలేదు. ఆ పరిస్థితులలోనూ ధైర్య సాహసాలతో కమ్యూనిస్టు నాయకులకు ఆశ్రయం ఇవ్వటానికి ముందుకు వచ్చే వారుండేవారు. కాని, అలా ఆశ్రయం ఇచ్చిన వారి కుటుంబాల నుంచి తగిన సహకారం వుండేదికాదు. నీళ్లలో చేపల్లా వుండవలసిన కార్యకర్తల పరిస్థితి ఒడ్డున పడిన చేపల మాదిరిగా తయారయింది.

తెలంగాణా పోరాట విరమణకు ముందే రెండు వాదనలు బలంగా సాగాయి. గంగాధరరావు అందులో ఒక ధోరణితో స్థూలంగా ఏకీభావం కలిగి వున్నారు.

హైదరాబాద్ సంస్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వ సైన్యాలు ప్రవేశించటం యొక్క ప్రధాన లక్ష్యం తెలంగాణా రైతు సాయుధ గెరిల్లా పోరాటాన్ని, దాని ఘన విజయాలను దెబ్బతీయటమే.

తెలంగాణా సాయుధ గెరిల్లా పోరాటం, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసే లక్ష్యంతో కొనసాగించడం పొరపాటే అయినప్పటికీ రైతుల భూములను, విజయాలను రక్షించుకునే లక్ష్యంతో కొనసాగించటం సరియైనదే.

1951-52 సంవత్సరాలనాటి క్లిష్టపరిస్థితులలో వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలపై కేసులు, వారంట్లు వుండగా లీగల్, ఇల్లీగల్ పద్ధతులు రెండింటిని జోడించి పని చేయాలి. రహస్యంగా వున్న పార్టీ ముఖ్యులను విధిగా పార్టీ కమిటీలలో ఒక భాగంగా వుంచితీరాలి.

పోలీసులకు, సైన్యాలకు పట్టుబడిన తర్వాతనో, జైళ్లలోను, పోలీసు

కస్టడీలోను చిత్రహింసలకు భయపడిన కారణంగానో శతృవుకు లొంగిపోయి, పార్టీ రహస్యాలు చెప్పి అనేక మంది కామ్రేడ్స్ యొక్క ప్రజల యొక్క ప్రాణాలు బలివ్వటానికి, పార్టీకి హాని చేయడానికి కారణమైన వారెవరికీ తిరిగి పార్టీలో సభ్యత్వం ఇవ్వరాదు.

ఆంధ్ర-తెలంగాణా, ఉభయ ప్రాంతాల నుండి వచ్చిన పార్టీ సభ్యులతో ఏర్పడ్డ, ఏ విశాలాంధ్ర కమ్యూనిస్టు కమిటీ వీరోచిత తెలంగాణా పోరాటాన్ని అయిదేళ్లపాటు నిర్వహించిందో, ఆ విశాలాంధ్ర కమిటీ ఆధ్వర్యాన్నే సాయుధ పోరాట విరమణ తర్వాత ఉత్పన్నమయ్యే తెలంగాణా పోరాట సమస్యలను ఎదుర్కోవాలి. పరిష్కరించాలి.

తెలంగాణా రైతాంగ విజయాలపైన, ప్రజలపైన కాంగ్రెసు ప్రభుత్వం సాగించుతున్న సైనికదాడులకు అమలు జరుగుతున్న ఫాసిస్టు కాండకు, కారకులైన కాంగ్రెస్ నాయకులను ముద్దాయిలుగా నిలబెట్టి ప్రజలు శిక్షించాలి.

సాయుధ రైతాంగ గెరిల్లాలపై కేసులు ఎత్తివేయాలి. వారంట్లు రద్దు చేయాలి. వారిపై కాంగ్రెస్ సాగించే వేట మానాలి. అంతవరకూ గెరిల్లాలు ఆయుధాలు ఒప్పగించజాలరు.

వివిధ రాజకీయ పార్టీలు, గ్రూపుల, వ్యక్తులతో కూడిన పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంటులాంటి ఐక్య సంఘటన నిర్మాణంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని కలిపి వేయరాదు. కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేక రాజకీయ సిద్ధాంత నిర్మాణ వునికిని కాపాడాలి. శాసనసభలోనూ వెలుపలా పార్టీ దాని జెండా, దాని ఎన్నికల గుర్తు ప్రత్యేకంగా వుండాలి. అనాడు ఈ వాదనలను బలపరిచిన వారిలో *గంగాధరరావు* వున్నారు.

కాగా పై వాదనలను వ్యతికించుతున్న వారు చేసిన వాదనలేమిటో కూడా ఈ సందర్భంలో గుర్తు చేసుకోవటం అవసరం. నైజాం నిరంకుశపాలనను కూలద్రోసి, సంస్థాన ప్రజలన్ని విముక్తి చేయటం, నెహ్రూ సైన్యాల ప్రథమ లక్ష్యం

నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోసే లక్ష్యంతో సాగించిన సాయుధ పోరాటమూ తప్పే, రైతు విజయాలను, భూములను రక్షించుకోడానికి సాగించిన సాయుధ పోరాటమూతప్పే.

వారంట్లు,కేసులు వున్న వారు ఎంత ముఖ్య కార్యకర్తలయినా వారందరినీ పార్టీ కమిటీల నుంచి తొలగించాలి. కాకపోతే లీగాలిటీకి భంగం. కమిటీలు బహిరంగంగా పని చేయలేవు కాబట్టి లీగలుగా వున్న వారితోనే పార్టీ కమిటీలు ఏర్పరచాలి.

లొంగిపోవటానికి, నిర్బంధానికి గురికావటానికి, రహస్యాలు చెప్పివేయటానికి మూల కారణం పార్టీ తీసుకున్న సెక్టేరియన్‌పంథా కాబట్టి వారిని శిక్షించకూడదు. వారందరికీ పార్టీ సభ్యత్వ మీయటమే కాకుండా, పార్టీ కమిటీలలో ప్రముఖ స్థానాలు కూడా ఇవ్వాలి.

విశాలాంధ్ర కమిటీని విడగొట్టి రెండు చేయాలి. ఆంధ్ర కమిటీ వేరుగా, తెలంగాణా కమిటీ ఏర్పరచాలి.

విశాలాంధ్ర కమిటీ నాయకత్వాన్ని ముద్దాయిలుగా నిలబెట్టి శిక్షించాలి.

ఆయుధాలు ప్రభుత్వానికి వొప్పజెప్పటంలో ఆలస్యం జరుగుతోంది కాబట్టే నిర్బంధ విధానం తీవ్రతరం అవుతోంది. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్‌నే ప్రధాన రాజకీయ వేదికగా చేయాలి. అటు శాసనసభలోనూ, ఇటు ప్రజల్లోనూ ఫ్రంటు పేరిటనే పని సాగించాలి.

ఈ వాదనలన్నీ మరొక ధోరణిగా రూపుదిద్దుకున్నాయి.

నిర్బంధకాండ కొనసాగుతుండగా ప్రజలను వుత్సాహపరచటం కోసం, కార్యకర్తలకు ధైర్యం చెప్పడం కోసం ఎ.కె. గోపాలన్ 1951లో రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించారు. దేశంలో ఏ ప్రాంతంలో రైతాంగ పోరాటం జరుగుతున్నా ఆయన అక్కడికి వెళ్ళి తానూ ప్రత్యక్షంగా పాల్గొని వుత్సాహ పరుస్తుండేవారు.

తెలంగాణా పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనటం, నల్లమల అడవులలో అమరాబాద్ రీజియన్ కార్యదర్శిగా పార్టీ బాధ్యతలు నిర్వర్తించటం, ఆ సమయంలో తెలంగాణా ప్రాంత పరిస్థితులతోనూ కార్యకర్తలతోనూ గంగాధరరావుకు అనుబంధం బలపడింది. పోరాట విరమణ అనంతరం తెలంగాణా ప్రాంతంలోనే పని చేయాలన్న కోర్కెకలిగింది. ఆయన అక్కడనే వుండిపోయి వుద్యమానికి రాజకీయ నాయకత్వం సమకూర్చటంలో సహాయపడితే బాగుంటుందన్న అభిప్రాయం అచటి కామ్రేడ్స్‌లోనూ ఏర్పడింది. అందుకు అనుగుణంగా ఆయన తెలంగాణాలోనే వుండిపోవాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది కూడా. అయితే గుంటూరు జిల్లా వుద్యమ అవసరాల రీత్యా గంగాధరరావు తమకు అవసరం అని అక్కడ వారు కోరిన మీదట, పార్టీ నాయకత్వం అంతకు ముందు చేసిన నిర్ణయాన్ని మార్పు చేశారు. గుంటూరు జిల్లాకు వెళ్లి పని చేయవలసిందిగా నిర్ణయించారు. అలాకాకపోతే ఆయన కమ్యూనిస్టు పార్టీ తెలంగాణా ప్రాంతీయ కమిటీలో వుండి పని చేయడం జరిగి వుండేది.

## 1952 ఎన్నికలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పార్లమెంటుకు, వివిధ రాష్ట్రాల శాసనసభలకూ ఎన్నికలు 1952లో వయోజన ఓటింగుతో నిర్వహించబడినాయి. ఆ ఎన్నికల ఫలితాలు విశాలాంధ్ర ప్రజలలో కమ్యూనిస్టు పార్టీపైగల ఆదరణను కళ్లకు కట్టినట్లు చూపాయి. తెలంగాణా రైతాంగ పోరాటంలో నాలుగువేల మంది ప్రాణాలను బలిదానం చేశారు. ఆ పోరాటానికి అండగా నిలిచిన ఆంధ్ర ప్రాంతంలో నాలుగు వందల మంది యువకిశోరాలను పోలీసుల తుపాకి తూటాలు బలిగొన్నాయి. 1948 ఆరంభం నుంచే కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్రహింసలు, హత్యలు సాగించింది.

తెలంగాణాలోని గెరిల్లాలను, కమ్యూనిస్టు ప్రజాసంఘాల కార్యకర్తలనూ పట్టి నిజాంకు అప్పజెప్పారు. నైజాం నవాబుకు ఆయుధాలు సరఫరా చేశారు. రెండు వేల మంది తెలంగాణా ప్రజలనూ, కార్యకర్తలనూ కాల్చి వేశారు. లక్షలాది ప్రజలను చిత్రహింసలకు గురి చేశారు. అయినా తెలంగాణా వుద్యమపురోగమనాన్ని నిలవరించలేకపోయారు. మూడు వేల గ్రామాలలోగ్రామ పంచాయతీ కమిటీలు ఏర్పడినాయి. పది లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగింది. వుద్యమం తెలంగాణా అంతటికీ వ్యాపించసాగింది. దానితో కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సైన్యాలను పంపి తెలంగాణా ప్రజా ఉద్యమాన్ని అణచబూనుకుంది. నైజాం నవాబును రాజప్రముఖ్ హోదాలో గద్దెపై కూర్చుండబెట్టారు. రైతు, కూలీల భూములను లాక్కుని భూస్వాములకు అప్పజెప్పింది.

"తెలంగాణా ఆంధ్రలో కాంగ్రెస్ ప్రభుత్వం-గత ఐదేండ్లుగా నాలుగు వేల మంది ప్రజలను కార్యకర్తలను కాల్చివేశారు. ఐదు వేల మంది తెలుగు స్త్రీలను బలాత్కరించి మానభంగం చేశారు. రెండు లక్షల మంది ప్రజానీకాన్నిబ్రిగ్స్‌ప్లానంటూ కాన్సెంట్రేషన్ క్యాంపులలో పెట్టారు. తిండి, గుడ్డ ఇవ్వకుండా, పనిపాటు చేసుకోనివ్వక పదివేల మందిని ఈ క్యాంపులలో మలమల మాడ్చి అంటు వ్యాధులకు ఆహుతి చేశారు.

అడవులలో వున్న వెయ్యిగ్రామాలకుపైగా నిప్పుపెట్టి భస్మీపటలం చేశారు. పదిహేను వేలగ్రామాలు పోలీసుల, హోంగార్డుల దాడికి గురైనాయి. పదిహేను లక్షల మందికిపైగా తీవ్ర చిత్రహింసలకు గురి చేయబడినా ఈ ఫాసిస్టు హత్యాకాండను ఎదుర్కొని కమ్యూనిస్టు పార్టీ ప్రజలతోపాటు నిలబడిపోరాడింది.

తమ హక్కుల కోసం, తమ ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాడే

పార్టీ, ప్రాణాలను ఒడ్డి కూడా పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీయేనని విశాలాంధ్ర ప్రజానీకం తమ కండ్లారా చూచి గ్రహించారు" (1952 ఎన్నికలపై "ప్రజాయుగం" పత్రికలో సుందరయ్యగారి సమీక్ష నుంచి)

మరో వైపున కమ్యూనిస్టులపై పెద్దఎత్తున దుష్ప్రచారం సాగింది. అయినప్పటికీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌గా వున్న ప్రాంతం నుంచి 1952 ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ తరపున 19 మంది లోక్‌సభ సభ్యులుగాను, 85 మంది అసెంబ్లీ సభ్యులుగానూ ఎన్నికయినారు. ఆ విజయాలు యాదృచ్ఛికంగా లభించినవి కాదు. వీరతెలంగాణా విప్లవ పోరాటాన్ని చూచి, కమ్యూనిస్టుల త్యాగాలను చూచి ప్రజలు కమ్యూనిస్టులను గెలిపించారు. పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయటం, వుద్యమ నాయకులపై అభాండాలు వేయటం ఒక ఆయుధంగా శత్రువులు చేపట్టారు. ఆ విధంగా సుందరయ్య, బసవపున్నయ్య వంటి నాయకులపైనా చేశారు. వాటిని ఎదుర్కొనటానికి గట్టిగా పోరాడటం, దెబ్బలాటకు కూడా సిద్ధపడటం జరుగుతుండేది. తెలంగాణా పోరాటాన్ని గూర్చి సాగిన దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజలు చూపిన ఆదరణతో పార్టీలోపల కూడా అంతకు ముందంతా పోరాటాన్ని గూర్చి వక్రభాష్యాలు చెప్పిన వారు మౌనం వహించారు. పోరాట కాలంలో జారిపోయిన వారిలో కొందరు కూడా 1952 ఎన్నికలలో కమ్యూనిస్టు అభ్యర్థులుగా పోటీ చేసి గెలిచారు. గంగాధరరావు ఆయన లాగే మరికొందరూ మాత్రం ఆ ఎన్నికల సమయంలోనూ, అజ్ఞాతవాసంలోనే వుండవలసి వచ్చింది.

1952 ఎన్నికల అనంతరం కమ్యూనిస్టు పార్టీ పత్రికగా విజయవాడ నుంచి 'విశాలాంధ్ర' దినపత్రిక ప్రచురణ ప్రారంభించడం జరిగింది. అందుకు అవసరమైన నిధులలో ప్రధానభాగాన్ని పార్టీకి చెందిన ముఖ్యులే సమకూర్చారు.

తెలంగాణా పోరాటంలో పాల్గొన్న వారి సమావేశం, పోరాట విరమణ అనంతరం 1953లో పూనా సమీపంలో నిర్వహించబడింది. పోరాటం కొనసాగించాలన్న వారూ, విరమించాలన్నవారూ అందరూ ఆ సమావేశానికి ఆహ్వానించబడ్డారు. కామ్రేడ్స్ మధ్య ఏకీభావం సాధించటానికి తద్వారా కృషి జరిగింది.

1952 ఎన్నికల ఫలితాలను వుపయోగపెట్టుకుని, పోరాట యోధులపై కేసులు ఎత్తి వేయించటానికి సుందరయ్యగారు ప్రయత్నించగలిగారు. 1952 ఎన్నికల అనంతరం రాజ్యసభకు ఎన్నికయిన సుందరయ్య తొలి పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడుగా వున్న విషయం అందరికీ తెలిసిందే.

1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన మీదట టంగుటూరి

ప్రకాశం ముఖ్యమంత్రిగా, నీలం సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రిగా ఏర్పడిన మంత్రివర్గం 1954 నవంబరులో పడిపోయింది. దానితో ఆంధ్రరాష్ట్రంలో 1955 మొదట్లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలు ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీకి పెద్ద మలుపు తెచ్చాయి. ఆ ఎన్నికలకు కొద్ది మాసాల ముందే దుగ్గిరాల నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు జరిగిన ఉప ఎన్నికలో గంగాధరరావు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. అయినా 55 ఎన్నికలలో పోటీ చేయకుండా తప్పుకున్నారు. 1955 ఎన్నికల్లో విజయం సాధించి కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రరాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదనే వాతావరణం ఏర్పడింది. ఇతరులెవరినీ కలుపుకోకుండా కమ్యూనిస్టు పార్టీయే అన్ని స్థానాలలోనూ తన అభ్యర్థులను నిలిపింది. కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని కైవసం చేసుకుంటుందన్న భయం శతృవర్గాలలో ఏర్పడింది. దానితో వారు జీవన్మరణ సమస్యగా తీసుకుని ఎన్నికల పోరాటంలో పాల్గొన్నారు. భూస్వాముల కుటుంబాలలోని మహిళలు కూడా వీధులలోకి వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు వ్యతిరేక విష ప్రచారం వువ్వెత్తున సాగింది. నాయకులపై అభాండాలు ప్రచారం చేశారు. ఆనాడు సాగిన విషప్రచారం ధాటికి మహాకవి శ్రీశ్రీ వంటి వారు కూడా విచలితుడయ్యారు. రాష్ట్రం మొత్తం మీద 35 శాతం దాకా ఓట్లు వచ్చాయి. కొన్ని జిల్లాలలో 40 శాతానికిపైగా ఓట్లు వచ్చినా సీట్లు రాలేదు. రాష్ట్రం మొత్తం మీద 15 సీట్లలో మాత్రమే గెలవగలిగారు. కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల చిహ్నంతో పోటీ చేసి గెలిచిన వావిలాల గోపాలకృష్ణయ్య, ఎన్నికల అనంతరం తాను ఇండిపెండెంటు ఎమ్మెల్యేనేనని ప్రకటించుకున్నారు. అంతకు ముందు కూడా తెలంగాణా పోరాట కాలంలో యూనియన్ సైన్యాలు ప్రవేశించాక ఆయన పార్టీకి రాజీనామా ఇచ్చారు. ఆ విధంగా పలుసార్లు అవకాశవాదం ప్రదర్శించారు. ఏమైనా రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ చేతుల్లోకి వస్తుందనుకున్న అధికారం రాకపోవడంతో నిరుత్సాహం ఏర్పడింది. ఆ పరిస్థితులలో పార్టీ శ్రేణులను నిలబెట్టటానికి కృషి చేయటానికి మారుగా పార్టీని నీరసపరచటానికి రివిజనిస్టు పంథాలో వున్న నాయకులు కారకులయ్యారు. అందులో చంద్రరాజేశ్వరరావును ముందుగా చెప్పుకోవలసి వస్తుంది. కార్యకర్తలను నిలబెట్టదానికి కృషి చేయకపోగా, పార్టీ బాధ్యతలు వదిలేసి బ్రతుకుదెరువు చూచుకోవలసిందిగా ప్రోత్సహించారు. చౌకగా దొరికే చోటుకెళ్లి పొలాలు కొనుక్కొని వ్యవసాయం చేసుకొనటానికి ప్రేరేపించారు. దీనివల్ల చాలా మంది అస్త్రసన్యాసం చేసి వుద్యమానికి దూరమయ్యారు. స్వంత లాభం చూచుకోవటమే ప్రధానం అనుకున్న వారు కమ్యూనిస్టు నాయకులుగా కొనసాగలేరు.

సీట్లురానంత మాత్రాన నిరుత్సాహంతో కాడిపారెయ్యటం తగదు. నచ్చజెప్పి కార్యకర్తలను నిలబెట్టటానికి కృషి చేసిన వారిలో గంగాధరరావు వున్నారు.

కమ్యూనిస్టులు ఎన్నో త్యాగాలు చేసినప్పటికీ, స్వాతంత్ర్యపోరాట కాలంలో చేసిన కొన్ని పొరపాట్లను ఆధారం చేసుకొని శత్రువులు సాగించిన దుష్ప్రచారం కారణంగా నష్టం జరిగింది. చాలా కాలం పాటు శత్రువులకు అదే రాజకీయాస్త్రంగా వుపయోగపడింది.

తెలంగాణా పోరాటం ప్రభావంవల్ల వర్గ దృక్పథం పెంపొందిన ప్రాంతం మినహా మిగతా ప్రాంతాలలో వుద్యమానికి దెబ్బతగిలింది. వ్యవసాయ కార్మిక వర్గాన్ని నిలబెట్టేట్లుగా చైతన్యం పెంపొందించడం జరగనందువల్లనే నష్టం జరిగింది.

1956 నుంచీ కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత పోరాటం సాగింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ బూర్జువా వర్గ ప్రతినిధిగనుక ప్రజాతంత్ర కర్తవ్యాలను నెరవేర్చుతుందనే వాదన ఒక పక్క జరుగుతుండగా దానికి వ్యతిరేకంగా నిలబడి పోరాడిన వారిలో గంగాధరరావు వున్నారు. పార్టీలో రివిజనిస్టు రాజకీయాలతోపాటు, రివిజనిస్టు నిర్మాణ పద్ధతులు కూడా వచ్చాయి. పార్టీలో సభ్యులుగా ఎవరిని పడితే వారిని చేర్చుకోవాలనే వాదన బయలుదేరింది. పార్టీ సభ్యత్వం విషయంలో కనీస ప్రమాణాలు పాటించవలసిన ఆవశ్యకతను గాలికి వదలివేశారు. కనీస విధులను నిర్వర్తించని వారిని కూడా సభ్యులుగా కొనసాగించటం మొదలెట్టారు. పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించే వారందరికీ పార్టీ సభ్యత్వం అనే నినాదంతో డాంగే ముందుకొచ్చారు. ఈ ధోరణులన్నింటినీ గంగాధరరావు గట్టిగా వ్యతిరేకించుతూ వచ్చారు. ఆయనా, ఆయన లాగా ఆలోచించే వారూ పార్టీ కమిటీలో బాధ్యతలు నిర్వర్తించి నిర్మాణంలో బాధ్యతలు నిర్వర్తించే సందర్భంలో తమ పరిధిలో మాత్రం పార్టీ ప్రమాణాలను కాపాడే విషయంలో ఖచ్చితంగా వ్యవహరించుతూ వచ్చారు. పార్టీ సభ్యుడయిన తర్వాత ఇలాంటి ధోరణులన్నింటికి వ్యతిరేకంగా గంగాధరరావు గట్టిగా నిలబడ్డారు. పార్టీ ప్రమాణాలకు కట్టుబడకుండా వ్యవహరించే వారిపట్ల ఆయనకు ఏవగింపు కలిగింది. ఆయనలాగే ఆలోచించే వారూ పార్టీ నిర్మాణంలో బాధ్యతలు నిర్వర్తించే సందర్భంలో తమ పరిధిలో మాత్రం పార్టీ ప్రమాణాలను కాపాడే విషయంలో ఖచ్చితంగా వ్యవహరించుతూ వచ్చారు.

నీలం రాజశేఖరరెడ్డి పోరాట కాలంలో తనలొంగుబాటుకు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆయనను పార్టీ సభ్యుడుగా అంగీకరించేదిలేదని తరిమెల నాగిరెడ్డి గట్టిగా పట్టుబట్టారు. అప్పుడు రాజశేఖరరెడ్డి క్షమాపణలతో కరపత్రం

వేశారు. ఆ తర్వాతనే పార్టీలోకి ఆయన ప్రవేశాన్ని అంగీకరించడం జరిగింది. ఆ విధంగా లొంగిపోయిన రాజశేఖరరెడ్డి, వేములపల్లి శ్రీకృష్ణవంటి వారు నాయకులుగా వున్న పార్టీలో పని చేయవలసి రావటం పట్ల గంగాధరరావు ఎంతగానో ఆందోళన చెందారు. శత్రువుకు లొంగిపోయి ద్రోహం చేసిన వారిని మాత్రం క్షమించకూడదు. ఇతరత్రా వ్యక్తిగత బలహీనతలయితే క్షమించవచ్చు, అనేదే ఆయన అభిప్రాయం. 1957–58 సంవత్సరాలలో కమ్యూనిస్టు పార్టీలో సిద్ధాంతాలు, విధానాల పరంగానూ, నిర్మాణం విషయంలోనూ పెద్ద పోరాటం సాగింది. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)గా ఏర్పడిన వారిని ఉమ్మడి పార్టీలో ఎన్నాళ్లు వుండనిస్తారో? ఏమో? అనే పరిస్థితి నెలకొన్నది. పార్టీ సాధారణ సభ్యులలో అత్యధిక సంఖ్యాకులు కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)గా ఆ తర్వాత ఏర్పడిన వారితోనే వున్నప్పటికీ, నాయకత్వంలో మాత్రం ఆ తర్వాతనూ సిపిఐలో కొనసాగిన వారే వున్నారు. సుందరయ్యగారు మొదటి నుంచీ కూడా పార్టీ నియమ, నిబంధనలను పాటించే విషయంలో ఖచ్చితంగా వుండే వారు. పార్టీ నిర్మాణపరిధిలోనే పని చేస్తుండేవారు.

1966 నుంచీ కమ్యూనిస్టు పార్టీలో సిద్ధాంత చర్చ వుధృతంగా సాగింది. అదంతా అంతర్గతంగానే జరుగుతూ వచ్చింది. 1962లో భారత–చైనా సరిహద్దు సంఘర్షణ సమయంలో రివిజనిస్టు నాయకత్వం దారుణమైన వైఖరిని అనుసరించింది. సంభాషణల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కాంగ్రెస్‌తో సహా దాదాపుగా అన్నీ పార్టీలూ కోరాయి. ఇప్పటి బిజెపి యొక్క ఆనాటి రూపమగు జనసంఘ్ మాత్రం కయ్యానికి కాలు దువ్వే ధోరణిని చేపట్టింది. అయితే ఆనాడు వారికున్న శక్తి పరిమితం. తగినంత శక్తిలేనందువల్ల ఆ విషయంలో పెద్దఎత్తున క్యాంపెయిన్ చెయ్యలేపోయింది. అదే సమయంలో కమ్యూనిస్టు పార్టీలో గల రివిజస్టు నాయకత్వం మాత్రం చైనాపై కయ్యానికి కాలు దువ్వే వైఖరితో వ్యవహరించింది. సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోరుతున్న కమ్యూనిస్టు నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ విధంగా తమ పార్టీకే చెందిన నాయకులలో కొందరిని అరెస్టు చేసినా ఆ అరెస్టులను ఖండించడానికి రివిజనిస్టు నాయకత్వం సిద్ధపడలేదు. చైనా పట్ల తమ వ్యతిరేకతను, తదనుగుణంగా తాముచేస్తున్న కృషిని గూర్చి చెప్పుకొని మెప్పుపొందాలనే తాపత్రయపడ్డారు. కమ్యూనిస్టు నాయకులను ప్రభుత్వం అరెస్టు చేస్తే ఖండించని వారి నాయకత్వంలో నడుస్తున్న పార్టీలో పనిచేయడం అనవసరం అనే అభిప్రాయానికొచ్చిన గంగాధరరావు పని చేయకుండా కూర్చుండిపోయారు. అప్పుడు సుందరయ్య ఆయనతో చర్చించి

కదిలించారు. సరైన పంథాలో పయనించడానికిగాను, రివిజనిస్టు నాయకత్వాన్ని ఎదిరించిపోరాటం సాగించుదాం. అవసరమైతే అలాంటి వారిని త్రోసి పుచ్చి సిసలయిన కమ్యూనిస్టు పార్టీని నిర్మించుకుందాం అని సుందరయ్యగారు వివరించిన తర్వాతనే గంగాధరరావు మరల క్రియాశీలపాత్ర నిర్వహించనారంభించారు. ప్రధానంగా గుంటూరు జిల్లాలో రివిజనిస్టు వ్యతిరేకపోరాటంలోనూ, అనంతరం 1964 తర్వాత అతివాద విచ్ఛిన్నానికి వ్యతిరేకంగా పోరాటంలోనూ, కృషి సాగించారు. రెండు సందర్భాలలోనూ కూడా గంగాధరరావు, మోటూరు హనుమంతరావు కలిసి పోరాడారు. అతివాద విచ్ఛిన్నం వల్ల గుంటూరు జిల్లాలో పెద్ద భాగం బయటకు పోయింది. సీనియర్ నాయకులూ పలువురు పోయారు. రెండు సందర్భాలలోనూ మిగిలినవారిని నిలబెట్టుకోవటం కోసమే కృషి చేశారు. పార్టీని కాపాడుకోవటమే ధ్యేయంగా పని చేశారు. అంతిమ విజయంపట్ల అచంచల విశ్వాసం కారణంగానే అలా నిలబడగలిగారు. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మార్గమే ఉత్తమ మార్గం అనే గుర్తింపు పొందిన తర్వాత పార్టీ పుంజుకోనారంభించింది.

అంతకుముందంగా నిర్బంధకాలంలో పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతంగా వుండి ప్రజల మధ్యన పని చేసిన గంగాధరరావు, భారత-చైనా సరిహద్దు సంఘర్షణ పేరుతో అరెస్టులు జరిగిన సందర్భంలో మాత్రం అలా చేయలేదు. పోలీసులకు దొరకకుండా తప్పుకోలేక కాదు. దేశద్రోహులని ముద్ర వేస్తూ, దుష్ప్రచారం సాగించబడుతున్నందువల్ల. దాన్ని తిప్పి కొట్టటం కోసమే తప్పుకోకుండా అరెస్టయ్యారు. కమ్యూనిస్టు పార్టీలోని అత్యంత సమరశీలురంతా ఒకవైపునకు సమీకృతం అవుతున్నారని, వీళ్లతోనే ప్రమాదం అని అంచనా వేసుకున్న పాలకులు, ఆనాడు చైనా యుద్ధం పేరుతో అరెస్టులు చేశారు. భారత-చైనా సరిహద్దు సమస్యను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకులు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో వున్నప్పటి నుంచీ చెబుతూ వచ్చారు. ఆ వైఖరే సరైనదని కాలమే ధృవీకరించింది.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ వుండగా సంభవించిన చైనా సరిహద్దు సంఘర్షణ, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పడిన తర్వాత వచ్చిన అత్యవసర పరిస్థితి రెండు సందర్భాలలోనూ కూడా కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కి చెందిన నాయకులు, నిర్వహించిన పాత్రకు సిద్ధాంత నిబద్ధతే ప్రాతిపదిక.

ఈ వైఖరిని అనుసరించి ధైర్యంగా నిలబడిన నాయకులను ప్రేమించే

వాళ్లు, అభిమానించే వాళ్లూ వుండబట్టే రెండింటినీ తట్టుకొని నిలబడగలిగారు. ఆనాడు వుద్యమం లేకపోయినా పరిస్థితి మాత్రం అనుకూలంగా వుంది.


సిపిఐలోనే వుండిపోయిన వారిలోనూ అనేక మంది కమ్యూనిజంపట్ల విశ్వాసంతో, నూతనవ్యవస్థ కోసం తపించి, ఆశయాలు, ఆదర్శాల కోసమే వచ్చిన వాళ్లున్నారు. అయినా సోవియట్ యూనియన్ ప్రభావంతో అటు వైపునకు మొగ్గారు.

చంద్రరాజేశ్వరరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు ఆశయంపట్ల విశ్వాసం కలిగినవారే. రాజేశ్వరరావు జీవిత చరమాంకంలో, అస్వస్థులుగా వున్నప్పుడు గంగాధరరావు ఆయన్ని కలిసి పరామర్శించి వచ్చారు. కమ్యూనిస్టు వుద్యమ ఐక్యతను గూర్చి రాజేశ్వరరావు ఆవేదనను వ్యక్తం చేశారు. ఆయన చివరి రోజులలో సోవియట్ పరిణామాలపట్ల బాధనూ వ్యక్తం చేశారు.

రివిజనిజం-అతివాదం రెండూ ఒకే నాణానికి బొమ్మా బొరుసు లాంటివి. పార్టీలో అతి తీవ్రవాదులుగా మాట్లాడిన వారిలో కొందరు జైలు జీవితంలో నిలవలేక దూరమయ్యారు. మితవాదం వైపునకు పోవటం జరిగిన సందర్భాలూ వున్నాయి.

అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలపు జైలు జీవితం కఠిన కారాగార వాసం కాదు. సెల్సులో ఒంటరిగా గడపవలసిన పరిస్థితీలేదు. బయట కష్టాలు పడుతూ పని చేస్తున్న వారికి ఒక విధంగా విశ్రాంతి లభించిన సమయం అది. నిజానికి కొందరి ఆరోగ్య పరిస్థితులు మెరుగయినాయి కూడా. అలాంటి పరిస్థితులే తట్టుకోలేక ఎలా బయటపడదామా అని తపించిపోయి అడ్డదారులు వెతికిన వారూ వున్నారు. నిజానికి కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కి పార్టీ నిర్మాణం రీత్యా పెద్ద దెబ్బ తగిలింది అతివాద విచ్ఛిన్నం నుంచే. సిపిఐ నుంచి ఎదురయింది సైద్ధాంతిక పోరాటం. అతివాద విచ్ఛిన్నంవల్ల నిర్మాణానికి నష్టం జరిగింది. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నుంచి చీలిపోవటానికి ముందు కూడా పార్టీలోపల వేరే పార్టీగా ఏర్పడి పని చేయనారంభించారు. ఆ రోజులలోనే సుందరయ్య, బసవపున్నయ్య వక్తలుగా విజయవాడలో ఒక సమావేశం ఏర్పాటు చేయగా చాలా మంది హాజరవకుండా చేశారు.


ఆ దశలో మిగిలి వున్న కామ్రేడ్స్‌ను చైతన్యపరచి నిలబెట్టడం కోసం సుందరయ్యగారు కృషి చేశారు. రాజకీయ పాఠశాలలు నిర్వహించారు. స్వయంగా ఆయనే ప్రిన్సిపాల్‌గా వుండి పాఠశాలను నడిపారు. 1968లో విజయవాడ సమీపంలో నున్న గ్రామంలో నిర్వహించిన రాజకీయ పాఠశాల ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.



రష్యాలోని క్రెమ్లిన్‌భవన్ ప్రక్కన ఎల్.ఓ.జి. దంపతులు
గైడ్ టాన్యా



సోదరీమణులు జగదాంబ. సక్కుగార్లతో ఎల్.ఓ.జి.



కొడుకు, కోడలు ప్రేమసాగర్, శోభలతో ఎల్.బి.జి., సరోజిని



ఎల్.బి.జి.ని పరామర్శిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యులు
సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు



మొదటిసారి చైనా వెళ్ళినపుడు చైనా ప్రతినిధులతో ఎల్.బి.జి.
డాక్టర్ మాకినేని జస్వంత్‌మోహన్, డా.త్రిపుర సుందరి




బృందాకరత్, కొరటాల, గడ్డిపాటి కోటేశ్వరరావు, పోపూరి రామారావు ప్రభృతులతో..




విజయవాడలో మార్క్స్, ఎంగెల్స్ విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రసంగిస్తున్న ఎల్.బి.జి. వేదికపై అప్పటి తూర్పు జర్మనీ రాయబారి, విగ్రహావిష్కరణ కమిటీ కన్వీనర్ చుక్కపల్లి పిచ్చయ్య తదితరులు



సుందరయ్య కళానిలయం ప్రారంభోత్సవంలో ఎల్.బి.జి., ఆరుద్ర, రామోజీరావు ప్రభృతులు



హైదరాబాద్‌లో సుందరయ్య విగ్రహావిష్కరణ సందర్భంగా బర్దన్, చంద్రబాబు నాయుడు ,
ఎల్.బి.జి., సూర్జిత్, విజయభాస్కరరెడ్డి, విగ్రహశిల్పి పట్నాయక్

వ్యవసాయ రంగంలో సంక్షోభానికిగల ప్రాధాన్యతను గూర్చి సుందరయ్యగారు ప్రత్యేకంగా పాఠాలు చెప్పారు. మూల సిద్ధాంతాలనుబోధించటంతో సరిపుచ్చుకోక వాటిని దేశ పరిస్థితులకు అన్వయించి చెప్పటం జరిగింది.

అతివాద విచ్ఛిన్నం వల్ల జరిగిన నష్టాన్ని గూర్చి చెప్పుకునేటప్పుడు, అందుకు కారణాలను గూర్చి కూడా పరిశీలించడం అవసరం. వాళ్లు తాము నమ్మిన ఆశయాల కోసం నిలబడుతూ ప్రాణాలను అర్పించుతున్నారు గదా అనే సానుభూతి వారిపట్ల ప్రజలలోనూ వుండేది. అనేక మంది యువ కార్యకర్తలు ఆ విధంగా నిలబడి బలైపోయిన మాట నిజం. అదే సందర్భంలో ఉగ్రవాద పోకడలతో వ్యవహరించుతున్న వారూ కొన్ని దారుణ చర్యలకు పాల్పడిన సందర్భాలు వున్నాయి.

అదే సమయంలో అతివాద విచ్ఛిన్న కార్యకలాపాలలో కొట్టుకుపోయిన వారున్నారు. ఉదాహరణకు తరిమెల నాగిరెడ్డి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రోజులలోనూ, ప్రభుత్వ దారుణ నిర్బంధకాండ సాగుతున్న సమయంలోనూ గట్టిగా నిలబడ్డారు. అజ్ఞాతవాసంలో వుండి పార్టీ కార్యకలాపాలలో పాల్గొన్నారు. నిరాడంబర జీవితం గడిపే వారు. రాజకీయ నిబద్ధతతో నడుచుకునే వారు. అయినా చైనా ప్రభావంవల్ల అటు వైపు మొగ్గారు. ఆ సమయంలో అటు వైపు కొట్టుకుపోయిన యువ కార్యకర్తలను వదలి రావటం ఎలా అనేది కూడా ఆయన పయనం అదే బాటలో సాగటానికి కారణమయింది. అలాంటి వారు చాలా మంది వున్నారు. తామునమ్మిన దానికే కట్టుబడి అంకితభావంతో కృషి చేస్తున్నందున వారిలో కొందరిని ప్రభుత్వం పట్టుకుని కాల్చి చంపింది. కొందరు నాయకులు, ఆ తర్వాత తమ పయనాన్ని సమీక్షించుకుని, పునరాలోచనతో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వైపుకు తిరిగి వచ్చి పని చేస్తున్నారు. ఇంకా కొద్ది మంది ఇప్పటికీ తాము చేపట్టిన పంథానే పట్టుకు వ్రేళ్లాడుతున్నారు.

పార్టీలో వుంటూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారయినా, తనతో విభేదించిన వారయినా అలాంటి వారికి సరయిన అవగాహన కలుగజేయటానికి, పార్టీలో నిలిపి వుంచటానికీ గంగాధరరావు కృషి చేస్తూ వచ్చారు. ఆయా పెడధోరణులకు వ్యతిరేకంగా తప్ప, వ్యక్తులకు వ్యతిరేకంగా వుండటం తప్పు అనేది ఆయన పద్ధతి. వ్యక్తులుగా సానుభూతి చూపుతూ వారిని సరిదిద్దటానికీ ఎల్లప్పుడూ ఆయన ప్రయత్నం. అయితే పార్టీ విధానాలను వ్యతిరేకించే వారిపట్ల మాత్రం ఉదారంగా వుండటం ఎన్నడూలేదు. కాని, అవగాహనలోపంతో వున్న

వారికి పరిజ్ఞానాన్ని పెంపొందించి, తగిన అవగాహన కల్పించటానికి కృషి చేస్తుంటారు.

కమ్యూనిస్టులు ఆశయాలు ఆదర్శాలతోపాటు ఆచరణలోనూ ఇతరులకు ఆదర్శంగా వుండాలి. చెప్పేదానికి చేసే దానికి మధ్య అంతరం లేకుండా చూచుకోవాలి. తద్వారానే ప్రజల ఆదరాభిమానాలను చూరగొనటం సాధ్యమవుతుంది.

కార్యకర్తలపట్ల శ్రద్ధ వహించటంలో గంగాధరరావుకు ప్రత్యేకత వుంది. మంచి కార్యకర్తలను తయారు చేయటం, వారి రాజకీయ స్థాయిని అభివృద్ధి పరచటం, వారు రంగంలో నిలిచి పని చేస్తుండేటట్లు చూడటంపట్ల జాగ్రత్త వహించడం ఆయన మొదటి నుంచీ చేస్తున్నదే. ఎవరయినా పొరపాటు చేస్తే సరిదిద్దటానికి ప్రయత్నం చేయటానికి ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రతి చిన్న తప్పుకూ దూరంగా తరిమివేయటం అనే దానికి ఆయన వ్యతిరేకం. పార్టీ నిర్మాణంలోక్రమశిక్షణ చర్యల ప్రధాన వుద్దేశం కార్యకర్తలను బాగు చేయటమే తప్ప బయటకు పోగొట్టడం కాదు. ఏ తప్పుకయినా ఒక వ్యక్తిని బలిపశువునుచేయటం తప్పు. పూర్వాపరాలను, మూలకారణ మగు పరిస్థితులను గూర్చి లోతుగా ఆలోచించాలి అనేది ఆయన నిశ్చితాభిప్రాయం.

## వ్యవసాయ కార్మిక రంగంపట్ల ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థి దశలో వుండగానే గంగాధరరావుకు వ్యవసాయ కార్మికులపట్ల ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది. అనంతరం కమ్యూనిస్టు పార్టీ హోల్‌టైమరుగా వచ్చేటప్పటికే పార్టీపై నిషేధం వచ్చింది. అంతకుముందు విద్యార్థి వుద్యమంలో పని చేసిన అనుభవం దృష్ట్యా విద్యార్థి వుద్యమానికి తోడ్పడుతూ, యువజనోద్యమ నిర్మాణానికి కృషి చేస్తూ పార్టీలో బాధ్యతలు నిర్వర్తించనారంభించారు. విద్యార్థి దశలో ఏర్పడిన సంబంధాలను ఆసరా చేసుకుని గ్రామాలలో పార్టీ నిర్మాణానికై కృషి సాగించుతూ వచ్చారు. ఆ దశలోనే గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలో వ్యవసాయ కార్మిక సంఘ నిర్మాణానికే ప్రాధాన్యత ఇచ్చారు. పండితారాధ్యుల మల్లికార్జున శర్మ ఆ రోజుల్లో వ్యవసాయ కార్మిక వుద్యమ నిర్మాణానికి అవిరళ కృషి గావించారు. తెనాలి తాలూకాలో పెద్ద గ్రామాలగు కొల్లిపర, ఇంటూరు, రావులూరు వంటి వాటిపై కేంద్రీకరించి పని చేశారు. మల్లికార్జున శర్మ కాంగ్రెస్ ప్రభుత్వం తొలి రోజులలో అమలు జరిపిన నిర్బంధకాండ కాలంలోనే పోలీసుల తూటాలకు ఆహుతయినారు.

మన దేశ జనాభాలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాలలోనే నివసించుతున్నారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా వుంది. గ్రామీణ పేదలలో అత్యధిక సంఖ్యాకులు వ్యవసాయ కార్మికులే. మన దేశంలో వారే ప్రధానమైన పునాది వర్గం. అలాంటి వారిని చైతన్యపరచటం సమీకరించటం, సంఘటిత పరచటానికి గల ప్రాధాన్యతను గంగాధరరావు తొలి రోజుల నుంచీ గుర్తించారు. వారికి క్లాసులు నిర్వహించటానికి కార్యకర్తలకు శిక్షణ ఇవ్వటానికి కృషి చేశారు. వ్యవసాయ రంగంలో పని చేసే బాధ్యతను పార్టీ ఆయనకు ఇచ్చింది. అందులో వ్యవసాయ కార్మికుల విషయంలో ఆయన ఎక్కువ శ్రద్ధ వహించారు.

వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, ఈ రెండు రంగాల మీద సుందరయ్యగారు కేంద్రీకరించి పని చేస్తుండేవారు. ఆయన బాటలోనే ఆవే రంగాలలో కృషి చేయాలన్న సంకల్పం గంగాధరరావులో బలపడింది. తదనుగుణంగానే వ్యవసాయ కార్మికోద్యమ నిర్మాణం ప్రధానంగా భావించారు. రాష్ట్ర స్థాయిలోను, అఖిలభారత స్థాయిలోనూ బాధ్యతలు నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్‌లో 70 శాతానికి పైగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. భూమిలేని పేదలు వ్యవసాయ పనులతోనే జీవనయాత్ర సాగించుతుంటే అలాంటి వారే వ్యవసాయ కార్మికులు అవుతారు. అలాంటి వ్యవసాయ కార్మికుల [illegible] ప్రాధాన్యత [illegible].

[illegible]

ఎన్నికల ఫలితాలలోనూ దాని ప్రభావం కనబడుతుంది.

వ్యవసాయ కార్మికుల సమస్యలు తీసుకుని పని చేయటంలో వుద్యమాన్ని నిర్మించటంలో దేశం మొత్తం మీద ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలు ముందున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మిక వుద్యమ అనుభవాలు ఇతర రాష్ట్రాలవారిని ఉత్సాహపరిచాయి. దేశంలో అన్ని రాష్ట్రాలలోనూ ప్రత్యేకంగా వ్యవసాయ కార్మిక సంఘాలు లేవు. కొన్ని రాష్ట్రాలలో కిసాన్ సభలో భాగంగానే వ్యవసాయ కార్మిక రంగాన్ని పరిగణించటం జరుగుతూ వచ్చింది.

1981 అక్టోబరు 12, 13 తేదీలలో ఒక సమావేశంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘస్థాపన జరిగింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పంజాబ్, త్రిపుర, రాష్ట్రాల వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. టి.వి.ఆర్. చంద్రం (ఆంధ్రప్రదేశ్) అధ్యక్షులుగా పి.కె. కుంజచన్ (కేరళ) కార్యదర్శిగా ఎన్నుకోబడినారు.

ఆ తర్వాత 1982 నవంబరు 8 నుంచి 11 వరకు పశ్చిమబెంగాల్‌లోని మిద్నపూర్ వద్ద జరిగిన అఖిలభారత కిసాన్‌సభ 24వ మహాసభలో, ప్రత్యేకంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నివేదికనూ సమర్పించటం జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలో వ్యవసాయ కార్మికరంగంలో పని చేస్తూ ముఖ్యబాధ్యతలు నిర్వర్తించుతున్న కార్యకర్తల కోసం 1984 గుంటూరు జిల్లా కొల్లిపరలో నిర్వహించబడిన రాజకీయ తరగతులు రాష్ట్రంలో వ్యవసాయ కార్మికోద్యమానికి దిశానిర్దేశం చేయటంలో, కార్యకర్తల అవగాహనను, స్థాయిని పెంపొందించటంలో కీలక ప్రాధాన్యత వహించాయి. సుందరయ్యగారు వారం రోజులపాటు అక్కడే వుండి స్వయంగా ఆ పాఠశాలను నిర్వహించారు. వ్యవసాయ సమస్యలపై అవగాహన పెంచటానికి కృషి చేశారు. ఆ సందర్భంలోనే ఆ పరిసరాలలోనే గల రెండుగ్రామాలలో సర్వే జరిపించి, సేకరించిన వివరాలను ఆయనే విశ్లేషణ చేశారు. ఆనాటి ఆ రాజకీయ తరగతులలో సుందరయ్యగారు వ్యవసాయ సమస్యపై బోధించిన పాఠంగ్రంథరూపంలో వెలువరించబడింది కూడా. ఆ తర్వాత జరిగిన రాజకీయ తరగతులలో వ్యవసాయ సమస్యలపై బోధించే కామ్రేడ్స్‌కు అది సిలబస్‌గా వుపకరించుతోంది.

వ్యవసాయ కార్మికోద్యమాన్ని మరింత బలీయమైన సంఘంగా పెంపొందించటానికి, బలమైన వుద్యమ నిర్మాణానికి గల ప్రాధాన్యత ఇప్పటికీ అలానే కొనసాగుతోంది. సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాన్ని విస్మరించటానికి

వీలులేదు. సామ్రాజ్యవాదం రూపం మారి, నయా వలస వాద రూపం దాల్చింది. దానికి తగినట్లుగా పోరాట రూపాలను చేపట్టాలి. ఈ సందర్భంలో వ్యవసాయక వుద్యమం, భూసమస్య మరింత ప్రాధాన్యత వహించుతాయి.

వ్యవసాయ సంక్షోభం తీవ్రతరం అవుతోంది. భూ సంస్కరణల అమలు, దున్నే వానికి భూమి కల్పించటం జరగనేలేదు. రైతాంగానికి గతంలో చేయబడిన వాగ్దానాలేవీ నెరవేర్చబడలేదు.

తెలంగాణా పోరాటం సాగేటప్పుడు దానికి మద్దతుగా ఇతర ప్రాంతాలలోనూ కృషి సాగింది. దాన్ని కొనసాగించి వుంటే వుద్యమం బాగా బలపడి వుండేది. కిసాన్‌సభ సభ్యత్వం ఒక కోటికి పైగా వుంది. వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వం నిజానికి కిసాన్ సభ సభ్యత్వం కంటె అధికంగా వుండవలసింది. కాని లేదు.

1982-83లో వ్యవసాయ కార్మిక వుద్యమం వుధృతంగా సాగింది. వ్యవసాయ కార్మిక సంఘం కృషివల్ల 1982లో రాష్ట్రంలో 635గ్రామాలలో కూలిరేట్లు పెరిగాయి. అయితే ఆ తర్వాత అదే స్థాయిలో వుద్యమాన్ని కొనసాగించకపోవటంవల్ల వుద్యమంలో స్తబ్దత ఏర్పడింది. మధ్యతరగతిని, వున్నత తరగతిని ఆకర్షించి ఆకట్టుకునే కార్యక్రమాలదే పై చేయి అవటం నష్టదాయకం. ఎక్కడయితే భూసమస్యను, వ్యవసాయ కార్మికుల సమస్యలను తీసుకుని పని చేయటం జరిగిందో అలాంటి చోట్ల కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పునాది గట్టిగా వుంది.

## పెడధోరణులకు వ్యతిరేకంగా

రివిజనిజం-అతివాదం ఒకేనాణేనికి రెండు ముఖాలు. బొమ్మ బొరుసులాంటివి. 1948లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ కాంగ్రెస్ (అఖిలభారత మహాసభ) లోనే రివిజనిజానికి పునాదులు పడ్డాయి. నిజానికి ఒక తప్పును మరో తప్పుతో సరి చేయడం సాధ్యంకాదు. రివిజనిస్టు ధోరణులు. సెక్టేరియన్ ధోరణులు - ఈ రెండింటిలో ఏది కనిపించినా ఆ ధోరణులకు వ్యతిరేకంగా పార్టీలోపల అంతర్గత పోరాటం ద్వారా పరిస్థితిని చక్కదిద్దుకోవలసి వుంటుంది. అయితే అందులో ఏదైనా ఒక పెడధోరణి వుధృతరూపం దాల్చినప్పుడు దానికి ప్రతిగా రెండవ పెడధోరణి బలపడటం, రెండింటివల్లనూ కమ్యూనిస్టు ఉద్యమానికి నష్టం వాటిల్లటం మనం చూశాం. ఈ రెండు పెడధోరణులకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలోనే గంగాధరరావుగారు నిలిచారు. రెండు పెడధోరణుల వల్ల పార్టీకి ఎదురయిన విచ్ఛిన్నాల సందర్భంలో. అయా

పెదధోరణులతో కోట్టుకు పోకుండా మిగిలి వున్న వారిని అందరినీ సమీకరించటంలో ఎటూ తేల్చుకోలేక వూగిసలాడుతున్న వారితో రాజకీయ చర్చలు జరిపి ఆలోచింపచేయటంలోనూ ప్రధానంగా గుంటూరు జిల్లాలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. మోటూరు హనుమంతరావుతో కలిసి కృషి చేశారు.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం 1955-56లో తీవ్రతరమయింది. పార్టీ కార్యక్రమం, ఎత్తుగడలూ, సవ్యంగా వుంటేనే కమ్యూనిస్టు వుద్యమం తన విప్లవ స్వభావానికి అనుగుణంగా ఏకోన్ముఖంగా నడుస్తుంది. అందుకుగాను పార్టీలో అంతర్గత చర్చ నిర్వహించాలని జాతీయ సమితి సభ్యులు కొందరు గట్టిగా కోరారు. అయితే ఆ విధంగా చర్చనిర్వహించటానికి పార్టీ నాయకత్వ స్థానంలో వున్న వారు నిరాకరించారు. అంతేగాక భారత-చైనా సరిహద్దు సంఘర్షణ సందర్భంలో ప్రభుత్వం ఎంపిక చేసిన కొందరు కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయటం ద్వారా ఆనాటి నాయకత్వం అనుసరించే విధానాలను వ్యతిరేకించే వారిపైన నిర్బంధాన్ని ప్రయోగించింది. అంతర్గత చర్చ నిర్వహించటాన్ని పార్టీ నాయకత్వ స్థానంలో వున్న వారు నిరాకరించటంతో జాతీయ సమితి సమావేశం నుంచి 32 మంది సభ్యులు వాకౌట్ చేశారు. అంతేకాదు విప్లవ పంథాలో పయనించటానికి అనువుగా పార్టీని పునర్నిర్మించుకోవాలనే లక్ష్యంతో 1964 జులైలో కన్వెన్షన్ నిర్వహించాలని నిర్ణయించారు. విజయవాడలో ఆ సమావేశం జరపతలపెట్టారు. అందుకు ప్రభుత్వం వైపు నుంచి అడ్డంకులు ఎదురయినాయి. ఆ సమయంలో విజయవాడ నగరంలో భారీ స్థాయిలో సాగిన గృహదహనాల కారణంగా ఏర్పడిన వుద్రిక్త పరిస్థితుల పేరుతో, ఆ సమావేశం విజయవాడలో నిర్వహించకుండా పోలీసు శాఖ ఉత్తర్వుల ద్వారా అడ్డుపడింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కమ్యూనిస్టు నాయకులు విజయవాడలో ఒక చోట కూర్చొని చర్చించటానికి అవకాశమివ్వకుండా అడ్డుపడ్డారు. దానితో సమావేశ స్థలాన్ని గుంటూరు జిల్లా తెనాలికి మార్చారు. సమావేశానికి ఏర్పాట్లు పూర్తయినాయి. సమావేశం జరిగే సమయానికి జగదాంబగారు తీవ్ర అస్వస్థతలో వున్నారు. తెనాలి సమావేశంలో బసవపున్నయ్య పాల్గొనటానికి వీలుగా, గంగాధరరావు ఆమె దగ్గర వుండి. ఆమె ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసి వచ్చింది. దానితో ఆయన సమావేశ సమయానికి అక్కడ వుండటానికి వీలు పడలేదు.

1964 జులైలో తెనాలి కన్వెన్షన్ ఆమోదించిన కార్యక్రమం ముసాయిదా ప్రాతిపదికగా పార్టీ ఏడవ మహాసభను కలకత్తాలో అదే సంవత్సరం నవంబరులో నిర్వహించి పార్టీ పునర్నిర్మాణం చేయటం జరిగింది. ఈ పునర్నిర్మాణం సందర్భంగా

ఉమ్మడి పార్టీలోని సమరశీల కార్యకర్తలు ప్రధానంగా కమ్యూనిస్టు (మార్క్సిస్టు) వైపునే వున్నారు. వ్యవసాయంతో గ్రామీణ పేదలను సమీకరించి సంఘటితపరచడం కోసం పని చేసే వారివల్ల వ్యతిరేకత భూస్వాములలో బలంగా వుంటూ వచ్చింది.

1967లో మరో విచ్ఛిన్నం ఏర్పడింది. ఇదొక అతివాద దుందుడుకువాద విచ్ఛిన్నం. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో అంతర్గతంగా రాజకీయ సైద్ధాంతిక పోరాటం సాగించటానికి వచ్చింది. రివిజనిస్టు విచ్ఛిన్నంవల్ల జరిగిన దానికంటే ఎక్కువ నష్టం అతివాద విచ్ఛిన్నంవల్ల జరిగింది. అంకితభావం కలిగిన నాయకులలో కొందరు పైగా కమ్యూనిస్టు పార్టీ అనాడు చేపట్టిన వాదనలవల్ల ప్రభావితులయ్యారు. అందులో గుంటూరు జిల్లాలో కొల్లా వెంకయ్య, మాదాల నారాయణ స్వామి వంటి వారున్నారు. ఉద్యమంలోకి కొత్తగా వచ్చిన యువకులు చాలా మంది ఈ పెనుపోకడలో కొట్టుకుపోయారు. డాక్టర్లు, ఇంజనీర్లు తదితర ఉన్నత విద్యావంతులైన యువతీయువకులు కొందరు ఈ ప్రవాహానికి లోనయ్యారు. అందులోనూ అంకితభావంతో గట్టిగా నిలిచిన వారు పోలీసులచే కాల్చి చంపబడ్డారు. మొత్తంమీద పోలీసులకు లొంగిపోయిన వారున్నారు. అతివాదం మంచి మనుషుల మితవాదం వైపునకు వెళ్ళి స్థిరపడ్డవారున్నారు. సెక్టేరియనిజం–రివిజనిజం బొమ్మా–బొరుసులనే విషయం మరో మారు రుజువు చేశారు. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి, ఆచరణ దిశలో సరియైన మార్గంలో నడవటానికి మాకుగా పట్టుదలలు పట్టించటమే అవసరంలో నాటి ధ్యేయం.

ఈ పరిణామాన్ని గురించి వివరించేందుకు జరిగిన సందర్భంలో గంగాధరరావు విద్యార్థి ఉద్యమంలో వున్నప్పుడే తనకు ఎదురయిన అనుభవాలను ప్రస్తావించారు. అప్పట్లోనూ కమ్యూనిస్టు పార్టీలో అంతర్గత పోరాట రూపంలో రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం సాగుతున్న సమస్య ప్రధానమా? పార్టీ ప్రమాణాలను పాటించటమా లేదా అనేదానికి ప్రాధాన్యత ఇవ్వాలా? అనే విషయంలో చర్చలు సాగేవి. సమస్య ప్రధానం కాదు పార్టీ సభ్యులు పార్టీ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించేట్లు చూడటం ప్రధానం అనే వారిలో ఆయనే ముందుండేవారు.

### తొలినాళ్ల యువకులతో సుందరయ్యగారి వైద్యచికిత్స

1966లో సుందరయ్య జైలులో వుండగా రక్తం వాంతి చేసుకున్నారు. ఆ

పరిస్థితులలో జైలులో వుండగా ఆయన మరణించితే తన ప్రాణం మీదికి వస్తుందని భయపడి అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఆయనను విడుదల చేయటానికి నిర్ణయించారు. విషమ స్థితిలో వున్న ఆరోగ్యాన్ని కుదుటపడేట్లుగా వైద్యం చేయించుకునే నిమిత్తం సుందరయ్య సోవియట్ యూనియన్ వెళ్ళిరావటం మంచిదని పలువురు కామ్రేడ్స్ అభిప్రాయపడ్డారు. ఆయనతో పాటు జైలులో వున్న వారు ఆయనను ఏలాగయినా ఒప్పించాలని గట్టిగా ప్రయత్నించారు. అయినా తన వైద్యం కోసం ఆనాటి పరిస్థితులలో సోవియట్ యూనియన్‌కు వెళ్ళటానికి ఆయన సుముఖంగా లేరు. సుందరయ్య సోవియట్ యూనియన్ వెళ్ళి వైద్యం చేయించుకోవలసిందేనని జైలులోని కామ్రేడ్స్ పట్టుబట్టారు. ఆయన అందుకు అంగీకరించకపోతే తామంతా నిరాహార దీక్షకు పూనుకుంటామన్నారు. ఎట్టకేలకు ఆయన అంగీకరించేట్లు చేశారు. ఈ విధంగా చేయటానికి సంబంధించి జైలులోపల ఆనాడు సాగించిన కార్యక్రమంలో గంగాధరరావు చురుకయిన పాత్ర వహించారు. భూపేష్ గుప్తా చొరవ తీసుకుని సుందరయ్యకు సోవియట్ యూనియన్‌లో వైద్యానికి ఏర్పాటు చేశారు. అంతట ఆయన సోవియట్ యూనియన్ వెళ్లారు. వైద్యం చేయించుకుని కోలుకుని తిరిగి వచ్చారు. ఆ తర్వాత ఆయన వ్యాసాలలో సోవియట్ సోషలిస్టువ్యవస్థను బలపరుస్తూ రాయటాన్ని చూపి ఆయన పై తప్పుడు ప్రచారం చేసిన వారున్నారు. సోవియట్ వ్యవస్థను బలపరచటానికీ సిద్ధాంత చర్చలో ఆనాటి సోవియట్ నాయకత్వం యొక్క వైఖరిని బలపరచటానికీ తేడా చూడకుండా దుష్ప్రచారం చేశారు.

## రెండు పర్యాయాలు చైనా సందర్శన

గంగాధరరావు చైనా దేశ సందర్శన మొట్టమొదటగా 1982లో జరిగింది. ఆయన అక్కడకు వెళ్ళింది వైద్యం కోసం. 1982 జులై, ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో ఆయన చైనాలో వున్నారు. ఆయన వెళ్లింది వైద్యం కోసమే అయినా, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)చే పంపబడినందువలన చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకులు సహజంగానే ఆయనతో రాజకీయాలను గురించి మాట్లాడటమూ జరిగింది. ఆయన అక్కడ వున్న మూడు మాసాల కాలంలో అప్పటి రాజకీయ సరళిని అకళింపు చేసుకునే అవకాశం కలిగింది. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకులలో ముఖ్యులలో ఒకరైన కామ్రేడ్ సౌషితో సంభాషించడం జరిగింది. అప్పుడు చైనా నాయకుడు సౌషి గంగాధరరావుతో మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ను గూర్చి ఎంతో ఆసక్తితో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా చైనా

కమ్యూనిస్టు పార్టీ చైనాలోని గ్రూపు విమర్శించడమూ జరిగింది. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విభజనలో ఆ చైనా వారి గ్రూపులో కొన్ని పొరపాట్లు జరిగాయని, తమ నాయకుల గ్రూపులో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పట్ల కొంత తప్పుగా వ్యవహరించడం కూడా జరిగింది. ఏమైనా గతాన్ని పక్కనపెట్టి పరస్పర అభిప్రాయ భేదాలు పరిష్కరించుకోవాలన్న ఆసక్తి వ్యక్తంచేసిన ఆయన పేర్కొన్నారు.

1966 నుంచి 1982 వరకు రెండు పార్టీల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. 1982లో జరిగిన చైనా పార్టీ [illegible] చైనా నాయకుడు [illegible] కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)తో సంబంధాలు పునరుద్ధరించుకోవాలని తమకు ప్రగాఢ ఆసక్తి ఉన్నట్లు చైనా కమ్యూనిస్టు పార్టీకి రాసిన లేఖలో [illegible]

అంతకు ముందు చైనా కమ్యూనిస్టు పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకుల పట్ల అభిప్రాయాలను మార్చుకోవడం కూడా జరిగింది. చైనా పార్టీకి సంబంధాలు అంతగా [illegible] లేవు. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకులలో ఒకరు ఈ విషయంగా వ్యక్తం చేయడం [illegible] అదే మొదలు [illegible] భారత దేశానికి [illegible] భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) [illegible] రెండింటికీ [illegible]. తర్వాత కాలంలో రెండు పార్టీల మధ్య సంబంధాలు తిరిగి నెలకొన్న సంగతి తెలిసిందే.

చైనాలో పర్యటన సందర్భంగా చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ విభాగం బాధ్యులు [illegible] సందర్భంలో [illegible] పట్ల చైనా పార్టీ అభిప్రాయాలను గురించి తెలుసుకునే అవకాశం కూడా కలిగింది. కొన్ని అంశాలపై వారికి [illegible] చైనాలో అభిప్రాయాలను గురించి వివరించడం కూడా జరిగింది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత విభేదాలతో సిద్ధాంత చర్చలు తారాస్థాయిలో [illegible] సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, చైనా కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంత సమస్యలపై [illegible] చేస్తూ వచ్చాయి. పరస్పరం శత్రుత్వంతో వ్యవహరించే పరిస్థితులు [illegible] అలాంటి పరిస్థితుల్లో సోవియట్ మార్గమో చైనా కమ్యూనిస్టు పార్టీనో ఒక దానిని అనుసరించడం కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్వతంత్రంగా వ్యవహరించింది. రెండు దేశాలతో

సోషలిస్టు వ్యవస్థను సమర్థించుతూనే రెండు దేశాల వైపు నుంచి జరిగిన తప్పులనూ, పొరపాట్లనూ గుర్తించుతూ, వారి అనుభవాల నుంచి నేర్చుకోవటానికి ప్రయత్నించింది. మార్క్సిజం, లెనినిజం వెలుగులో భారతదేశ పరిస్థితులను విశ్లేషించటంలో, కార్యాచరణ పంథాను రూపొందించుకోవటంలో స్వతంత్రంగా వ్యవహరించింది. ఈ విషయాన్ని ప్రపంచమంతటాగల వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలు గుర్తించాయి.

ప్రపంచంలో అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీలు పేరు మార్చుకొని, తమ పేరులో కమ్యూనిస్టు అనే పదం లేకుండా చేసుకోవడం, కార్మికవర్గ నియంతృత్వాన్ని, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని వదులుకోవడం జరిగినప్పుడు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అలాంటి పనేదీ చేయలేదు. అలాంటి సమయంలోనే గట్టిగా నిలబడిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మరింత బలపడింది. పార్టీ సభ్యత్వం పెరిగింది కూడా.

ఈ పరిణామాల అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 1993లో కలకత్తాలో కమ్యూనిస్టు పార్టీల అంతర్జాతీయ సెమినార్ నిర్వహించింది. దానితో పార్టీ ప్రతిష్ట ఇనుమడించింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు మహాసభగా పరిగణించదగిన ఈ సెమినార్‌లో ప్రపంచ దేశాలలో గల కమ్యూనిస్టు పార్టీలు కొన్ని పాల్గొన్నాయి. అంతర్జాతీయంగాను, జాతీయంగానూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అనుసరించిన పంథా సరైనదనే విషయం ఈ సెమినార్ విజయవంతమవటంవల్ల ధృవపడింది. పార్టీపట్ల దేశంలో ప్రజల ఆదరణ పెరిగింది. ప్రతిష్ట పెరిగింది. దానికి తగినట్లుగా కృషి చేసి మరింత పురోగమించవలసి ఉంది.

మొదటి దఫా చైనా వెళ్ళినప్పుడు మూడు మాసాలపాటు అక్కడ వున్నందువల్ల చైనా ప్రజల మనోభావాలను అవగాహన చేసుకునే అవకాశం కలిగింది. సామాన్యులతో మాట్లాడటానికి వీలుపడింది. ఆ సందర్భంలోనే ఒక వృద్ధ మహిళతోఆయన మాట్లాడారు. మావో కృషి ఫలితంగానే తమ దేశంలో సోషలిజం బ్రతికి వున్నదని ఆమె చెప్పారు. అచ్చటి సామాన్య ప్రజలలో మావో పట్ల ఎంతటి ఆరాధనాభావం వున్నదీ దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. మావో మరణానంతరం కూడా రెండు సంవత్సరాలపాటు సాంస్కృతిక విప్లవం సాగింది. ఆ తర్వాతనే చైనా కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక విప్లవకాలపు పెడపోకడలను ఖండించింది. డెంగ్ నాయకత్వాన చైనా పార్టీ ఆచి తూచి అడుగేయనారంభించింది.

మావో తమ పార్టీకి యావజ్జీవ అధ్యక్షుడుగా వుంటాడని చైనా కమ్యూనిస్టు

పార్టీ ప్రకటించటంపట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అభ్యంతరం వ్యక్తం చేసింది. గతంలో తమ పార్టీ కూడా తప్పులు చేసిన మాట నిజమేనని, అయితే గతాన్ని అలా వదిలేసి, ప్రస్తుత వైఖరి ప్రాతిపదికపై పరస్పర సంబంధాలను పెంపొందించుకొందామని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకులతో సంభాషణల సందర్భంగా డెంగ్ పేర్కొన్నారు.

## రెండవ దఫా చైనా సందర్శన

1984 సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 5 వరకు గంగాధరరావు రెండవ దఫా చైనా సందర్శించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానంపై చైనా సందర్శించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర స్థాయి నాయకులతో గూడిన ప్రతినిధి వర్గంలో సభ్యులుగా ఆయన కూడా వెళ్లారు. మోటూరు హనుమంతరావు నాయకత్వాన అచ్యుతానందన్, పి.కె. రంగ్నేకర్, రాజేందర్‌సింగ్, అజయ్‌రాయ్‌లతో కూడిన ప్రతినిధి వర్గాన్ని పంపించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. అందులో అచ్యుతానందన్ రాలేకపోయినందున, ఆయన స్థానంలో గంగాధరరావును పంపించారు. ప్రధానంగా వైద్యం నిమిత్తమే ఆయనను ప్రతినిధి వర్గంలో చేర్చడం జరిగింది. 1984 సెప్టెంబరు 8న విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లారు. 14వ తేదీ వరకు ఢిల్లీలోనే వున్నారు. ప్రతినిధి బృందంలో ఒకరికి పాస్‌పోర్టు రావటంలో జరిగిన ఆలస్యం కారణంగా అలా వేచి వుండవలసి వచ్చింది. అప్పుడే, ఎన్.టి. రామారావు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి అప్పటి గవర్నర్ రామ్‌లాల్ నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా కొత్త మంత్రి వర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్రంలో ప్రజల నిరసన వెల్లువెత్తింది. బలనిరూపణ కోసం రాష్ట్ర శాసనసభ సమావేశం గందరగోళంతో ముగిసింది. ప్రొటెమ్ స్పీకర్ నాగారెడ్డి రాజీనామా చేయగా ఒవైసీని ప్రొటెమ్ స్పీకర్‌గా నియమించటం జరిగింది. గవర్నరు అప్రజాస్వామిక చర్యకు నిరసనగా సెప్టెంబరు 15న ఆంధ్రప్రదేశ్ బంద్‌కు, 17వ తేదీన రోడ్‌రోకో, రైల్ రోకోకు అఖిలపక్ష కమిటీ పిలుపు నిచ్చింది. అఖిలభారత స్థాయిలోనూ అఖిలపక్ష కమిటీ ఆంధ్రప్రదేశ్ ఆందోళనకు మద్దతు ప్రకటించింది. 18వ తేదీన అన్ని పార్టీలు కలిసి పార్లమెంటుకు యాత్ర, 19న ఢిల్లీలో బహిరంగ సభ, 20వ తేదీన భారత బంద్‌కు అన్ని పార్టీలూ కలిసి పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో రాజకీయంగా ఇంత సంచలనం జరుగుతుండగా ఈ ప్రతినిధి వర్గం 15వ తేదీన బీజింగ్ చేరుకుని ఆ రాత్రికి గెస్ట్‌హౌస్‌లో విశ్రమించి మరునాటి నుంచి ఈ ప్రతినిధి బృందం వివిధ ప్రదేశాలను సందర్శించడం, వివిధ

కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. మరునాటి మధ్యాహ్నమే వారు హిస్టరీ మ్యూజియం సందర్శించారు. చైనా విమోచన వరకూ చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, అందులో భాగంగా లాంగ్ మార్చ్‌ని, ప్రజల త్యాగాలను గుర్తు చేసే ఆ మ్యూజియం సందర్శకులకు వుత్తేజాన్ని, ప్రేరణను కలుగజేస్తుంది.

సెప్టెంబర్ 17న చైనా పార్టీ అంతర్జాతీయ సంబంధాల విభాగం డిప్యూటీ లీడర్ ఝూలియాంగ్ భారత ప్రతినిధి వర్గానికి తమ దేశ అంతర్గత పరిణామాలను వివరించారు. ప్రజాందోళనకు తలొగ్గి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్.టి. రామారావునే తిరిగి ప్రతిష్టించారన్న వార్తను అదే రోజున చైనా డైలీ ప్రచురించింది. ఎన్.టి.ఆర్. ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని ఆ మరునాడు చైనా టి.వి.లో ప్రసారం చేశారు కూడా గంగాధరరావు ఆరోగ్యం బాగా లేనందువల్ల మిగతా సభ్యులతోపాటు కొన్ని కార్యక్రమాలలో మాత్రమే పాల్గొనగలిగారు. ఆయనతోపాటు మరో కామ్రేడ్ జోగిందర్ సింగ్ కూడా చైనా దేశపు సాంప్రదాయవైద్యం కొరకు డా॥సూంగ్‌ను సంప్రదించారు. గంగాధరరావు 82లో చైనా వెళ్లినప్పటి పరిచితుడు కామ్రేడ్ హూ గెస్ట్‌హౌస్‌కు వచ్చి కలుసుకుని ఒక గంటసేపు మాట్లాడి వెళ్లారు.

## మరికొన్ని దేశాల సందర్శన

చైనా సందర్శించటాని కంటే ముందుగా 1977లోనే గంగాధరరావుగారు ఆక్యుపంక్చర్ వైద్యం కొరకు అల్జీరియా దేశానికి వెళ్లి 24 రోజులుండి వచ్చారు. అల్జీరియా వెనుకబడిన దేశం. అవస్థలలో వుండి ఇతర దేశాల సహాయం పొందుతుండేది. అలా అక్కడ వున్న చైనా డాక్టర్ నుంచి ఆక్యుపంక్చర్ వైద్యం నిమిత్తం ఆయన ఆదేశాన్ని సందర్శించారు.

1987లో సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 17 వరకు చెకోస్లోవేకియాలో వుండి వైద్య సహాయం పొందారు.

అనంతరం 1990 జూన్ 11 నుంచి ఆగస్టు వరకు సోవియట్ యూనియన్‌లో వుండి వైద్యం చేయించుకున్నారు. అక్కడ ప్రకృతివైద్యం (నేచురో థెరపి) మేగ్నటిక్ థెరపీ ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచే ప్రయత్నం జరిగింది. ఆ తర్వాత పార్కిన్సన్ వ్యాధితో పోరాడుతూ చికిత్స నిమిత్తం రెండు దఫాలు క్యూబా సందర్శించారు. మొదటి దఫా 1993 నవంబరులో వెళ్లి 94 జనవరి 19 వరకు, రెండవ దఫా 1995 ఆగస్టులో వెళ్లి అక్టోబరు 9 వరకూ క్యూబాలో వుండి వచ్చారు. పార్కిన్సన్ వ్యాధికి చికిత్స చేసే విషయంలో ప్రపంచం మొత్తం మీద క్యూబాదే పై చేయిగా వుంది. మెదడులోని కొన్నికణాలు పని చేయకపోవడంవల్ల ఎదురయ్యే ఈ

వ్యాధికి టోపియం అనే శస్త్రచికిత్స చేయడంలో క్యూబా డాక్టర్లు ఎంతో ముందంజలో వున్నారు. గర్భిణీ స్త్రీకి అబార్షన్ జరిగినప్పుడు అలాంటి పిండం నుంచి కణాలను తీసుకొని పార్కిన్సన్ వ్యాధికి చికిత్స చేయడం జరుగుతుంది. ప్రపంచం మొత్తం మీద ఈ తరహా శస్త్రచికిత్సలు క్యూబాలోనే ఎక్కువగా జరిగాయి. మెదడుకు శస్త్రచికిత్స చేయించుకోవడానికి గంగాధరరావు మానసికంగా సన్నద్ధమయ్యే వెళ్లారు. కాని క్యూబాలో ఆయనను పరీక్షించిన తర్వాత అచ్చటి డాక్టర్లు శస్త్ర చికిత్స అవసరంలేదని, మందులతోనే ఆయన ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచవచ్చునని భావించారు. తమ ప్రత్యక్ష పర్యవేక్షణలోనే కొంత కాలంపాటు అక్కడనే వైద్యం చేసి పంపించారు. మొదటి దఫా వెళ్ళి వచ్చిన తర్వాత 18 మాసాలకు రెండవ దఫా క్యూబా వెళ్లి మరల అచ్చటి డాక్టర్లచే పరీక్ష చేయించుకుని కొన్ని వారాలపాటు వారి పర్యవేక్షణలో మందులు వాడుతూ వుండి వచ్చారు.

అమెరికాకు 150 మైళ్ల దూరంలో వుండీ, చిన్న దేశమైన క్యూబా సోషలిస్టు పంథాను ఎంచుకుని, సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు, దిగ్బంధనానికి లోనవుతూ కూడా వివిధ రంగాలలో సాధించుతున్న పురోగతి యావత్తు ప్రపంచంలోగల ప్రగతిశీల శక్తులన్నింటికీ స్ఫూర్తి దాయకం. సోషలిస్టు పంథాకే కట్టుబడి పురోగమించుతూ, ఎన్ని కష్టాలనుభవించటానికయినా సిద్ధమేగాని, అమెరికా సామ్రాజ్యవాదుల ఒత్తిడికి తలొగ్గటంగాని, సోషలిస్టు పంథాను విడనాడటంగాని చేసే ప్రశ్నేలేదని, అచ్చటి ప్రజలు చైతన్యంతో కష్టాలను పంచుకోవటానికి సంతోషంగా అంగీకరించారన్న పరిస్థితిని గంగాధరరావు పై రెండు సందర్భాలలోనూ స్వయంగా చూచివచ్చారు. అంతటి కష్టాలలో వుండి కూడా వైద్యరంగంలో వారు సాధించిన పురోగతి ఆశ్చర్యం కల్గించటమే కాదు, ఆనందదాయకం కూడా అయింది.

పార్కిన్సన్ వ్యాధిబారిన పడిన తర్వాత పరిస్థితి మెరుగుపడే అవకాశం వుండదని,క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణింపచేయటమే ఆ వ్యాధి లక్షణమని, అయితే మరింత క్షీణించకుండా కాపాడటానికి మాత్రమే వైద్యం తోడ్పడగలదనీ క్యూబా డాక్టర్లూ చెప్పారు. అయితే విశ్రాంతి అవసరమనీ, ఆందోళనకులోనుకావలదనీ మాత్రం వారు సలహా చెప్పారు. శారీరకంగా శక్తి వున్న మేరకు పార్టీ కోసం వుద్యమం కోసం కృషి చేయటమే తప్ప ఏమీ చేయకుండా విశ్రాంతి తీసుకోవటం ఆయన తత్వానికే విరుద్ధం. ఇక ఆందోళనకు గురి కావద్దన్న సలహా విషయానికివస్తే, వ్యక్తిగతంగానూ, కుటుంబ సంబంధమైన సమస్యల విషయంలోనూ ఎలాంటి ఆందోళనా ఆయనకు లేదు. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలే తప్ప ఇతర ఆలోచనలకు తావేలేదు. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కి నష్టదాయకమైన పరిణామాలేవయినా జరిగినప్పుడు ఆందోళన చెందకుండా వుండటం తన వల్లకాదని మాత్రం ఆయన చెబుతుంటారు. విశ్రాంతి తీసుకోవలసిందిగా డాక్టర్లు యిస్తున్న సలహానూ ఆయన పాటించటంలేదు. ఇంత తీవ్రమయిన అనారోగ్యంతోనే ఆయన ఇటీవలి మాసాలలోనే హైదరాబాద్, చెన్నై తదితర చోట్ల పలువురిని కలుసుకుని సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి సంబంధించి అసంపూర్తిగా మిగిలి వున్న పనులు పూర్తి చేయటానికి అవసరమైన నిధుల సేకరణకై కృషి సల్పారు.

## పార్టీ నిధి సేకరణలో ప్రత్యేకత

గంగాధరరావుకు తొలి రోజుల నుంచి కూడా కమ్యూనిస్టు పార్టీ నిధుల సేకరణలో దిట్ట అనే పేరుంది. విద్యార్థి దశగడచి, పార్టీ నిర్మాణంలో తెనాలి తాలూకాలో పని చేసే రోజులలోనే ఆయన ప్రత్యేకతను తోటి కామ్రేడ్స్ గుర్తించారు. తండ్రి నుంచి తన వాటా పంచుకొని, దాన్నంతా అమ్మి పార్టీకి ఇచ్చిన నేపథ్యంలో ఆరోజుల్లో ఆ ప్రాంతంలో పార్టీ నిధికై విరాళాల సేకరణకు ఎవరి వద్దకు వెళ్లినా, మిగతా వారు వెళ్లిన దానికంటే మంచి స్పందన లభించేది. అలానే పార్టీ నాయకులు స్వయంగా చేసిన త్యాగాలను ప్రజలు గుర్తించి గౌరవించుతుండేవారు. పార్టీ నిధుల సేకరణ విషయంలో గంగాధరరావు ప్రయత్నానికి స్పందన అధికంగా రావటానికి ఆయన హెచ్చు మొత్తాలను సేకరించ గలగటానికి కారణం ఇంకొకటి వుంది. పార్టీని అభిమానించి, ఆర్థికంగా తోడ్పడాలనే దృష్టి వున్నప్పుడే విరాళం ఇవ్వటానికి ఉదారంగా ముందుకొస్తారు. పెద్దమొత్తాలను విరాళంగా అందించే స్థోమత ఆర్థికంగా వున్నా, ఇవ్వటానికి సంసిద్ధత వుండాలి. బూర్జువా పార్టీలకు విరాళాలిచ్చే వారు, ముఖ్యంగా అధికారంలో వున్న పార్టీకి ఇచ్చే వారు ప్రభుత్వం వైపు నుంచి తమకు కావలసిన పనులు చేయించుకోవచ్చునన్న దృష్టితోనే ఆ పని చేస్తారు. కమ్యూనిస్టు పార్టీకి విరాళం ఇవ్వటానికి ఉదారంగా పెద్ద మొత్తాలు అందించటానికి సిద్ధపడాలంటే రాజకీయంగా అందుకు సన్నద్ధత వుండాలి. కమ్యూనిస్టు పార్టీ పరంగా ఒక కార్యక్రమం తలపెట్టి ప్రత్యేకంగా అందుకోసం ఆర్థిక తోడ్పాటును కోరినప్పుడు, కమ్యూనిస్టుల చేతికిచ్చిన డబ్బు సద్వినియోగమవుతుందన్న విశ్వాసంతోనేయిస్తుంటారు. ఇటీవలి సంవత్సరాలలో మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలు కరువు బారిన పడినప్పుడు, అదే విధంగా ఇతర చోట్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయ కార్యక్రమాలు

తోడ్పాటు అందించదలచిన వారు, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చేతికి డబ్బు ఇస్తే పూర్తిగా సద్వినియోగం కాగలదన్న విశ్వాసంతో ఇవ్వటం జరిగింది. అందువల్ల అలాంటి వారి రాజకీయ అవగాహన, చైతన్యం పాత్ర అందులో వుంది. గంగాధరరావు అభిమానులను పెద్దలను కలుసుకోవటం పార్టీ నిధి సేకరించే సందర్భానికే పరిమితంకాదు. అలాంటి వారిని అప్పుడప్పుడూ కలుసుకొంటుంటారు. వారికి రాజకీయ పరిణామాలను వివరించుతుంటారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి సందేహాలు నివృత్తి చేస్తుంటారు. ఆ విధంగా వారి రాజకీయ అవగాహన పెంపొందించటానికి, ఆలోచనకు పదును పెట్టడానికి కృషి చేస్తుంటారు. ఆ పని చేయకపోతే కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కూడా అన్ని పార్టీలలో ఒకటి అనుకునే స్థితికి వారు వస్తారని. అందువల్ల రాజకీయాలు చెబుతుండటానికిగల ప్రాధాన్యత గుర్తించాలని ఆయన కోరుతుంటారు. ఈ విధమైన అవగాహనతో వ్యవహరించటంవల్లనే పార్టీ నిధిసేకరణ విషయంలో ఆయనకు ప్రత్యేకత ఏర్పడింది. పార్టీ ప్రతిష్ఠ పెరిగే కొద్దీ ప్రజల నుంచి తోడ్పాటు అధికమవుతుంది. అందువల్ల పార్టీ నిధుల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందన పార్టీ ప్రతిష్ఠపైనే ఆధారపడి వుంటుంది. అయినప్పటికీ విరాళాల కొరకు మనం ఎవరెవరిని కలుసుకుంటామో వారందరినీ, విరాళాల సేకరణకోసమే కాక, వారికి మన రాజకీయాలు చెప్పటానికి కూడా కలుస్తుండాలి. అప్పుడే మంచి స్పందన వస్తుందనేది ఆయన స్వానుభవంతో చెబుతుంటారు.

## పార్టీ నిర్మాణం

పార్టీ నిర్మాణం పట్ల ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తి ఆయన తొలి రోజుల నుంచీ ప్రదర్శించుతుండేవారు. విద్యార్థి దశలోనే, ఒక కమ్యూనిస్టుగా విద్యార్థి వుద్యమాన్ని నిర్మించే బాధ్యత నిర్వర్తించుతూ ఆ వుద్యమ కార్యకలాపాలలో చురుకుగా ముందుకొచ్చిన వారి రాజకీయచైతన్యం పెంచి పార్టీలోకి రాబట్టటానికి ప్రయత్నించుతూ వచ్చారు. విద్యార్థి దశ గడచిన తర్వాత, పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పని చేయటం మొదలయిన మీదట వ్యవసాయ కార్మికరంగంలో పని చేయటంతోపాటు పార్టీ నిర్మాణంపట్ల శ్రద్ధతో కృషి చేయటమూ మొదలుపెట్టారు. ప్రజాసంఘాల కార్యకలాపాలు, ప్రజావుద్యమాల సందర్భంగా సమరశీల స్వభావం కలిగిన వారిని చురుకయిన వారిని గుర్తించటం, అలాంటి వారి రాజకీయ అవగాహన పెంచటానికి కృషి చేయటం, అధ్యయనం ద్వారా వారు మరింత ఎదగటానికి ప్రోత్సహించటం, తద్వారా పార్టీకి అంకితభావం గల కార్యకర్తలను సమకూర్చటం – ఇది ఆయన అనుసరించుతూ వచ్చిన కార్యాచరణ విధానం.

భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలే తప్ప ఇతర ఆలోచనలకు తావేలేదు. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కి నష్టదాయకమైన పరిణామాలేవయినా జరిగినప్పుడు ఆందోళన చెందకుండా వుండటం తన వల్లకాదని మాత్రం ఆయన చెబుతుంటారు. విశ్రాంతి తీసుకోవలసిందిగా డాక్టర్లు యిస్తున్న సలహానూ ఆయన పాటించటంలేదు. ఇంత తీవ్రమయిన అనారోగ్యంతోనే ఆయన ఇటీవలి మాసాలలోనే హైదరాబాద్, చెన్నై తదితర చోట్ల పలువురిని కలుసుకుని సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి సంబంధించి అసంపూర్తిగా మిగిలి వున్న పనులు పూర్తి చేయటానికి అవసరమైన నిధుల సేకరణకై కృషి సల్పారు.

## పార్టీ నిధి సేకరణలో ప్రత్యేకత

గంగాధరరావుకు తొలి రోజుల నుంచి కూడా కమ్యూనిస్టు పార్టీ నిధుల సేకరణలో దిట్ట అనే పేరుంది. విద్యార్థి దశగడచి, పార్టీ నిర్మాణంలో తెనాలి తాలూకాలో పని చేసే రోజులలోనే ఆయన ప్రత్యేకతను తోటి కామ్రేడ్స్ గుర్తించారు. తండ్రి నుంచి తన వాటా పంచుకొని, దాన్నంతా అమ్మి పార్టీకి ఇచ్చిన నేపథ్యంలో ఆరోజుల్లో ఆ ప్రాంతంలో పార్టీ నిధికై విరాళాల సేకరణకు ఎవరి వద్దకు వెళ్లినా, మిగతా వారు వెళ్లిన దానికంటే మంచి స్పందన లభించేది. అలానే పార్టీ నాయకులు స్వయంగా చేసిన త్యాగాలను ప్రజలు గుర్తించి గౌరవించుతుండేవారు. పార్టీ నిధుల సేకరణ విషయంలో గంగాధరరావు ప్రయత్నానికి స్పందన అధికంగా రావటానికి ఆయన హెచ్చు మొత్తాలను సేకరించ గలగటానికి కారణం ఇంకొకటి వుంది. పార్టీని అభిమానించి, ఆర్థికంగా తోడ్పడాలనే దృష్టి వున్నప్పుడే విరాళం ఇవ్వటానికి ఉదారంగా ముందుకొస్తారు. పెద్దమొత్తాలను విరాళంగా అందించే స్థోమత ఆర్థికంగా వున్నా, ఇవ్వటానికి సంసిద్ధత వుండాలి. బూర్జువా పార్టీలకు విరాళాలిచ్చే వారు, ముఖ్యంగా అధికారంలో వున్న పార్టీకి ఇచ్చే వారు ప్రభుత్వం వైపు నుంచి తమకు కావలసిన పనులు చేయించుకోవచ్చునన్న దృష్టితోనే ఆ పని చేస్తారు. కమ్యూనిస్టు పార్టీకి విరాళం ఇవ్వటానికి ఉదారంగా పెద్ద మొత్తాలు అందించటానికి సిద్ధపడాలంటే రాజకీయంగా అందుకు సన్నద్ధత వుండాలి. కమ్యూనిస్టు పార్టీ పరంగా ఒక కార్యక్రమం తలపెట్టి ప్రత్యేకంగా అందుకోసం ఆర్థిక తోడ్పాటును కోరినప్పుడు, కమ్యూనిస్టుల చేతికిచ్చిన డబ్బు సద్వినియోగమవుతుందన్న విశ్వాసంతోనేయిస్తుంటారు. ఇటీవలి సంవత్సరాలలో మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలు కరువు బారిన పడినప్పుడు, అదే విధంగా ఇతర చోట్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సహాయ కార్యక్రమాల నిర్వహణకై మానవతాదృష్టితో ఆర్థిక

తోడ్పాటు అందించదలచిన వారు, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చేతికి డబ్బు ఇస్తే పూర్తిగా సద్వినియోగం కాగలదన్న విశ్వాసంతో ఇవ్వటం జరిగింది. అందువల్ల అలాంటి వారి రాజకీయ అవగాహన, చైతన్యం పాత్ర అందులో వుంది. గంగాధరరావు అభిమానులను పెద్దలను కలుసుకోవటం పార్టీ నిధి సేకరించే సందర్భానికే పరిమితంకాదు. అలాంటి వారిని అప్పుడప్పుడూ కలుసుకొంటుంటారు. వారికి రాజకీయ పరిణామాలను వివరించుతుంటారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి సందేహాలు నివృత్తి చేస్తుంటారు. ఆ విధంగా వారి రాజకీయ అవగాహన పెంపొందించటానికి, ఆలోచనకు పదును పెట్టడానికి కృషి చేస్తుంటారు. ఆ పని చేయకపోతే కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కూడా అన్ని పార్టీలలో ఒకటి అనుకునే స్థితికి వారు వస్తారని, అందువల్ల రాజకీయాలు చెబుతుండటానికిగల ప్రాధాన్యత గుర్తించాలని ఆయన కోరుతుంటారు. ఈ విధమైన అవగాహనతో వ్యవహరించటంవల్లనే పార్టీ నిధిసేకరణ విషయంలో ఆయనకు ప్రత్యేకత ఏర్పడింది. పార్టీ ప్రతిష్ట పెరిగే కొద్దీ ప్రజల నుంచి తోడ్పాటు అధికమవుతుంది. అందువల్ల పార్టీ నిధుల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందన పార్టీ ప్రతిష్టపైనే ఆధారపడి వుంటుంది. అయినప్పటికీ విరాళాల కొరకు మనం ఎవరెవరిని కలుసుకుంటామో వారందరినీ, విరాళాల సేకరణకోసమే కాక, వారికి మన రాజకీయాలు చెప్పటానికి కూడా కలుస్తుండాలి. అప్పుడే మంచి స్పందన వస్తుందనేది ఆయన స్వానుభవంతో చెబుతుంటారు.

## పార్టీ నిర్మాణం

పార్టీ నిర్మాణం పట్ల ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తి ఆయన తొలి రోజుల నుంచీ ప్రదర్శించుతుండేవారు. విద్యార్థి దశలోనే, ఒక కమ్యూనిస్టుగా విద్యార్థి వుద్యమాన్ని నిర్మించే బాధ్యత నిర్వర్తించుతూ ఆ వుద్యమ కార్యకలాపాలలో చురుకుగా ముందుకొచ్చిన వారి రాజకీయచైతన్యం పెంచి పార్టీలోకి రాబట్టటానికి ప్రయత్నించుతూ వచ్చారు. విద్యార్థి దశ గడచిన తర్వాత, పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పని చేయటం మొదలయిన మొదట వ్యవసాయ కార్మికరంగంలో పని చేయటంతోపాటు పార్టీ నిర్మాణంపట్ల శ్రద్ధతో కృషి చేయటమూ మొదలుపెట్టారు. ప్రజాసంఘాల కార్యకలాపాలు, ప్రజావుద్యమాల సందర్భంగా సమరశీల స్వభావం కలిగిన వారిని చురుకయిన వారిని గుర్తించటం, అలాంటి వారి రాజకీయ అవగాహన పెంచటానికి కృషి చేయటం, అధ్యయనం ద్వారా వారు మరింత ఎదగటానికి ప్రోత్సహించటం, తద్వారా పార్టీకి అంకితభావం గల కార్యకర్తలను సమకూర్చటం – ఇది ఆయన అనుసరించుతూ వచ్చిన కార్యాచరణ విధానం.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రోజులలో ఆయన గుంటూరు జిల్లాలో పార్టీ బాధ్యతలు నిర్వర్తించుతుండే వారు. పార్టీ విధానాల విషయంలో ఆయనతో విభేదించే వారుసయితం పార్టీ నిర్మాణం విషయంలో ఆయన నైపుణ్యాన్ని ప్రశంసించు తుండేవారు. కార్యకర్తల శక్తి సామర్ధ్యాలను గుర్తించి ప్రోత్సహించడం, వారికి తగిన పనిని, బాధ్యతలను ఒప్పగించడం, వాటి నిర్వహణలో తోడ్పడటం ద్వారా పార్టీ నిర్మాణాన్ని పటిష్టమొనరించటానికి ఆయన కృషి చేస్తూ వచ్చారు.

వ్యవసాయ కార్మిక రంగంలో పని చేయటం పట్ల ప్రత్యేక శ్రద్ధాసక్తులుగల గంగాధరరావు పార్టీ నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. పార్టీ నిర్మాణం పటిష్టంగా వుంటేనే, పార్టీ నాయకత్వాన పని చేసే ప్రజాసంఘాలు బలంగా వుంటాయి. ప్రజా వుద్యమాలు వూపందుకుంటాయి. రెండు విచ్ఛిన్నాల అనంతరం రాష్ట్రంలో పార్టీ పునర్నిర్మాణం సందర్భంలో పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వటం కోసం రాజకీయ తరగతులు నిర్వహించబడినాయి. పార్టీ నిర్మాణం గూర్చి స్వయంగా సుందరయ్య ఆ తరగతులలో బోధించారు. అన్ని క్లాసులలోనూ ఆయనే బోధించటం కష్టం కనుక గంగాధరరావును కూడా అందుకు సన్నద్ధం కమ్మన్నారు. సుందరయ్య బోధించే క్లాసులో కూర్చుని శ్రద్ధగా విని నోట్స్ రాసుకుని ఆయన సిద్ధమయ్యారు. సుందరయ్య కూడా క్లాసులో కూర్చుని పార్టీ నిర్మాణంపై గంగాధరరావు పాఠం చెబుతుండగా విన్నారు. సుందరయ్య ఎదురుగా కూర్చుని వుండగా పాఠంచెప్పటానికి గంగాధరరావు కొంత జంకుతూనే బోధించారు. అయితే ఆ పాఠం విన్న తర్వాత సుందరయ్య బాగా ఇంప్రెస్ అయ్యారు. నిర్మాణ అనుభవం వున్నందువలన ఆయన బాగా హత్తుకునేలా చెప్పగలిగారని అన్నారు. ఆ తర్వాత క్లాసులలో నిర్మాణంపై బోధించటానికి ప్రాతిపదికగా గంగాధరరావు బోధించిన పాఠం వుపయోగపడుతుందని ఆయన అన్నారు. దానినే పుస్తకంగా ప్రచురించారు. గంగాధరరావు వైద్యం నిమిత్తం చైనాలో వున్న సమయంలోనే ఆ పుస్తకాన్ని ఇక్కడ ముద్రించటం జరిగింది.

అక్టోబరు మొదటి తేదీన చైనా ప్రజా రిపబ్లిక్ వార్షికోత్సవ విన్యాసాలను సందర్శించటానికి రావలసిందిగా ఆహ్వానాన్ని అందుకుని చైనా వెళ్తూ సుందరయ్య ఆ పుస్తకం కాపీ ఒకటి తీసుకెళ్లారు. వైద్యం నిమిత్తం చైనాలోనే వున్న గంగాధరరావుకు దాన్ని అందజేశారు.

కమ్యూనిస్టు పార్టీలో రెండు చీలికల సందర్భంలోనూ చాలా మంది సభ్యులు పోయారు. మిగిలి వున్న వారిని కూడదీసి నిర్మాణాన్ని పెంపొందించుకోవలసిన తక్షణ అవసరం ఆనాడు ఏర్పడింది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పార్టీ సభ్యుల

ప్రమాణాలు సర్వత్రా ఒకే స్థాయిలో వుండేవి కాదు. కొన్ని చోట్ల ప్రజాసంఘాల సభ్యత్వానికి పార్టీ సభ్యత్వానికి మధ్య తేడా వుండేది కాదు. ఆయా యూనిట్లలో నాయకత్వ స్థానాల్లో వున్న వారిని బట్టి వేర్వేరు చోట్ల వేర్వేరు ప్రమాణాలుండేవి.

కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లోనూ పార్టీ సభ్యులందరూ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనటంలేదు. కార్యకలాపాల్లో పాల్గొనని సభ్యులుంటున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దవలసిన అవసరం వుంది. పార్టీ సభ్యులందరూ, పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే విధంగా పరిస్థితిని మెరుగుపరచాలి. అది ఎంత త్వరగా జరుగుతుందా అన్న తపన గంగాధరరావులో ఎప్పుడూ కనిపిస్తుంది.

పార్టీ కార్యకర్తలకు వ్యక్తిగతంగా సమస్యలు ఎదురయినప్పుడల్లా ఆయన వాటిని అధిగమించటానికి అవసరమైన సలహాలను అందించుతుంటారు. పార్టీ కార్యకర్తల ఆరోగ్యం విషయంలోనూ ఆయనకు శ్రద్ధ ఎక్కువ. ఎవరయినా ఒక కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతుంటే తగిన వైద్య సౌకర్యం లభించేట్లు చూడటంపట్ల శ్రద్ధ వహించటం ఆయన అలవాటు. అంతేకాకుండా కార్యకర్తల కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణ విషయంలోనూ ఆయన శ్రద్ధ తీసుకుంటుంటారు. ఆయనతో బాగా పరిచయం వున్న సాధారణ కార్యకర్త అయినా సరే ఏదయినా జబ్బు చేస్తే వైద్యం చేయించుకునే విషయంలో సలహా కోసం ఆయన దగ్గరకు వెళ్తుంటారు.

కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఉద్యమ అవసరాల రీత్యా తాము ఏ బాధ్యత నిర్వహించవలసి వస్తే దాన్ని చేపట్టటానికి సిద్ధంగా వుండాలి. అయితే సర్వత్రా అంతా అలాగే సవ్యంగా వుంటుందని చెప్పుకోజాలం. వ్యక్తులుగా తమ ప్రాధాన్యత గూర్చి ఆలోచిస్తూ స్వీయ మోహిత ధోరణితో వ్యవహరించుతున్న వారూ వుంటారు. అలాంటి వారితో సహితం కలిసి పని చేయగల ఓర్పు నేర్పు ఆయనలో వున్నాయనే విషయాన్ని ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం విదితం చేస్తోంది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులలో హోచిమిన్‌పట్ల ఆయనకు అపారమైన గౌరవ భావం వుంది. లెనిన్, స్టాలిన్, మావో సయితం విమర్శలకు గురయినారు, కాని హోచిమిన్‌ను విమర్శించిన వారెవరూలేరు. అలానే హోచిమిన్ కూడా చైనా, సోవియట్ యూనియన్ రెండింటి సహాయాన్ని అందుకోవటమే తప్ప ఎవరిపైనా విమర్శలకు పూనుకోలేదు. హోచిమిన్ విశిష్టతను అందరూ అవగాహన చేసుకోవాలన్న దృష్టితోనే గంగాధరరావు హోచిమిన్ జీవితంపై ఒక గ్రంథాన్ని రచించారు. ఆయన చేయి తిరిగిన రచయిత కాదు. అయినా వుద్యమ అవసరాల రీత్యా ప్రజలను చైతన్య పరచడం కోసం, అవగాహన పెంపొందించడం

కోసం, వర్తమాన సమస్యలపైనా, అదే విధంగా రాజకీయ పరిణామాల పైనా పత్రికలలో ప్రచురణ నిమిత్తం ఎప్పటికప్పుడు వ్యాసాలు రాస్తూనే వున్నారు. పత్రికా ప్రతినిధుల ఇంటర్వ్యూల రూపంలోనూ ఆయన స్పందించుతూనే వున్నారు. పార్టీ నిర్మాణం, నవచైనా పురోగమనం, పైనా ఆయన రచనలు ప్రచురితమయినాయి.

ఆయన శ్రోతలను వుర్రూతలూగించే వక్తకాదు. అయినా వుద్యమ అవసరాలను బట్టి తాను బాధ్యతలు నిర్వర్తించుతున్న పరిధిలో సభలలో పాల్గొని ప్రసంగించడం ఆయన రాజకీయ కార్యకలాపాలలో భాగంగా కొనసాగుతోంది. కార్యకర్తల పరిజ్ఞానాన్ని పెంపొందించటానికి వారిలో చైతన్యం పూరించటానికి అవసరమైన అంశాలను అందించటానికి ఆయన అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. ఏదయినా ఒక సభలో ప్రసంగించబోయే ముందు ఆయా సందర్భాలకు తగిన అంశాలను ప్రస్తావించేటప్పుడు ఖచ్చితమైన సమాచారాన్ని ఉదహరించటానికిగాను ముందుగా విషయ సేకరణ జరిపి మరీ బయలుదేరటంవల్ల, తాను తీసుకున్న సమయం అంతా అవశ్యక సమాచారాన్ని అందించటానికే వుపయోగపెట్టుకోగలుగుతుంటారు. కార్యకర్తలను సుశిక్షితులను చేయటానికే అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, తన రాజకీయ జీవితానుభవాల నుంచి ఉదాహరణలతో సహా చేసే ప్రసంగాలు, పార్టీ కార్యకర్తల శిక్షణ తరగతులలోనూ, వుద్యమాలకు సన్నద్ధమయ్యేందుకు నిర్వహించే జనరల్ బాడీ సమావేశాలలోనూ ప్రయోజనకరంగా వుంటాయి.

ఐక్య సంఘటన ఎత్తుగడలను అనుసరించే సందర్భంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి తగిన అవగాహన కల్పించటానికి ఆయన ఎప్పుడూ తన వంతు ప్రయత్నం చేస్తూనే వుంటారు. ఆయా దశలలో ప్రధాన శత్రువును ఎంచుకుని, ఆ శత్రువుకు వ్యతిరేకంగా కలసి వచ్చే వారందరినీ, తాత్కాలికంగా కలసి వచ్చే వారితో సహా కలుపుకుని పోరాటం సాగించాలనే సూత్రాన్ని నొక్కి చెప్పారు. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో స్టాలిన్ నాయకత్వాన సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో మావో నాయకత్వాన చైనా కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన ఐక్య సంఘటన ఎత్తుగడలు చూసి మనం నేర్చుకోవలసింది ఎంతో వుందని గుర్తు చేస్తుంటారు.

ఐక్య సంఘటన ఎత్తుగడలలో భాగంగా ఇతర పార్టీలతో కలసి వ్యవహరించే సందర్భంలోనూ కమ్యూనిస్టు పార్టీ తన స్వతంత్ర కార్యాచరణ ప్రాధాన్యతను విస్మరించటం తగదు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రతిష్ట పెరిగింది. జాతీయ రాజకీయాలలో పార్టీ పాత్రకు ప్రాధాన్యత పెరిగింది. దేశ రాజకీయరంగంలో

వామపక్ష పార్టీలలో ప్రధానమైనపార్టీగా ఎదిగింది. అంతర్జాతీయంగానూ కమ్యూనిస్టు శ్రేణులలో పార్టీ ప్రతిష్టపెరిగింది. సహజంగానే ఈ పరిస్థితిలో దేశంలో శత్రువర్గాలు పార్టీపై తమ దాడిని ఎక్కుబెట్టటమూ సహజం.

పార్టీ సభ్యత్వం పెరుగుతున్నది. పార్టీ 16వ మహాసభ నిర్మాణ నివేదికలో పేర్కొన్నట్లు సభ్యత్వం నాణ్యతపై తగినంత నొక్కి చెప్పటం మనం చేయలేకపోతున్నాం. గత కొన్ని సంవత్సరాల అనుభవాన్ని పరిశీలించితే సభ్యత్వ ప్రమాణాలు పలుచబడినట్లు విదితం అవుతాయి. పార్టీ ప్రజాబాహుళ్య స్వభావం విప్లవస్వభావం రెండింటినీ మనం సమానంగా నొక్కి చెప్పాలి. పార్టీ కార్యక్రమాలలోనూ, ప్రజా సంఘాలలోనూ పాల్గొనని సభ్యులను మనం అట్టిపెట్టుకోకూడదు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల పార్టీ సభ్యులలో అధిక భాగం కార్మికవర్గం నుంచి వ్యవసాయ కార్మికుల నుంచి, పేద రైతుల నుంచి వచ్చిన వారే. మొత్తం సభ్యత్వంలో 80 శాతానికి పైగా వున్న ఈ ఐదు రాష్ట్రాలలో వర్గ పొందిక మెరుగయింది. కాని ఈ వర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు మధ్యంతర, జిల్లా రాష్ట్ర కమిటీలలో తగిన ప్రాతినిధ్యం పొందటంలేదు. పార్టీ విస్తరణ వున్నప్పటికీ నాయకత్వ స్థాయిలో మధ్య తరగతి కామ్రేడ్స్ ఆధిక్యత ఇంకా వుంది. పునాది వర్గాల నుంచి కార్యకర్తలను తీర్చిదిద్ది ప్రమోట్ చేసేందుకు చైతన్యపూర్వకమైన కృషి జరగాలి. ఈ పునాది వర్గాల నుంచి కార్యకర్తలకు శిక్షణనిచ్చి ప్రోత్సహించటం దిద్దుబాటు కార్యక్రమం కొనసాగింపు చర్యలలో ఒకటిగా వుండాలి. ప్రజా సంఘాలలో క్రియాశీలంగా పాల్గొంటున్న వారిని పార్టీలోకి రాబట్టడంలో, మహిళా కార్యకర్తలను రాబట్టడంలో వెనకబాటుతనం వుంది. దిద్దుబాటు కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకుని అమలు జరపాలి. ఆత్మ విమర్శ చేసుకుని దిద్దుబాటు చేసుకోవాలి. పార్టీ కేంద్రం పని విధానం మెరుగయింది. అయినప్పటికీ ఇంకా మెరుగుపరచుకోవలసియుంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని దిద్దుబాటు కారక్రమాన్ని అమలు జరిపి పార్టీ పరిస్థితిని మెరుగుపరచుకోవలసిన అవసరాన్ని పార్టీ 16వ మహాసభ ఆమోదించిన రాజకీయ నిర్మాణ నివేదికలోనే పేర్కొన్నప్పటికీ, పరిస్థితి ఇంకా మెరుగుపడలేదన్న ఆదుర్దా ఆయనలో కనబడుతుంది. ముఠాతత్వం, అన్యవర్గ ధోరణులు, పార్లమెంటరీ తత్వం వంటి అవలక్షణాలు పెరగకుండా సర్వదా జాగ్రత్త పడుతూ పార్టీని కంటికి రెప్పలా కాపాడుకోవాలనేదే ఆయన తపన.

- 0 -

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No. 24894

KSRMurty
Hyderabad
9-1-2007
Tues

Rs. 15/-

PRAJASAKTI BOOK HOUSE

బాలగంగాధరరావు నీతి, నిజాయితీకి ఎప్పుడూ కట్టుబడి వుండినారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేశాడు. ఈ రోజుల్లో అటువంటి వ్యక్తులు రాజకీయాల్లో చాలా తక్కువ. ఒక మామూలు వ్యక్తిగాని, రాజకీయ వ్యక్తిగాని ఏ పార్టీకి చెందినా సరే ఆయన జీవితాన్ని తెలుసుకొని, నేర్చుకోవలసిన గుణపాఠాలు చాలా వున్నాయి.

\- జస్టిస్ ఆమంచర్ల గంగాధరరావు
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి

Rs. 30

ANUBHAVALU
GNAPAKALU